13 . 12. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శనివారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 193 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## భూకంపాలపై చర్యలకు ఆదేశించండి

### సుప్రీంలో పిటిషన్‌పై సుప్రీం ఆగ్రహం

### అందరినీ చంద్రమండలానికి తరలించాలా అని వ్యాఖ్య

**న్యూఢిల్లీ,డిసెంబర్12 వెలుతురు:**
ప్రజల్ని చంద్రుడి పైకి తరలించాలా? మరెక్కడికైనా పంపాలా? అంటూ సుప్రీంకోర్టు శుక్రవారం పిటిషనర్‌పై



# దేశంలో రెండుదశల్లో జన కుల గణన

### రూ. 11,718 కోట్లను కేటాయించిన కేంద్రం

### డిజిటల్ జనగణను చేపట్టాలని నిర్ణయం

- పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా ఉపాధిహామీ పేరు
- బీమారంగంలో వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు
- పీఎం కిసాన్ సమ్మాన్ యోజన..రూ.6,వేల నుంచి రూ.10వేలకు పెంపు
- పిఎం ఆవాస్ యోజన కింద అదనంగా 1.5 కోట్ల గృహాల నిర్మాణం
- నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తికి రూ.35,000 కోట్లతో జాతీయ మిషన్
- ఉభయ తెలుగు రాష్ట్రాలకు నాలుగేసి కేంద్రీయ విద్యాలయాలు
- రాష్ట్రాల మూలధనం పెంపునకు రూ.1.3లక్షల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీక
- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు..వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ,డిసెంబర్12 వెలుతురు:**
చారిత్రాత్మక జనగణన నిర్వహణ కోసం కేంద్ర మంత్రివర్గం ఏకంగా రూ.11,718 కోట్లకు సంబంధించిన బ్జడెట్‌ను ఆమోదించింది. అలాగే మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకం పేరును కూడా మార్చింది. పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా పేరు మారుస్తూ శుక్రవారం కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే పనిదినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచింది. ఒక రోజుకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240కి సవరించింది. ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన కేబినేట్‌లో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జనగణలో కులగణను చేర్చడంతో పాటు రెండు దశల్లో నిర్వహించాలని నిర్ణయించారు. కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వివరాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 2027లో నిర్వహించనున్న జనాభా లెక్కల్ని రెండు దశల్లో నిర్వహిస్తామని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు గృహాలను జాబితా చేసి, లెక్కిస్తామని చెప్పారు. 2027 ఫిబ్రవరి నుంచి జనాభా లెక్కల సేకరణపై దృష్టిపెడతామని చెప్పారు. ఇదే తొలి డిజిటల్ జనగణన అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ జనాభా లెక్కల్లోనే కులగణన చేస్తామని చెప్పారు. ఈ ప్రక్రియ కోసం రూ.11,718 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. రాబోయే జనగణన దేశ




## నేడు మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్

- ఉప్పల్ స్టేడియం వద్ద భారీ బందోబస్తు
- పాస్‌లు ఉన్నవారే రావాలన్న కమిషనర్

**హైదరాబాద్,డిసెంబర్12 వెలుతురు:**
ఉప్పల్ స్టేడియంలో శనివారం జరగబోయే అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఈవెంట్ కోసం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడించారు. ఈవెంట్‌కు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. మెస్సీకి జి కేటగిరీ భద్రత కల్పిస్తున్నామని, ఆయన్ని గ్రీన్ ఛానల్ ద్వారా స్టేడియంకు తీసుకువస్తామని సీపీ తెలిపారు. అయితే, వాహనంలో ఉన్నప్పుడు కూడా మెస్సీని చూసే అవకాశం ప్రేక్షకులకు ఉండదని, కాబట్టి

## సిఎం రేవంత్‌తో ఆర్థికవేత్త సుబ్రమణియన్ భేటీ

### మర్యాదపూర్వకంగానే కలిసినట్లు సమచారం



**హైదరాబాద్,డిసెంబర్12 వెలుతురు:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ ఆర్థికవేత్త, భారత ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ కలిశారు. జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు సమాచారం. అయితే వీరి భేటీలో ఇటీవలి ఫ్యూచర్ సిటీ, పెట్టుబడులు తదితర అంశాలు చర్చకు వచ్చి ఉంటాయని భావిస్తున్నారు. ఇదిలావుంటే శనివారం



## ఫ్యూచర్ సిటీ, మూసీ పునర్జీవం, వ్యవసాయాధారిత రంగాలు


### ఐటీ, ఫార్మా, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులకు అవకాశం

### జర్మనీ ప్రతినిధి బృందంతో డిప్యూటి సిఎం భట్టి, శ్రీధర్ బాబుల చర్చ



**హైదరాబాద్,డిసెంబర్12 వెలుతురు :**
ఐటీ, ఫార్మా, డిఫెన్స్ రంగాల్లో తెలంగాణలో భారీ పెట్టుబడుల అవకాశాలు ఉన్నాయని, జర్మన్ కంపెనీలు రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. భవిష్యత్ దృష్టితో నిర్మాణంలో ఉన్న భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునర్జీవనం, వ్యవసాయ ఆధారిత

## 15న సిఎం రేవంత్ చేతుల మీదుగా బాలు విగ్రహావిష్కరణ




**హైదరాబాద్,డిసెంబర్12 వెలుతురు:**
రవీంద్రభారతి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గాన గంధర్వుడు, పద్మవిభూషణ్ డా.ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణకు ముహూర్తం కుదరింది. ఈనెల 15న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ది మ్యూజిక్ గ్రూప్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.అచ్యుత రామరాజు,

### జనవరిలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు

## విస్తృత ఏర్పాట్లు

### శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు

### జాతర నాటికి పూర్తి చేస్తాం

### వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**మేడారం / హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 12 :**
ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సమ్మక్క- సారలమ్మజాతర జనవరి నెలలో ప్రారంభం కానున్న నేపథ్యంలో జాతర కోసం శాశ్వత ప్రాతిపదికన విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ ( సీతక్క), ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కెఎస్ శ్రీనివాసరాజుతో కలిసి శుక్రవారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలం శ్రీ సమ్మక్క సారలమ్మ



## హైదరాబాద్‌లో అఖిలేశ్ యాదవ్

### సిఎం రేవంత్, కెటిఆర్‌లతో వేర్వేరుగా భేటీ



**హైదరాబాద్,డిసెంబర్12 వెలుతురు:**
నగరానికి వచ్చిన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో అఖిలేష్ యాదవ్ భేటీ అయ్యారు. వివిధ రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో రాజకీయ పరిస్థితులపై ఇరువురు చర్చించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అఖిలేష్‌కు

### విజన్‌తో ముందుకెళ్తున్నాం..

## అద్భుతాలు సాధిస్తున్నాం

- అద్భుత ఐటి నగరంగా విశాఖ అభివృద్ధికి కృషి
- గూగుల్ తదితర కంపెనీల రాకతో మారుతున్న ముఖచిత్రం
- కాగ్నిజెంట్ విశాఖ క్యాంపస్ శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు




### తప్పుడు ఆరోపణలు చేస్తే

## కాళ్లు విరగ్గొడుతా



- ఎప్పటికైనా నేనూ ముఖ్యమంత్రిని అవుతా
- బిఆర్ఎస్ అక్రమాలపై విచారణ చేయిస్తా
- పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక్క రూపాయి సంపాదించలేదు
- పార్టీ నుంచి బయటకు పంపినా వారి కళ్లు చల్లారలేదా
- తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్న హరీష్ రావు
- ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావులకు నోటీసులు
- వారం రోజుల్లో క్షమాపణలు చెప్పాలని కవిత డిమాండ్

**హైదరాబాద్,డిసెంబర్12 వెలుతురు:**
తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరో సంచలన పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వరరెడ్డి, బీఆర్ఎస్

## అల్లూరి జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం

- లోయలో పడ్డ బస్సు.. పదిమంది దుర్మరణం
- చింతూరు ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు



**అల్లూరిజిల్లా,డిసెంబర్12 వెలుతురు :**
అల్లూరి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ ప్రైవేటు బస్సు అదుపు తప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో పదిమంది వరకు మృతి చెందినట్లు సమాచారం. చింతూరు నుంచి మారేడుమిల్లి వెళుతున్న బస్సు ఘాట్‌రోడ్డు వద్ద అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది.

## అంధుల మహిళా క్రికెటర్లకు పవన్ అభినందనలు

- ఒక్కొక్కరికి 5లక్షల చొప్పున చెక్కుల అందచేత
- శిక్షకులకు 2లక్షల చొప్పున చెక్కులు పంపిణీ



# దేశంలో రెండుదశల్లో జన కుల గణన

చరిత్రలోనే మొట్టమొదటి డిజిటల్ జనగణన కానుంది. ఈ జనగణన ప్రక్రియకు సంబంధించి మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా నిర్ణయించడం జరిగింది. ఈ భారీ ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జనగణన మొదటి దశ ఏప్రిల్ 2026 నుండి సెప్టెంబర్ 2026 వరకు కొనసాగుతుంది, రెండవ దశ ఫిబ్రవరి 2027లో పూర్తవుతుంది. ఇకపోతే పల్లెప్రాంత నిరుపేదలకు ఏడాదిలో వంద రోజులు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా కేంద్ర ప్రభుత్వం 'ఎన్ఆర్ఈజీఏ' పథకాన్ని 2006లో ప్రారంభించింది. తర్వాత దానిని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా పేరు మార్చారు. ఇప్పుడు మరోసారి ఆ పేరు మార్పునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బీమారంగంలో వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల బిల్లుకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సాధారణ, జీవిత, ఆరోగ్య బీమాలో 74శాతం వరకు ఎఫ్‌డీఐకి అనుమతి ఉంది. ఈ రంగంలోకి ఎఫ్‌డీఐలకు పూర్తిగా అనుమతి నిస్తే, దేశీయ పెట్టుబడులూ పెరిగే అవకాశం ఉందని కేంద్రం అంచనావేస్తోంది. 100 శాతం ఎఫ్‌డీఐకి అనుమతిస్తే, విదేశీ సంస్థలు భారతీయ కంపెనీలపై ఆధారపడకుండా సొంతంగా పనిచేయడానికి ఆస్కారం ఏర్పడుతుందని, దీనివల్ల ఈ రంగానికి మేలు జరిగే అవకాశాలున్నాయని అభిప్రాయపడుతోంది. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గ ఆమోదం లభించింది.కేబినెట్ తీసుకున్న ఆర్థికపరమైన నిర్ణయాల గురించి మంత్రి వైష్ణవ్ మాట్లాడుతూ.. దేశీయ ఉత్పత్తి సామర్థ్యం పెరుగుదలను కూడా ప్రస్తావించారు. దేశంలో దేశీయంగా ఉత్పత్తి పెరగడం వలన, ఆర్థికపరమైన నిర్ణయాల సానుకూల ఫలితంగా దేశానికి సుమారు రూ.60,000 కోట్ల విదేశీ కరెన్సీ ఆదా అవుతోందని మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. బొగ్గు గనుల్లో పలు సంస్కరణలు తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన.. ఈ పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6,000 నుంచి రూ.10,000 వరకు పెంచాలని నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 57 కొత్త కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణకు 4, ఆంధ్రప్రదేశ్ కి 4 మంజూరు చేసింది. నాలుగు కీలకమైన రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి రూ.2,000 కోట్ల ఆర్థిక సహాయం అందించనున్నారు. పీఎం కిసాన్ సంపద యోజన.. ఈ పథకానికి రూ.6,520 కోట్లు కేటాయింపు ఇవ్వనున్నారు. క్వాంటం టెక్నాలజీ పరిశోధన,అభివృద్ధిని ప్రోత్సహించడానికి అదనంగా రూ.4,000 కోట్ల నిధులు కేటాయించనున్నారు. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ లకు బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు లభించేందుకు వీలుగా రూ.15,000 కోట్లతో కొత్త క్రెడిట్ గ్యారెంటీ పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేశంలోని డిజిటల్ మౌలిక సదుపాయాలను రక్షించడనాకి సైబర్ దాడులను నిరోధించడానికి సైబర్ సెక్యూరిటీ పాలసీకి ఆమోదం తెలిపింది. సెమీకండక్టర్ తయారీని ప్రోత్సహించేందుకు రూ.12,000 కోట్లు కేటాయింపు. కొత్త సెమీకండక్టర్ తయారీ కర్మాగారాలను నెలకొల్పే సంస్థలకు ఆర్థిక సహాయం పెంపు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అదనంగా 1.5 కోట్ల గృహాలను నిర్మించడానికి ఆమోదం ఇచ్చింది. . చిన్న ఉపగ్రహాలను ప్రయోగించడానికి వీలుగా తమిళనాడులోని కులశేఖరపట్నం వద్ద కొత్త ప్రయోగ వేదిక నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ తెలిపింది. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని రక్షణ రంగంలో బలోపేతం చేయడానికి, రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితి పెంపునకు ఆమోదం అలభించింది. దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం వైద్య సేవలను అందించడానికి నేషనల్ టెలి-మెడిసిన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు ఆమోదం ఇచ్చింది. నీటిపారుదల పథకాలకు జాతీయ మిషన్ ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 50 ప్రధాన, మధ్యస్థ నీటిపారుదల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి రూ.35,000 కోట్లతో ఒక కొత్త జాతీయ మిషన్‌ను ప్రారంభించేందుకు కేబినెట్ లైన్ క్లియర్ చేసింది. భారత్ నెట్ ప్రాజెక్ట్ కింద ఇంటర్నెట్ సేవలు. ఇందుకోసం అదనంగా రూ.8,000 కోట్ల నిధులు కేటాయింపు ఇవ్వనున్నారు. రాష్ట్రాల ఆర్థిక బలోపేతం కోసం ప్రత్యేక ప్యాకేజీ. ఇందులో భాగంగా రాష్ట్రాలు తమ మూలధనం పెంచుకోవడానికి.. వడ్డీ లేని రుణాల రూపంలో రూ.1.3లక్షల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## తప్పుడు ఆరోపణలు చేస్తే కాళ్లు విరగ్గొడుతా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, టీ న్యూస్‌లకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం లీగల్ నోటీసులు పంపించారు. ఈ నోటీసులో పలు అంశాలను ప్రస్తావించారు. తనపై, తన భర్త అనిల్‌పై ఆధారాలు లేని ఆరోపణలు చేశారంటూ నోటీసులో తెలిపారు. వారం రోజుల్లో తనకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయం తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ టార్గెట్‌గా జాగృతి అధ్యక్షురాలు కవిత మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు, కేటీఆర్, కేసీఆర్‌ను ఒక్క సహాయం కూడా అడగలేదని తెలిపారు. ఉద్యమంలో ఎవరు ఏమి చేశారనేది తాను ఎప్పుడూ చెప్పలేదన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావుతో హరీష్, బీఆర్ఎస్ తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతల అక్రమాలు తన దృష్టికి వస్తున్నాయని... అసలు కథ ముందుంది అంటూ కామెంట్స్ చేశారు. నేను మంచి దాన్ని కాదు. కాళ్ళు విరగొడతానంటూ హెచ్చరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. అధికారంలో ఉన్న పదేళ్లలో తాను, తన భర్త ఒక్క పని అయినా అడిగామా అని ప్రశ్నించారు. తాను ఏ తప్పూ చేయలేదని.. బీఆర్ఎస్‌లో 10 ఏళ్లలో ఒక్క రూపాయి సంపాదించ లేదని స్పష్టం చేశారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు వారం రోజుల్లో క్షమాపణలు చెప్పాలని.. లేదంటే కోర్టుకి ఈడుస్తామని వార్నింగ్ ఇచ్చారు. తనను పార్టీ నుంచి పంపించారని.. అయినా వాళ్ల కళ్ళు చల్లబడలేదా అని వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కిటికీలు తెరిచిందని.. కాంగ్రెస్ డోర్స్ ఓపెన్ చేసిందన్నారు. తనపై ఎవ్వరు ఎలాంటి ఆరోపణలు చేసినా జవాబు చెబుతానన్నారు. బీఆర్ఎస్ హయాంలో చాలా తప్పిదాలు జరిగాయని... అవి తన దృష్టికి వస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ వాళ్ళు తప్పు చేశారనే.. రేవంత్ అధికారంలోకి వచ్చారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన లావాదేవీలకు, కాంగ్రెస్‌కు సంబంధం ఉందని ఆరోపించారు. 'నేను ఏదో ఒక రోజు ముఖ్యమంత్రి అవుతా. హరీష్ రావు.. విజ్ఞత అని తప్పించుకుంటున్నారు. లైన్‌లు నేను దాట లేదు. నేను ఇంకా ఊరుకోను ' అంటూ కవిత సంచలన కామెంట్స్ చేశారు. కాంగ్రెస్‌తో అంటకాగుతున్నట్లు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. వెకిలి చేష్టలు చేస్తున్న గుంట నక్కలూ.. జాగ్రత్త అని ఆమె హెచ్చరించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. 'కేసీఆర్‌తో పాటు ఎవరినైనా ఒక్క పనైనా అడిగామా? దమ్మెుంటే నా ఆరోపణలకు సమాధానం ఇవ్వండి. నాకు ఎవరితోనూ అవగాహన లేదు.. వ్యాపారాలు లేవు. మాధవరం కృష్ణారావుకు నోటీసులు పంపుతున్నా. వారంలో క్షమాపణ చెప్పకపోతే కోర్టుకు ఈడుస్తాను. ఏవీరెడ్డితో పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి భూలావాదేవీలు ఉన్నాయి. శ్రీనివాస్‌రెడ్డి నిరంతరం కేటీఆర్ వద్ద ఉంటారు. ఆయన ఎవరి బినామీనో చెప్పాలి. మాధవరం కృష్ణారావు చాలా చిన్న వ్యక్తి. ఓ గుంట నక్క ఆయన వెనక ఉండి ఆడిస్తోంది. కృష్ణారావు బాధితులు చాలామంది నాకు ఫోన్లు చేస్తున్నారు. ప్రణీత్, ప్రణవ్ కంపెనీల్లో కృష్ణారావు కుమారుడు డైరెక్టర్. ఆ కంపెనీల విల్లాలన్నీ కబ్జాల్లో కట్టినవే. వెంచర్ మధ్యలోని 10 ఎకరాల చెరువు 6 ఎకరాలకు ఎలా తగ్గింది అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా ఆ చెరువు సంగతి చూడాలి. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో అభివృద్ధి పేరిట చెరువునే మింగేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో నాకు సంబంధం లేదు. ఎంపీగా ఉన్నప్పుడు దిల్లీ, నిజామాబాద్‌కే పరిమితమయ్యా. పార్టీ నుంచి వెళ్లగొట్టారు కదా.. ఇంకా కళ్లు చల్లబడలేదా? హిల్ట్ పాలసీకి బీఆర్ఎస్ కిటికీలు తెరిస్తే.. కాంగ్రెస్ ద్వారాలు తెరుస్తోంది. నాతో పాటు నా భర్తపై బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తోంది. గత ప్రభుత్వంలో చాలా తప్పిదాలు జరిగాయి. దేవుడి దయతో నేను ముఖ్యమంత్రి అవుతాను. 2014 నుంచి జరిగిన అన్ని అన్యాయాలను వెలికితీస్తాను అని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి జనం బాట పేరిట కవిత విస్తృతంగా పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జనం బాట చేపట్టినట్లు కవిత ప్రకటించారు. మొదటగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జనం బాట కార్యక్రమం చేపట్టిన కవిత ఇప్పుడు మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలో పర్యటిస్తున్నారు. గురువారం నగరంలోని మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో పర్యటించారు కవిత. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను కవిత తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై షాకింగ్ కామెంట్స్ చేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు మాధవరం కృష్ణారావు కూడా కౌంటర్ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు కవిత నోటీసులు పంపించినట్లు సమాచారం.

## విజన్‌తో ముందుకెళ్తున్నాం.. అద్భుతాలు సాధిస్తున్నాం

**విశాఖపట్టణం,డిసెంబర్12 వెలుతురు:**
ఒక విజన్‌తో ముందుకెళ్తూ.. అద్భుతాలు సాధిస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖపట్నంలో కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు ఐటీ మంత్రి లోకేశ్, ఆ సంస్థ ప్రతినిధులతో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. కాగ్నిజెంట్, సత్వా సంస్థతో పాటు మరో ఏడు ఐటీ సంస్థలకు భూమిపూజ చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి విశాఖపట్నం కేంద్రంగా మారబోతోందని చెప్పారు. ఎకనమిక్ రీజియన్ కింద నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాగ్నిజెంట్‌కు భారత్‌లో ఐదు సెంటర్లు చెన్నై, హైదరాబాద్, పుణె, బెంగళూరు, కోల్‌కతాలో ఉన్నాయి. హెల్త్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ప్రొడక్ట్స్ అండ్ రిసోర్సెస్ రంగాల్లో ముందున్నారు. భారత్ నుంచే 2,41,500 మంది కాగ్నిజెంట్ సంస్థకు పనిచేస్తున్నారు. వీరిలో దాదాపు 80 శాతం మంది భారతీయులే. సంస్థ చీఫ్ కూడా మన దేశానికి చెందిన వ్యక్తే.. అదీ మన భారతీయుల శక్తి. ఒకవైపు సముద్రం, మరోవైపు కొండలతో అందంగా ఉండే ప్రాంతం విశాఖపట్నం. త్వరలో ఇక్కడికి మెట్రో కూడా వస్తుంది. అన్ని విధాలుగా అనుకూలమైన నగరమిది. ఒక విజన్‌తో ముందు కెళ్తున్నాం.. అద్భుతాలు సాధిస్తున్నాం అని చంద్రబాబు అన్నారు.కాగ్నిజెంట్ పెట్టుబడులతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఐటీ సంస్థల పెట్టుబడులతో విశాఖకు మరింత వెలుగు వచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారాం. రాయితీ ప్యాకేజీపై నిన్నటి మంత్రివర్గంలో కూడా చర్చించాం. మౌలిక సదుపాయాల కల్పనలో ఒక అడుగు ముందున్నాం. రియల్‌టైమ్‌లో కార్యకలాపాలు ప్రారంభం కావడమే మాకు కావాల్సింది. గత 18 నెలల నుంచి అనేక సంస్థలు పెట్టుబడులకు ముందుకొచ్చాయి. వాటికి వెంటనే భూ కేటాయింపులు జరుగుతున్నాయి. జాప్యం లేకుండా అన్ని అనుమతులు మంజూరు చేస్తున్నాం. విజనరీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడం అదృష్టం'అని లోకేశ్ అన్నారు. విశాఖలోని కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. దాదాపు 8,000 మంది ఉద్యోగులు పనిచేసేలా అత్యాధునిక వసతులతో క్యాంపస్ నిర్మాణం జరుగనుంది. మొత్తం రూ.1,583 కోట్ల పెట్టుబడితో 2033 నాటికి 3 దశల్లో కాగ్నిజెంట్ టెక్నాలజీస్ క్యాంపస్ పూర్తి కానుంది. 2026 నాటికి మొదటి దశ నిర్మాణం పూర్తి చేసుకోనుంది కాగ్నిజెంట్. అప్పటి వరకు అద్దె కార్యాలయంలో కార్యకాలపాలను ఆ సంస్థ కొనసాగించనుంది. ప్రధానంగా ఏఐ, మెషీన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై కాగ్నిజెంట్ దృష్టి సారించింది. కాగ్నిజెంట్‌తో పాటు మరో 8 ఐటీ సంస్థలకు కూడా విశాఖలో క్యాంపస్‌ల ఏర్పాటుకు భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్, విశాఖ ఎంపీ భరత్, కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్ పాల్గొన్నారు. త్వరలోనే విశాఖ నుంచి టెక్ తమ్మిన, సత్వ డెవలపర్స్, ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ ఇండియా, ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్, మదర్సన్ టెక్నాలజీస్, క్వార్ట్స్ టెక్నోసాఫ్ట్, ఏసీఎన్ హెల్త్ కేర్ ఆర్సీఎం సర్వీసెస్, నాన్రెల్ టెక్నాలజీస్ సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించనున్నాయి. సంస్థల ద్వారా రాష్ట్రానికి రూ. 3,740 కోట్ల పెట్టుబడులు, దాదాపు 41,700 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. గూగుల్ రాకతో ఇప్పటికే డేటా సిటీగా విశాఖ ఎదుగుతోంది. కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి సంస్థలు ప్రారంభించడంతో విశాఖ వైపు ప్రముఖ ఐటీ కంపెనీల చూపు పడింది. ప్రస్తుతం విశాఖలో 150కి పైగా టెక్ కంపెనీల కార్యకలాపాలు సాగుతున్నాయి. రాష్ట్రంలో ఐటీ నిపుణులకు విస్తృతంగా అవకాశాలు పెరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ 18 నెలల్లో ఒక్క విశాఖలోనే రూ.1.34 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు వచ్చాయి.

## అల్లూరి జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం

ఘటనాస్థలి వద్ద ప్రయాణికులు హాహాకారాలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో నిండుగా ప్రయాణికులున్నారు. భద్రాచలంలో ఆలయ దర్శనం చేసుకొని అన్నవరానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు స్థానికుల సాయంతో మృతదేహాలను బస్సు నుంచి వెలికితీశారు. గాయపడిన వారిని వెంటనే చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. 3 అంబులెన్సులు, 5 పోలీసు వాహనాలతో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఈ బస్సు ప్రమాదం కారణంగా ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనేక వాహనాలు ఘాట్ రోడ్డులో నిలిచిపోయినట్టు సమాచారం. ప్రమాదానికి గురైన వారందరు చిత్తూరు జిల్లావాసులని అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల్లో దాదాపు అందరు వృద్ధులు అని వివరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో 30 మంది బస్సులో ఉన్నట్లు తెలుస్తోంది.



సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసిపాకలు ఘాట్ రోడ్‌లో చోటుచేసుకున్న బస్సు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భద్రాచలం నుంచి అన్నవరం వెళుతున్న ప్రైవేటు బస్సు లోయలో పడిన ఘటనలో పలువురు మృతి చెందడంపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. బస్సు ప్రమాదం, క్షతగాత్రులకు అందుతున్న సాయంపై అధికారులతో మాట్లాడారు. బస్సులో మొత్తం 35 మంది ప్రయాణీకులు ఉన్నారని, పలువురు మృతి చెందగా గాయపడిన వారిని చింతూరు ఆసుపత్రికి తరలించామని అధికారులు ముఖ్యమంత్రి తెలియజేశారు.ద్రాచలం సమీపంలో తులసిపాక వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం పట్ల సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు దిగ్భాం÷-రతి వ్యక్తం చేశారు. మరణించినవారికి తీవ్ర సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధితులకు అండగా సిపిఎం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించాలని స్థానిక నాయకత్వాన్ని, కార్యకర్తలను కోరారు. ప్రభుత్వం తక్షణం సహాయం అందించి క్షతగాత్రులను, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్




అనవసరంగా రోడ్డుపైకి వచ్చి చూసే ప్రయత్నం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. స్టేడియం సామర్థ్యం 39 వేలు అని, దానికి తగ్గట్టుగానే నిర్వాహకులు పాస్‌లు అమ్ముతున్నారని, అయితే స్టేడియం దగ్గర ఎలాంటి పాస్‌లు అమ్మబడవని, కేవలం ఆన్‌లైన్ లోనే పాస్‌లు అమ్మబడతాయని క్లారిటీ ఇచ్చారు. పాసులు ఉన్నవారు మాత్రమే రావాలని, లేనివారు స్టేడియం వద్దకు రావద్దని స్పష్టం చేశారు సీపీ. భద్రత కోసం స్టేడియం పరిసరాల్లో 450 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షిస్తామని తెలిపారు. అంతేకాకుండా, మోస్ట్ అడ్వాన్స్‌డ్ డ్రోన్‌లతో కూడా నిఘా పెడుతున్నట్లు చెప్పారు. రేపు సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం అవుతుందని, సాయంత్రం 4 గంటల నుంచే ప్రేక్షకులను లోపలికి అనుమతిస్తామని సీపీ పేర్కొన్నారు. మెస్సీ కొద్దిసేపు మాత్రమే ఆడతారు కాబట్టి, ప్రేక్షకులు ముందస్తుగానే స్టేడియం చేరుకోవాలని సూచించారు. భద్రతా కారణాల దృష్ట్యా, ల్యాప్ టాప్‌లు, బ్యానర్లు, వాటర్ బాటిళ్లు, కెమెరాలు, సిగరెట్లు, గొడుగులు, లైటర్లు, బైనాకులర్లు, బ్యాటరీలు, షార్ప్ ఆ÷-జబెక్ట్స్, హెల్మెట్, బ్యాగ్ వంటి వస్తువులకు స్టేడియం లోపలికి అనుమతి లేదని, కేవలం మొబైల్ ఫోన్‌లను మాత్రమే అనుమతిస్తున్నట్లు సీపీ సుధీర్ బాబు తెలిపారు..

## హైదరాబాద్‌లో అఖిలేశ్ యాదవ్

రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పర్యటిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష నేతలను కలుస్తూ తాజా రాజకీయ పరిస్థితులపై చర్చిస్తున్నారు. జూబ్లీ హిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన అఖిలేశ్.. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత కాసేపటికి నందినగర్‌లోని కేటీఆర్ నివాసానికి అఖిలేశ్ యాదవ్ చేరుకోగా బీఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్, హరీష్ రావుతో భేటీ అయ్యారు. తెలంగాణ తాజా రాజకీయ అంశాలపై నేతలంతా చర్చించారు. అనంతరం హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దకు చేరుకున్న అఖిలేశ్.. యాదవ సంఘాల సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. వేర్వేరు పార్టీల్లో ఉన్నా యాదవులంతా ఒక్కటేనని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అందరం కలుసుకున్నట్లు చెప్పుకొచ్చారు. సదర్ సమ్మేళనానికి గొప్పగా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. యూపీలో బీజేపీని వెనక్కి నెడుతున్నాము.. ఏపీ సపోర్ట్ లేకపోతే కేంద్రంలో బీజేపీ వచ్చేది కాదని అఖిలేశ్ యాదవ్ తెలిపారు.

## భూకంపాలపై చర్యలకు ఆదేశించండి

ఆగ్రహం వ్యక్తం చేసింది. భారతదేశ జనాభాలో 75 శాతం మంది భూకంపాల జోన్‌లోనే ఉన్నారని, భూకంపాల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడానికి అధికారులు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ అత్యున్నత న్యాయస్థానం, ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ముందు వినిపించేందుకు పిటిషనర్ స్వయంగా హాజరయ్యారు. గతంలో ఢిల్లీ మాత్రమే అధిక భూకంప జోన్ భాగంలో ఉండేదని, కానీ ఇటీవల భారత్ జనాభాలో 75 శాతం మంది ఈ జోన్ లో ఉన్నారని తెలిపారు. దీనికి ప్రతిగా..అయితే మనం అందర్ని చంద్రుడిపైకి లేదా మరెక్కడికైనా తరలించాలా అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. ఇటీవల జపాన్ లో పెద్ద భూకంపం వచ్చిందని పిటిషనర్ చెప్పారు. మనం ముందుగా ఈ దేశంలోకి అగ్నిపర్వతాలు తీసుకురావాలి, అప్పుడు మనం భారత్‌ను జపాన్‌తో పోల్చవచ్చు అని ధర్మాసనం పేర్కొంది. భూకంపం సంభవించినప్పుడు నష్టాన్ని తగ్గించడానికి అధికారులు ఏర్పాట్లు చేయాలని పిటిషనర్ కోరారు. దీనికి ప్రతిగా అది ప్రభుత్వం చూసుకోవాల్సిన విషయమని, ఈ కోర్టు దీనిని చేయలేదని, పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ధర్మాసనం చెప్పింది.

## అంధుల మహిళా క్రికెటర్లకు పవన్ అభినందనలు

అమరావతి,డిసెంబర్12 **వెలుతురు** :ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. మహిళా అంధ క్రికెటర్లు సాధించిన విజయం దేశానికే గర్వకారణమన్నారు.శుక్రవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో క్రికెటర్లు, శిక్షకులు, సహాయక సిబ్బందితో డిప్యూటీ సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచ కప్ సాధించిన క్రికెటర్లను అభినందించిన పవన్.. ఒక్కో క్రికెటర్‌కు రూ.5 లక్షల చొప్పున, శిక్షకులకు రూ.2 లక్షలు చొప్పున చెక్కులు అందించారు. ప్రతి మహిళా క్రికెటర్‌కు పట్టు చీర, శాలువాతో పాటు జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీతో కూడిన బహుమతులను అందించి సత్కరించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ మాట్లాడుతూ.. అంధ క్రికెటర్ల ప్రాక్టీస్ కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని.. అన్ని విధాలా అండగా నిలవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. మహిళా క్రికెటర్లు తెలిపిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ప్రపంచ కప్ గెలిచిన జట్టులో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు దీపిక (జట్టు కెప్టెన్), పాంగి కరుణా కుమారి ఉండటం సంతోషంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఇక ఈ సమావేశంలో భాగంగా జట్టు కెప్టెన్ దీపిక తమ గ్రామ సమస్యలను ఉపముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కావాలని దీపిక విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన పవన్.. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన క్రికెటర్ కరుణ కుమారి చేసిన విజ్ఞప్తులపైనా తక్షణమే చర్యలు ప్రారంభించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు.

## సిఎం రేవంత్‌తో ఆర్థికవేత్త సుబ్రమణియన్ భేటీ

నగరంలో జరగబోయే 'మెస్సీ గోట్ ఇండియా టూర్' అనేది ఓ ప్రైవేట్ ఈవెంట్ అయినప్పటికీ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ప్రత్యేకంగా హాజరు కావాల్సిందిగా కోరినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరే ముందు ముఖ్యమంత్రి అక్కడి మీడియాతో మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ ఫుట్ బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ ఈనెల 13న హైదరాబాద్ వస్తున్నారని.. ఓ ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని సీఎం చెప్పారు.ఈ కార్యక్రమానికి తననూ ప్రత్యేక అతిథిగా పిలిచారని.. అయితే ఇది ప్రభుత్వానికి సంబంధం లేని ఈవెంట్ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెస్సీతోపాటు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ వంటి అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొంటారు. అయితే, ఈ కార్యక్రమంలో మెస్సీ వర్సెస్ రేవంత్ రెడ్డి జట్లు 5 నిమిషాలపాటు మ్యాచ్ ఆడనున్నారు. మెస్సీతోపాటు ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఫ్యూచర్ సిటీ, మూసీ పునర్జీవం, వ్యవసాయాధారిత రంగాలు

రంగాల అభివృద్ధి వంటి ప్రాజెక్టుల్లో కూడా జర్మన్ సంస్థలకు కీలక అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం, జర్మనీ మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా శుక్రవారం ప్రజాభవన్‌లో కీలక సమావేశం జరిగింది. డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కలిసి జర్మనీ పార్లమెంట్ ప్రతినిధి బృందంతో విస్తృతంగా చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య ఐటీ, డిఫెన్స్, ఫార్మా, మెటలర్జీ, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కీలక రంగాల్లో సంయుక్త భాగస్వామ్యానికి మార్గాలు అన్వేషించడంపై ఈ సమావేశం దృష్టి సారించింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జర్మనీతో తెలంగాణకు ఉన్న సుదీర్ఘ స్నేహ బంధాన్ని గుర్తుచేశారు. తెలంగాణ యువతను జర్మనీ పరిశ్రమలకు అనుసంధానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేకంగా జర్మన్ లాంగ్వేజ్ విభాగాన్ని ఏర్పాటు చేస్తే, జర్మనీలో ఉన్న ఉపాధి అవకాశాలు తెలంగాణ విద్యార్థులకు మరింత చేరువవుతాయని వివరించారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో తెలంగాణ ఇప్పటికే ముందు వరుసలో ఉందని మంత్రి శ్రీధర్ బాబు జర్మన్ బృందానికి వివరించారు. హైదరాబాద్ సైబర్ ఎక్సలెన్స్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక యూనిట్లు, జిల్లాల స్థాయిలో ఏర్పాటు చేస్తున్న సైబర్ సెక్యూరిటీ వింగ్స్, ఆర్థిక నేరాలను ఎదుర్కొనే ఆధునిక ౦ఎ టూల్స్?జ్ఙీ÷ ఈ చర్యలు తెలంగాణను దేశంలోనే అత్యాధునిక సైబర్ సెక్యూరిటీ హబ్‌గా నిలిపాయని పేర్కొన్నారు. ఈ రంగంలో జర్మనీ భాగస్వామ్యం రాష్ట్రాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్తుందని ఆయన తెలిపారు. సమావేశంలో పాల్గొన్న జర్మన్ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్'ను ప్రత్యేకంగా ప్రశంసించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రతి రంగంలో స్పష్టమైన లక్ష్యాలు, నిర్మాణాత్మక ప్రణాళికలు ఉండటం అభినందనీయమని అభిప్రాయపడ్డారు. సైబర్ సెక్యూరిటీ, స్కిల్డ్ లేబర్ ఎక్స్ఛేంజ్, విద్య, పరిశ్రమల రంగాలలో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. జర్మన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఇప్పటికే భారతదేశంలో జర్మనీ పెట్టుబడులు భారీ స్థాయిలో ఉన్నాయని, ముఖ్యంగా బోష్ వంటి మెగా కంపెనీలు తెలంగాణలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం జర్మనీలో 60,000 మంది భారతీయ విద్యార్థులు చదువుతున్నారని, తెలంగాణ యువత ప్రతిభ అంతర్జాతీయంగా అత్యంత గుర్తింపు పొందుతోందని వ్యాఖ్యానించారు. ఎనిమిది మంది జర్మన్ పార్లమెంట్ సభ్యులతో పాటు సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ తరఫున ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఇందన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్కో సీఎండీ కృష్ణభాస్కర్, జెన్‌కో సీఎండీ హరీష్, ప్రణాళిక శాఖ సెక్రటరీ బుద్ధప్రకాశ్ జ్యోతి తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## తెలంగాణ కుంభమేళా - మేడారం మహా జాతర



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 12:** కోట్లాది భక్తులు కొంగు బంగారంగా పిలిచే తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క%–%సారక్క మహా జాతరను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి కొండా సురేఖ పర్యవేక్షణలో రూ. 251 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సమ్మక్క – సారక్క గద్దెల పునర్నిర్మాణం, రహదారి విస్తరణ, సమగ్ర పార్కింగ్ సౌకర్యాలు, భక్తుల కోసం ఆధునిక వసతుల ఏర్పాటు వేగంగా జరుగుతున్నాయి. సమ్మక్క – సారక్కల ఘనతను ప్రపంచానికి చాటి చెప్పేలా, మేడారం జాతరకు శాశ్వత ముద్ర వేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

## 15న సిఎం రేవంత్ చేతుల మీదుగా బాలు విగ్రహావిష్కరణ

కార్యదర్శి బి.ఎస్.కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. బాలు విగ్రహాన్ని రవీంద్రభారతి ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు అనుమతినిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పాల్గొని బాలు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎంపీ డా.మల్లురవి, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొంటారన్నారు. సాయంత్రం 4 గంటలకు బాలు నివాళిగా పాడుతా తీయగా సినీ సంగీత స్వర నీరాజనం ప్రారంభమవుతుందన్నారు. ప్రముఖ సినీ సంగీత దర్శకులు కీరవాణి, తమన్, నేపథ్య గాయకులు, బాలు కుటుంబ సభ్యులు పాల్గొంటారన్నారు. వేడుకలో హాజరు కావాలనుకునే సంగీత ప్రియులు, కళాప్రియులకు ఎంట్రీ పాసుల కోసం ఈనెల 14న సాయంత్రం 3 గంటల నుంచి రవీంద్రభారతిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## హైదరాబాద్‌లోని సీజీఓ టవర్స్‌లో హస్తకళల ప్రదర్శన, విక్రయ కార్యక్రమం విజయవంతం




**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 12, 2025:** జౌళి మంత్రిత్వ శాఖకు చెందిన డెవలప్‌మెంట్ కమిషనర్ (హస్తకళలు) కార్యాలయం పరిధిలోని హస్తకళల సేవా కేంద్రం



హైదరాబాద్ లో రెండు రోజులపాటు నిర్వహించిన హస్తకళల ప్రదర్శన, విక్రయ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

కవాడిగూడలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల భవనంలో డిసెంబర్ 11, 12 వ తేదీల్లో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమం, డిసెంబర్ 8 నుంచి 14 వరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న హస్తకళల వారోత్సవాలలో భాగంగా జరిగింది. రాష్ట్ర అవార్డు గ్రహీతలు, జీఐ ట్యాగ్ పొందిన కళాకారులు సహా నైపుణ్యం కలిగిన చేతివృత్తుల వారు తమ ప్రదర్శనలతో సందర్శకులను మంత్రముగ్ధులను చేశారు. హైదరాబాద్ లక్క గాజులు, చెరియాల్ పెయింటింగ్, మాస్క్ తయారీ, నిర్మల్ పెయింటింగ్, జరీ, జర్దోజీ ఎంబ్రాయిడరీ, ముత్యాల అభరణాలు, మండల పెయింటింగ్, టెర్రకోట, కుండలు, డ్రై ఫ్లవర్ క్రాఫ్ట్, వుడ్ టర్నింగ్, లక్కర్‌వేర్ వంటి తెలంగాణ సాంప్రదాయ హస్తకళల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల భవనం, ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్ కార్యాలయాల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాకారులతో ముచ్చటించి వారి అద్భుతమైన పనితనాన్ని ప్రశంసించారు. ప్రదర్శనలోని అందమైన హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేసి వారికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమం చేతివృత్తుల వారి నైపుణ్యాలను ప్రదర్శించడానికి, తెలంగాణ గొప్ప హస్తకళ వారసత్వ సంపదను ప్రోత్సహించడానికి, జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలిచింది. దేశ సాంప్రదాయ హస్తకళలను పరిరక్షించడం, ప్రోత్సహించడంలో జౌళి మంత్రిత్వ శాఖ అచంచలమైన నిబద్ధతను ఇది తెలియజేస్తుంది.

# ఫుట్ బాల్ సరదా కోసం సీఎం 100 కోట్లు ఖర్చు చేస్తున్నారు ..!?

- **ఎవడబ్బ సొమ్మని 100 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు...?**
- **ఇచ్చిన హామీలు అమలు చేయని సీఎంను ప్రజలే ఫుట్ బాల్ ఆడుకుంటారు...!**
- **బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**
- **సింగరేణి నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని బిజెపి ధర్నా.**
- **శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో బిజెపి తెలంగాణ ధర్నా.**
- **లక్డీకాపూల్ లోని సింగరేణి భవన్ వద్ద చేపట్టిన ధర్నా.**
- **ధర్నాకు వచ్చిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి ని అరెస్టు చేసిన పోలీసులు**

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 12:**



ఎవడబ్బ సొమ్మని సీఎం రేవంత్ రెడ్డి తన ఫుట్ బాల్ సరదా కోసం రూ.వంద కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, ప్రజాధనంతో ఫుట్‌బాల్ ఆడుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి .. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు నిన్ను ఫుట్ బాల్ ఆడుకుంటారనీ బిజెపి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేస్తూ పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే

- సీఎం ఫుట్ బాల్ సరదా కోసం రూ.100 కోట్లకుపైగా ఖర్చు పెట్టడం ప్రజాధనం దుర్వినియోగం కాదా.. ఇది ముమ్మాటికి ఆర్థిక నేరమేనన్నారు..
- ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మెస్సీతో ఫుట్ బాల్ మ్యాచ్ ఆడడానికి ప్రభుత్వం రూ.ఎన్ని కోట్లు ఖర్చు చేస్తోందో, ఏ యో శాఖల నుంచి ఖర్చు చేస్తోందో, ఎందుకు ఖర్చు చేస్తోందో సీఎం వివరణ ఇవ్వాలి.
- సీఎం రేవంత్ టీమ్ ను సింగరేణి స్పాన్సర్ చేస్తోందని మీడియాలో చూసాను. ఈ ఫుట్ బాల్ ఆట కోసం సింగరేణి డబ్బులను ఎంత ఖర్చు చేస్తున్నారు. ఎందుకు ఖర్చు చేస్తున్నారు.
- ఇవే డబ్బులను సింగరేణిలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడానికి లేదంటే కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయవచ్చు కదా
- ప్రభుత్వ శాఖలేవైనా దుబారా ఖర్చులు చేస్తే ను కట్టడి చేయాల్సిన సీఎం, స్వయంగా తన సరదా కోసం దుబారా చేయడం ఆర్థిక నేరమే
- మెస్సీ టీమ్ తో రేవంత్ టీమ్ ఫుట్ బాల్ ఆడడం వల్ల రాష్ట్రానికి వచ్చే ప్రయోజనమేంటో సీఎం చెప్పాలి.
- అంతర్జాతీయ ఫుట్ బాల్ దిగ్గజం లియోనిల్ మెస్సీ ఒక ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడితే, అప్పీయరెన్స్ ఫీజు కింద రూ.70 కోట్లు తీసుకుంటారని మీడియా చూసా( %ూబఎయవష్ శీ జశీతీతీవష్ఱశీఅ%). మరి మెస్సీకి ఇచ్చే అప్పీయరెన్స్ ఫీజు ఏ ప్రభుత్వ శాఖ ఇస్తోంది. దాని వల్ల కలిగే ప్రయోజనమేంటి
- మెస్సీకి ఇచ్చే మొత్తంతోపాటు ఆయన వ్యక్తిగత భద్రత సిబ్బందికి వసతి, విమాన ఖర్చులను ప్రభుత్వమే భరిస్తున్నది. అంతా కలిపి రూ.వంద కోట్లకుపైగా ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది.
- సింగరేణి, పర్యాటక, క్రీడల శాఖల నుంచి నిధులను మెస్సీ టూర్ కు మళ్లించినట్టు సమాచారం. ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ తో ఈ మూడు శాఖలకు కలిగే ప్రయోజనమేంటి
- దేశంలోనే అత్యుత్తమ పది క్రికెట్ గ్రౌండ్లలో ఒకటైన ఉప్పల్ స్టేడియానికి ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ తో తూట్లు పొడుస్తున్నారు.
- ఈ ఎగ్జిబిషన్ మ్యాచ్ కోసం ఉప్పల్ క్రికెట్ గ్రౌండును ఫుట్ బాల్ గ్రౌండుగా మార్చాలి. మ్యాచ్ ముగిసాక మళ్లీ దాన్ని క్రికెట్ గ్రౌండుగా మార్చాలి. దీని కోసం రూ.10 కోట్ల వరకు ఖర్చు కావచ్చుట. మరి ఇదంతా దుబారా కాదా, దీని వల్ల ఉప్పల్ క్రికెట్ గ్రౌండ్ నాణ్యత దెబ్బతినదా
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన సింగరేణి శాఖను సీఎం రేవంత్ టీమ్ కు స్పాన్సరుగా ఉండడానికి ఎందుకు అంగీకరించారో చెప్పాలి.
- సీఎం రేవంత్ రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పూర్తిగా సరెండర్ అయ్యారు. భట్టి ఆర్థిక శాఖ బిల్లుల క్లియరెన్సుకు 30 శాతం కమిషన్లు తీసుకుంటున్నా సీఎం పట్టించుకోవడం లేదు. అందుకే ఇపుడు సీఎం రేవంత్ ఫుట్ బాల్ సరదా కోసం డిప్యూటీ సీఎం తన సింగరేణి శాఖ ద్వారా పూర్తిగా సహకరిస్తున్నారు
- రేవంత్ రెడ్డి కాలేజీ రోజుల్లో ఫుట్ బాల్ ఆడేవారట. అప్పటి సరదా తీర్చుకోవడం కోసం ఇపుడు మెస్సీతో రాష్ట్ర ప్రభుత్వ సొమ్ముతో ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడుతున్నారు.
- ఒక గంటన్నర మ్యాచ్ కోసం సీఎం ముందుగా ప్రాక్టీస్ చేసుకోవడానికి మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో ఏకంగా ఫుట్ బాల్ గ్రౌండును ఏర్పాటు చేశారు.
- ఇందుకోసం రూ.ఐదు కోట్లు ఖర్చు చేశారు. ఎవడబ్బ సొమ్మని సీఎం రేవంత్ రెడ్డి తన సరదా కోసం రూ.వంద కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి.
- రూ.వంద కోట్ల ప్రజాధనంతో నీ ఫుట్ బాల్ సరదా తీర్చుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి ... ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు నిన్ను ఫుట్ బాల్ ఆడుకుంటారు. గుర్తుంచుకో
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో భాగంగానే ఈ ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ అని సిగ్గులేకుండా చెప్తున్న మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, ఈ ఫుట్ బాల్ మ్యాచ్ తో తెలంగాణ ఎలా రైజింగ్ అవుతుందో చెప్పాలి.
- గ్లోబల్ సమ్మిట్ జరిగింది డిసెంబరు 8,9 తేదీల్లో. ఆ సమ్మిట్ ముగిసిన నాలుగు రోజులకు ఈ ఫుట్ బాల్ మ్యాచ్ నిర్విహిస్తూ, ఈ మ్యాచ్ సమ్మిట్ లో భాగమని చెప్పేందుకు మంత్రులకు సిగ్గుండాలి. అసలు గ్లోబల్ సమ్మిట్ ప్లానింగులో ఈ ఫుట్ బాల్ మ్యాచ్ లేనే లేదు.
- అసలు రేవంత్ సర్కార్ రెండేళ్లు పూర్తి చేసుకున్న విషయం ఈ ఫుట్ బాల్ ప్లేయర్ మెస్సీకి తెలుసా
- కేరళ ప్రభుత్వం ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహించడం తమ వల్ల కాదని నిరాకరిస్తే, మెస్సీ ఇండియా టూర్ ను ప్లాన్ చేసిన ఈవెంట్ ఆర్గనైజేషన్ సీఎం రేవంత్ రెడ్డిని ముంబైలో కలిసి తెలంగాణలో నిర్వహించాలని కోరారు.
- కేంద్ర మాజీ మంత్రి సుశీల్ కుమార్ షిండే మనవరాలి పెళ్లి కోసం సీఎం రేవంత్ రెడ్డి అక్టోబరు 31న ముంబై వెళ్లినపుడు అక్కడ ఫుట్ బాల్ మ్యాచ్ ఈవెంట్ ఆర్గనైజర్లు కలిశారు. అంటే హైదరాబాద్ లో ఫుట్ బాల్ మ్యాచ్ పెట్టాలనేది నెల రోజుల క్రితం డిసైడ్ అయింది.
- కానీ గ్లోబల్ సమ్మిట్ మూడు నెలల క్రితం డిసైండ్ అయింది. మరి వాస్తవాలు ఇలా ఉంటే సీఎం, మంతులు గ్లోబల్ సమ్మిట్ లో భాగంగా ఫుట్ బాల్ మ్యాచ్ అనడం సిగ్గుచేటు.
- సీఎం రేవంత్ తన సరదా కోసం ఫుట్ బాల్ ఆడుకునేట్టయితే, అందుకు స్పాన్సర్లను చూసుకోవాలి. కానీ సర్కార్ సొమ్ముతో ఫుట్ బాల్ ఆడడం ప్రజాధనం దుర్వినియోగం చేయడమే.
- బీఆర్ఎస్ సర్కార్ ఈ కార్ రేసింగ్ ఈవెంట్ ద్వారా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందంటున్న రేవంత్ సర్కార్ ... మరి ఇపుడు ఫుట్ బాల్ మ్యాచ్ ఆడడం ప్రజాధనం దుర్వినియోగం కాదా. ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి శిక్షార్హుడు కాదా
- ఫుట్ బాల్ మ్యాచ్ నిర్వహణ కోసం ప్రజాధనం ఖర్చు చేయడంపై క్యాబినెటు భేటీలో చర్చ జరిగిందా. మరి రూ.వంద కోట్లకు పైగా జనం సొమ్మును ఖర్చు చేస్తున్నపుడు క్యాబినెట్ అనుమతి అవసరం లేదా
- మేం లేవనెత్తిన ఈ ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పిన తర్వాతనే ఫుట్ బాల్ మ్యాచ్ ఆడాలి. లేదంటే ఈ ఫుట్ బాల్ మ్యాచ్ కు వ్యతిరేకంగా బిజెపి నిరసన కార్యక్రమాలు చేపడుతుంది.
- ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా హైదరాబాద్ రెడ్ హిల్స్ లోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టినార్నారు.

# ఇంటర్ విద్యను గాడిలో పెట్టిన రేవంత్ సర్కార్

- **గత బీఆర్ఎస్ సర్కారు ఇంటర్ విద్యను గాలికొదిలేసింది**
- **పదేండ్లలో విదిల్చింది 62 లక్షలే.. ఈ ఒక్క ఏడాదే 56 కోట్లు**
- **15 ఏండ్ల తర్వాత 1300 మంది లెక్చరర్ల నియామకాలు**
- **ఇంటర్ జేఏసీ చైర్మన్ మధుసూధన్ రెడ్డి**

హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 12:




గత పాలకుల నిర్లక్ష్యంతో కునారిల్లిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు రేవంత్ రెడ్డి సర్కారు ఊపిరి పోస్తోందని ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ డాక్టర్ పి.మధుసూధన్ రెడ్డి అన్నారు. కేసీఆర్ హయాంలో ఇంటర్ విద్యను పూర్తిగా గాలికొదిలేయగా.. ప్రస్తుత ప్రభుత్వం బాధ్యతగా భుజాన వేసుకుందని చెప్పారు. శుక్రవారం నాంపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2014 నుంచి 2023 వరకు పదేండ్ల కాలంలో గత ప్రభుత్వం కాలేజీల నిర్వహణకు నిధులు ఇవ్వకుండా చేతులెత్తేసిందన్నారు. పదేండ్లలో కేవలం రూ. 2 కోట్లు మంజూరు చేసినా.. అందులో ఖర్చు చేసింది రూ. 62 లక్షలు మాత్రమేనని లెక్కలతో సహా వివరించారు. దీంతో జాతీయ పండుగలు జరపాలన్నా ప్రిన్సిపాల్స్ అప్పులు చేయాల్సి వచ్చేదని ఎద్దేవా చేశారు. కానీ, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, కాలేజీల రూపురేఖలు మార్చేందుకు రూ. 56.16 కోట్లు మంజూరు చేసి మరమ్మతులు చేయించిందని తెలిపారు. గతంలో సున్నం కూడా వేయలేని దుస్థితి నుంచి.. ఇప్పుడు ప్రతి నెలా విద్యార్థుల సంఖ్యను బట్టి రూ. 8 వేల నుంచి రూ. 20 వేల వరకు మెయింటెనెన్స్ గ్రాంట్లు ఇచ్చే స్థాయికి ఎదిగామని చెప్పారు. ల్యాబ్‌లకు రూ. 25 వేలు, స్పోర్ట్స్ మెటీరియల్‌కు రూ. 10 వేల చొప్పున నిధులు ఇస్తూ కార్పొరేట్ కాలేజీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా గత 15 ఏండ్లుగా నియామకాల ఊసే లేకపోగా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం టీజీపీఎస్సీ ద్వారా 1300 మంది రెగ్యులర్ లెక్చరర్లను, మరో 1000 మంది గెస్ట్ లెక్చరర్లను నియమించి విద్యా బోధనకు ఢోకా లేకుండా చేసిందన్నారు. హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్, గూగుల్ మ్యాప్స్ ద్వారా పరీక్ష కేంద్రాల గుర్తింపు వంటివి విప్లవాత్మక మార్పులన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత బస్సు, యూనిఫామ్స్ ఇవ్వడంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఇంటర్ విద్యాజేఏసీ నాయకులు రవీందర్ రెడ్డి, బలరామ్? జాదవ్, లక్ష్మణ్ రావు, కవిత ,ఆంజనేయులు, శ్రీనివాస్, కే.రజిత తదితరులు పాల్గొన్నారు.

GKB FOUNDATION

#3-5-168, 101, విక్టోరియా టవర్స్, ఆపోజిట్ శాంతి థియేటర్, నారాయణగూడ హైదరాబాద్ 500029

ఉచిత నేత్ర శస్త్ర చికిత్సా శిబిరము

ఉచితంగా పరీక్షలు చేసి కాటరాక్ట్ చికిత్స అందించబడును.

స్థలము

శ్రీ వెంకటేశ్వర కమ్యూనిటీ హాల్, నారాయణగూడ వాటర్ వర్క్స్ (బ్యాక్ సైడ్)
నారాయణగూడ, హైదరాబాద్. 500029
తేదీ: 13/12 /2025 శనివారము ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు

కంటి చూపు తక్కువగా ఉన్న వారిని పరీక్షించి అవసరమైన వారికి ప్రఖ్యాతి గాంచిన

పుష్పగిరి కంటి ఆసుపత్రి

సంస్థ: (A Division of Pushpagiri Vitreo Retina Institute) సికింద్రాబాద్ వారిచే

ఉచితంగా పరీక్షలు చేసి ఆరోగ్యశ్రీ ఉన్నవారికి ఆ పథకం ద్వారా చికిత్సా సేవలు అందించబడును.

కంటి ఆపరేషన్ అవసరమైనవారు ఆధార్ కార్డ్, రేషన్ కార్డు, 2 జతల బట్టలు, 1 గ్లాసు వెంట తెచ్చుకోగలరు.

ఈ సదవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోగలరు



# సంపాదకీయం..

# పల్లె రైజింగ్‌తోనే తెలంగాణ రైజింగ్ సాధ్యం !

తెలంగాణ పల్లెపోరులో తొలిదశ పూర్తయ్యింది. మలిదశ, మూడోదశతో పంచాయితీ ఎన్నికలు పూర్తి కానున్నాయి. ఈ క్రమంలో గత రెండేళ్లుగా గ్రామాలు కునారిల్లాయి. కనీస వసతులు లేవు. గ్రామాల్లో అత్యధిక శాతం అధికార కాంగ్రెస్ గెలుపొందినట్లు సమాచారం. గుర్తులు లేకుండా పోరు జరిగినా, సాధారణంగా అధికార పార్టీ అండదండలు ఉన్నవారే సర్పంచ్‌లుగా గెలుస్తారు. విపక్ష బిఆర్ఎస్ అభ్యర్థులు కూడా పెద్ద సంఖ్యలోనే గెలిచారు. బిజెపి కూడా సత్తా చాటింది. ఈ క్రమంలో గ్రామాల అభివృద్ది విషయంలో పార్టీలకు అతీతంగా అభివృద్దికి అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ది చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్దికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. ఫ్యూచర్ సిటీ, దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ప్లాస్టిక్ భూతంలా వెన్నాడుతోంది. ఈ సమస్యలన్నీ పరిష్కరించలేనివేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. ప్రజల భాగస్వామ్యంతోనే ఇవన్నీ సాధ్యం. అలాగే ప్రజలను బాధ్యులుగా కూడా చేయాలి. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న




నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు ఉద్యుక్తులను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను పురోగించేలా చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. ఎందుకంటే తెలంగాణ పల్లెపోరులో హస్తం సత్తా చాటుతోంది. ప్రజలు సిఎంపై నమ్మకంతో ఉన్నారని తెలుస్తోంది. గురువారం జరిగిన తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అర్ధరాత్రి 2 గంటల వరకు వెల్లడైన ఫలితాల మేరకు ఏకగ్రీవాలతో కలుపుకొని అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 2,383 సర్పంచి స్థానాల్లో విజయదుందుభి మోగించారు. సిద్దిపేట మినహా మిగిలిన జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంది. పలు చోట్ల గట్టిపోటీ ఇచ్చిన ప్రతిపక్ష బిఆర్ఎస్ 1,146 పంచాయతీలను గెలుపొందింది. స్వతంత్ర అభ్యర్థులు 455 చోట్ల విజయం సాధించారు. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు దారులు అత్యధిక సర్పంచ్, వార్డు స్థానాలను కైవసం చేసుకున్న తీరును చూస్తే ప్రభుత్వంపై ఆశతో ప్రజలు ఉన్నారని గుర్తించాలి. మిగతా రెండు విడతల్లోనూ భిన్నంగా ఫలితాలు ఉండవు. ఉన్నా పట్టించు కోవద్దు. ఎవరు గెలిచినా గ్రామ అభివృద్దిలో భాగం చేయాలి. ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపతేం చేస్తూ పోవాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యవసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. ఎందుకంటే రవాణాను విస్తరిస్తే గ్రామాలు వాటంతట అవే పురోగమిస్తాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గుతంది. ఇటీవల గ్లోబల్ సమ్మిట్‌తో హైదరాబాద్ ప్రాధాన్యం, ఫ్యూచర్ సిటీ అవసరాన్ని ప్రపంచం గుర్తించింది. ఇందులో పదిశాతం దృష్టి గ్రామాలపై పెట్టినా అవి అల్లుకు పోతాయి. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పటు గ్రామాలు పురోగమిస్తాయి. ఇటీవల ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా జరిగింది.

'తెలంగాణ రైజింగ్' పేరుతో జరిగిన ఈ గ్లోబల్ సమ్మిట్ ప్రధానంగా అంతర్జాతీయ పెట్టుబడులను సాధించటం, మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేయటం; 2047 నాటికి దేశ జీడీపీలో 10శాతం వాటాను సాధించటం; చైనా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోటీపడటం... మొదలైన లక్ష్యాలతో జరిగింది. ఈ సమ్మిట్‌లో దాదాపుగా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. రాష్ట్ర చరిత్రలో ఇదో రికార్డ్. ఇలాంటి సమయంలోనే గ్రామాలను అభివృద్దిలో భాగం చేయాలి. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లను అందుకు సన్నద్ధం చేయాలి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉజ్వల తెలంగాణ నిర్మాణానికి పూనుకుంటే అది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. ఈ క్రమంలో కొత్త సర్పంచ్‌ల రాకతోనే వారిని కార్యక్షేత్రంలోకి దింపాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికి దోహదపడేలా చేయాలి. అప్పుడే తెలంగాన కల సాకారం కాగలదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి.

# "ఏసీబీ పట్టుకున్నా.. అవినీతి ఎందుకు తగ్గడం లేదు?"



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

*తెలంగాణలో అవినీతి గురించి మాట్లాడితే, ఏసీబీ చర్యల గురించి ప్రస్తావన తప్పనిసరిగా వస్తుంది. రోజు రోజుకు రాష్ట్రం మొత్తం మీద లంచం తీసుకుంటూ ఉన్న అధికారులను ఏసీబీ పట్టుకుంటోంది. కొన్ని రోజులలో ఇద్దరు, ముగ్గురు ఒకేసారి ట్రాప్ అవుతున్నారు. ఏసీబీ విడుదల చేసే ఫోటోలు, పట్టుబడిన అధికారుల వివరాలు, వారి వృత్తి జీవితంలో వారు చేసిన పనులు,ఇవన్నీ ప్రజల్లో ఒక నైరాశ్యాన్ని కలిగిస్తూ, అదే సమయంలో ఒక ఆశను కూడా కలిగిస్తున్నాయి. "ఇకనైనా అవినీతి తగ్గుతుందేమో" అని ప్రజలు అనుకుంటున్నారు. కానీ వాస్తవం మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. ట్రాప్ కేసులు పెరుగుతున్నాయి కానీ అవినీతి మాత్రం మరింత ప్రబలుతోంది. ఎందుకు? అనేది ఇక్కడ ప్రధాన ప్రశ్న.*

గత అయిదేళ్లలో తెలంగాణ ఏసీబీ మొత్తం 621 అధికారులపై అవినీతి కేసులు నమోదు చేసింది. ఇది చిన్న సంఖ్య కాదు. అంటే ప్రతి మూడో రోజుకి ఒక కేసు అన్నమాట. ఇందులో 519 కేసుల విచారణ పూర్తయింది. కానీ విచారణ పూర్తయిందంటే కేసు కోర్టుకి వెళ్లిందనే అర్థం కాదు. ప్రభుత్వ ఉద్యోగిపై చార్జ్‌షీట్ వేయాలంటే, సంబంధిత శాఖ నుంచి 'ప్రాసిక్యూషన్ సాంక్షన్' అనే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. అదే సమస్య. ఏసీబీ ఫైళ్లను ప్రభుత్వం తిరిగి పంపేస్తుంది. "చిన్న లోపం ఉంది", "మరిన్ని వివరాలు కావాలి", "తదుపరి పరిశీలన అవసరం", "ఫైల్ మళ్లీ చూసుకోండి" అని సింపుల్ కారణాలతో ఫైళ్లు నెలలతరబడి సచివాలయాల్లో తిరుగుతుంటాయి. కొన్ని సందర్భాల్లో అధికారుల పైరవీలతో వెంటనే ఫైల్ ఆగిపోతుంది. పైస్థాయి అధికారుల సహకారం లేకుండా ఒక అవినీతి అధికారిని శిక్షించడం దాదాపు అసాధ్యం అవుతోంది.

దీంతో ఏసీబీ పూర్తి చేసిన 519 కేసుల్లో చాలా వరకు ప్రభుత్వ అనుమతుల కోసం సంవత్సరాల తరబడి వేచి ఉన్నాయి. ఈ ఆలస్యమే అవినీతి అధికారులకు పెద్ద బలంగా మారింది. "ఏసీబీ పట్టుకున్నా పెద్దగా ఏమీ జరగదు", "సచివాలయంలో మన వాళ్లు ఉన్నారు", "పూర్తి డిపార్ట్‌మెంట్ మా వెనకాలే ఉంది" అనే ధైర్యం కొందరు అధికారుల్లో కలుగుతోంది. అవినీతి వ్యవస్థను విచ్ఛిన్నం చేయాల్సిన సచివాలయం, అవినీతి చేసిన అధికారులను కాపాడే కోటగా మారిన తీరు రాష్ట్ర పరిపాలనపై ఒక పెద్ద ప్రశ్నచిహ్నం.

ప్రజల జీవితాల్లో పరిస్థితి మరింత విషాదకరం. తెలంగాణలో ఎలాంటి శాఖకు వెళ్లినా, ఏ సమస్య చెప్పినా, లంచం లేకుండా పని జరిగే సందర్భాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. ఒక పక్కన మైండ్స్, రెవెన్యూ శాఖలో పాస్‌బుక్ మార్చినా, భూమి ముటేషన్ చేసినా లంచం తప్పదు. మున్సిపాలిటీలో అనుమతులు, సర్టిఫికెట్లు, హౌస్ నంబర్లు అన్నీ డబ్బుతోనే జరుగుతున్నాయి. ఆసుపత్రుల్లో బెడ్ కోసం కూడా కొందరు డబ్బు తీసుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. పోలీస్ శాఖలో వెరిఫికేషన్, ఫిర్యాదు పరిష్కారం,ఇవన్నీ కూడా లంచం లేకుండా జరగడం కష్టమైపోయింది. ఈ సమాజంపై ఏసీబీ ట్రాప్ కేసులు చూపించే ప్రభావం ఏమిటి? ప్రజలు మొదట అభినందిస్తారు, తదుపరి రోజే మళ్లీ అదే కార్యాలయంలో అదే సమస్యలను ఎదుర్కొంటారు. అందుకే ప్రజలు అంటున్నారు,"అవినీతి అధికారులను ఏసీబీ పట్టుకుంటోంది కానీ అవినీతి మాత్రం తగ్గడం లేదు."

ఒక అవినీతి కేసు విచారణ పూర్తి కావడానికి మూడు నుంచి అయిదేళ్లు పడుతుంది. కోర్టులో విచారణ పూర్తికావాలంటే మరో అయిదు నుంచి పది సంవత్సరాలు పడుతుంది. మొత్తం మీద పది నుంచి పద్దెనిమిదేళ్లు పడుతుంది. ఈ లోపు అవినీతి అధికారి పదవీవిరమణ చేసేస్తాడు. వేతనం, పెన్షన్, గ్రాట్యుటీ..అన్ని ప్రయోజనాలు పొందేస్తాడు. కేసు తీర్పు వచ్చే సమయానికి అతను రిటైర్ అయ్యి, ఇంట్లో ప్రశాంతంగా కూర్చున్న వృద్ధుడై ఉంటాడు. అప్పుడు శిక్ష పడితే దాని ప్రయోజనం ఏమిటి? అతను సంపాదించిన అక్రమ ఆదాయం అప్పటికి ఎప్పుడో మాయమై ఉంటుంది. వంశానికి ఆస్తులు నిలిచిపోతాయి. ఈ పరిస్థితిలో ఒక సమాజం అవినీతి తగ్గుతుందని ఎలా ఆశించగలదు?

ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఏసీబీ పట్టుకుంటున్న అధికారి ఒక్కరే కాదువెనుక ఒక గొలుసు ఉంటుంది. సెక్షన్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లు, కొందరు డిప్యూటీ కమిషనర్ , గెజిటెడ్ ఆఫీసర్స్, ఇక స్థానిక రాజకీయ నాయకులు,కలిసిన ఒక చీకటి వ్యవస్థగా అవినీతి నిలబడి ఉంది. ఒకరు పట్టుబడ్డా ఇంకొకరు స్థానంలోకి వచ్చేస్తారు. దాంతో సిస్టమ్‌లో మార్పు జరగడం లేదు. పైగా ఆఫీసుల్లో కొందరు సెక్షన్ ఆఫీసర్లు అవినీతి అధికారులకు రక్షణ కవచంలా వ్యవహరిస్తారు. కేసులు పెండింగ్‌లో ఉంచడం, నోట్లు మార్చడం, డైరక్షన్స్ ఇవ్వడం వంటి 'ఇన్‌సైడ్ హెల్ప్' కూడా వ్యవస్థలో ఉంది. ఇది అవినీతి నిర్మాణానికి నేరుగా మద్దతు లాంటిది.

ప్రజా పరిపాలనలో అవినీతి ఇంత విస్తారంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం కూడా అపవాదులు తప్పించుకోలేకపోతుంది. ప్రతిపక్షాలు ప్రతిరోజూ విమర్శలు చేస్తాయి, "రాష్ట్రంలో అవినీతి పర్వతమంతా పెరిగింది", "ప్రభుత్వం ఏసీబీ ఫైళ్లను సీరియస్‌గా తీసుకోవడం లేదు", "అధికారులు రాజకీయ ఆశ్రయంలో దుందుడుకు అవుతున్నారు." ప్రజల అభిప్రాయాలు కూడా అంతే: "ఏసీబీ పని బాగుంది.. కానీ ప్రభుత్వ పని బలహీనంగా ఉంది." ప్రభుత్వం ఎంత మంచి పథకం చేసినా అవినీతి దాన్ని మధ్యలోనే తినేస్తోంది. పేదల హక్కులు అధికారుల డెస్క్‌లపై చనిపోతున్నాయి. సంక్షేమ పథకాలు సమర్థవంతంగా ప్రజలకు చేరడం లేదు. విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, రంగాలు అవినీతి బారిన ఉన్నాయి.

ఇలాంటి పరిస్థితిలో ఏసీబీ ఒక్కటే ఏమీ చేయలేదు. ట్రాప్ కేసులు చేయడం, ఫిర్యాదులను సేకరించడం, దర్యాప్తు చేయడం ఇవి తమ పరిధిలో చేస్తుంది. కానీ సిస్టమ్ మొత్తం మారాలంటే ప్రభుత్వం ముందుకు రావాలి. ఆలస్యాలను తగ్గించాలి. ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అన్న నిబంధనను మార్చాలి. ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి ఆరు నెలల్లోగా కేసులు తీర్చాలి. పట్టుబడిన రోజు నుంచే సస్పెన్షన్ అమలు చేయాలి. సేవలో ఉండగానే శిక్షపడేలా చేయాలి. అవినీతి ద్వారా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌లో అమలులో ఉన్నట్లుగా అవినీతి అధికారులను ప్రజా సేవకు అనర్హులుగా ప్రకటించే విధానాన్ని తెలంగాణలో అమలు చేయాలి.

ఈ చర్యలు తీసుకోకపోతే ఏసీబీ రోజూ పట్టుకున్నా ప్రయోజనం లేదు. అవినీతి అనే మహాసర్పం ఒక తల తెగినా మరొక తలను పెంచుకుంటుంది. వ్యవస్థ మొత్తం శుద్ధి కావాలి. అధికారుల ధోరణి మారాలి. చివరకు ప్రజల ధోరణి కూడా మారాలి. "డబ్బు ఇచ్చి పని చేసుకుందాం" అనే ఆలోచన సైతం అవినీతికి బలం ఇస్తోంది. సమస్య ప్రభుత్వమైనా.. బాధ్యత సమాజానిదే. సమాజం అవినీతిని సహించకూడదు, ప్రభుత్వం దానిని కఠినంగా శిక్షించాలి, వ్యవస్థ దానిని అడ్డుకోవాలి, న్యాయవ్యవస్థ వేగంగా తీర్పు చెప్పాలి. ఇవన్నీ జరిగితేనే అవినీతి తగ్గుతుంది. లేకపోతే 621 కేసులు, 519 విచారణ ఫైళ్లు, వందలాది ట్రాప్‌లు ఇవి కేవలం గణాంకాలుగా మిగిలిపోతాయి. ప్రజల కన్నీళ్లు మాత్రం కొనసాగుతూనే ఉంటాయి.

అవినీతి అధికారులను పట్టుకోవడం ఒక పని. అవినీతిని పూర్తిగా నిర్మూలించడం అసాధారణ పని. అది జరిగే రోజే నిజమైన సామాజిక తెలంగాణ పరిపాలన మొదలవుతుంది. ఈ మాటల్లో ఒక నిజం దాగి ఉంది. వ్యక్తులను పట్టుకోవడం తాత్కాలిక పరిష్కారం, కానీ వ్యవస్థను మార్చడం, పద్ధతులను శుభ్రం చేయడం, పాలనలో పారదర్శకతను నెరవేర్చడం మాత్రం దీర్ఘకాలిక సమరం. ఈ సమరానికి నాయకత్వం రాజకీయాలు ఇవ్వాలి, బలం సమాజం ఇవ్వాలి, ధైర్యం ప్రజలు ఇవ్వాలి. ఎందుకంటే అవినీతి వ్యక్తుల వల్ల కాదు, కాలక్రమేణా ఏర్పడిన వ్యవస్థాపరమైన లోపాల వల్ల బలపడింది.

అవినీతిని పూర్తిగా నిర్మూలించాలంటే ప్రభుత్వ యంత్రాంగం మొదటి నుంచి చివరి వరకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. నియామకాలు, బదిలీలు, టెండర్లు, సంక్షేమ పథకాలు, అనుమతులు ం ప్రతి స్థాయిలో పారదర్శకత తప్పనిసరి. ఒక అధికారిని సస్పెండ్ చేయడం, అరెస్ట్ చేయడం, లేదా శాఖ మార్చడం సమస్యను కేవలం కొంతకాలం మాత్రమే అదుపులో ఉంచుతుంది. కానీ అవినీతి ఎందుకు జరుగుతోంది? దానికి దారితీసే పరిస్థితులు ఏమిటి? అవినీతి చేసేందుకు అవకాశాలు ఎక్కడ ఉన్నాయి? ఇవన్నీ పదునైన దృష్టితో ప్రభుత్వం పరిశీలించాలి.

అధికారుల్లో నిజాయితీ పెరగాలంటే గౌరవం, భద్రత, మరియు కఠినమైన నిబంధనలు రెండు కలసి ఉండాలి. మంచి అధికారులను ప్రోత్సహించడం, చెడు అధికారులను శిక్షించడం ,ఈ రెండు చక్రాలు ఒకే దారిలో తిరగాలి. ప్రజలు కూడా "మన పని త్వరగా అయిపోవాలి" అనే ఆలోచనతో లంచాల వ్యవస్థను ప్రోత్సహించకూడదు. ఎందుకంటే అవినీతి అనేది రెండు వైపులా జరిగే ఒప్పందం, దాన్ని చెరిపేయాలంటే రెండు వైపులా ఉన్న మనస్తత్వమే మారాలి. అవినీతి రహిత తెలంగాణ అనేది కేవలం ప్రభుత్వ నినాదం కాదు ం ఇది భవిష్యత్తులో పుట్టబోయే ప్రతి తరానికి ఇచ్చే హామీ. గ్రామాల్లోని రెవెన్యూ కార్యాలయం నుంచి, నగరంలోని GHMC వరకు, పోలీసు స్టేషన్ నుంచి రాష్ట్ర కార్యాలయం వరకు , ఎక్కడైనా సాధారణ పౌరుడు గౌరవంతో, భయంలేకుండా, లంచం లేకుండా తన పనిని పూర్తి చేసుకోగలిగే రోజు వచ్చినప్పుడు మాత్రమే "సామాజిక తెలంగాణ" సాకారం అవుతుంది.

అవినీతి మన తెలంగాణను వెనక్కి లాగుతున్న చీకటి. దాన్ని నిర్మూలించడం ఒక అసాధారణ పని అవుతుందేమో, కానీ అది అసాధ్యమైన పని కాదు. ప్రభుత్వం, అధికారులు, ప్రజలు అందరూ ఒకే లక్ష్యంతో ముందుకు నడిస్తే ఆ రోజు దూరంలో లేదు. ఆ రోజు వచ్చినప్పుడు మాత్రమే తెలంగాణ నిజమైన అర్థంలో అభివృద్ధి, సమానత్వం, న్యాయం, గౌరవం కలిగిన రాజ్యంగా నిలుస్తుంది.

# వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలి

**- పార్లమెంట్‌లో డిమాండ్ వినిపించిన ఎంపిలకు కృతజ్ఞతలు**

**కర్నూలు,డిసెంబర్12( వెలుతురు):**
వాల్మీకి సమాజానికి ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని పార్లమెంటులో గట్టిగా స్వరం వినిపించిన కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిలకు జాతీయ వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి నేత బలరాం కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా వాల్మీకులు అనుభవిస్తున్న అన్యాయం, రిజర్వేషన్ కోసం జరుగుతున్న నిరంతర పోరాటాన్ని గుర్తించిన ఎంపీలు దేశ అత్యున్నత వేదిక అయిన పార్లమెంటులో అంశాన్ని లేవనెత్తడం చారిత్రాత్మక పరిణామమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర వంటి రాష్టాల్లో( వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ అమలులో ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అప్పటి పాలకుల నిర్ణయాలతో సమాజాన్ని ప్రాంతాలవారీగా విభజించి రిజర్వేషన్ హక్కులను హరించారని బలరాం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయాన్ని సరిచేయాల్సిన బాధ్యత నేటి పాలకులపై ఉందని, వాల్మీకుల ఆత్మగౌరవాన్ని కాపాడే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంపీల పోరాటాన్ని వాల్మీకి సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని, ఇదే తీరులో అసెంబ్లీలోనూ ఎమ్మెల్యేలు పార్టీలకు అతీతంగా గళమెత్తాలని బలరాం విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులో ఎంపీలు వినిపించిన గళానికి బలాన్నిచ్చేందుకు జిల్లా, మండల స్థాయిలో వాల్మీకి సమాజాన్ని సంఘటితం చేస్తూ ఉద్యమాలను



మరింత వేగవంతం చేస్తామని ప్రకటించారు. ఎస్టీ రిజర్వేషన్ అమలులోకి వస్తే వేలాది వాల్మీకి విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విద్య ఉద్యోగాల్లో బంగారు అవకాశాలు లభిస్తాయని, వారి భవిష్యత్తు వెలిగిపోతుందని బలరాం నమ్మకం వ్యక్తం చేశారు. వాల్మీకుల హక్కుల సాధన కోసం అందరూ ఒకే వేదికపైకి వచ్చి ఆందోళనలను మరింత జోరుగా కొనసాగించాలని పిలుపునిచ్చారు.

# కేశవరావు , పోచారం తదితర 9మందికి కేబినేట్ హోదా

**- ఎర్రోళ్ల శ్రీనివాస్ కేసుపై హైకోర్టులో విచారణ**

**హైదరాబాద్,డిసెంబర్12( వెలుతురు):**
కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలతో సహా కొందరికీ కేబినెట్ హోదా కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో పై హైకోర్టులో బిఆర్ఎస్ నేత సవాల్ చేశారు. ఈ జీవోను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేత ఏరోళ్ల శ్రీనివాస్ తెలంగాణ హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై శుక్రవారం విచారణ జరిగింది. కాంగ్రెస్ నేతలు కేశవరావు , పోచారం శ్రీనివాసరెడ్డి , సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్, చిన్నారెడ్డిలతోపాటు మరో తొమ్మిది మందికి కేబినెట్ హోదా చట్ట విరుద్ధమని పిటిషన్‌లో ప్రస్తావించారు. రిజిస్ట్రీ అభ్యంతరం చెప్పడంతో చీఫ్ జస్టిస్ బెంచ్ విచారణ చేపట్టింది. ఎమ్మెల్యేల సంఖ్యలో 15 శాతం మాత్రమే కేబినెట్ హోదా ఇవ్వాలని వాదనలు వినిపించారు. ముఖ్యమంత్రి, మంత్రులకు మాత్రమే కేబినెట్ హోదా ఉంటుందని ఏరోళ్ల శ్రీనివాస్ వివరించారు. రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసి పుచ్చి ఓ నెంబర్ కేటాయించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేబినెట్ హోదా కల్పించడాన్ని సవాల్ చేస్తూ 2017లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిల్ దాఖలు చేశారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వేసిన పిల్‌తో పాటు బీఆర్ఎస్ పిటిషన్లను కలిపి వచ్చే వారంలో విచారణకు తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీక్రి ఆదేశాలు జారీ చేసింది తెలంగాణ హైకోర్టు.

## మెగా రిసో ఫాస్ట్ ముసుగులో విద్యార్థులను తల్లిదండ్రులను మోసం చేస్తున్న రిజోనెన్స్ స్కూల్స్ మరియు కళాశాలలు

***టాలెంట్ టెస్ట్ పేరుతో విద్యార్థులను మోసం చేస్తున్న రిజోనేన్స్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (ఆర్జెడిఎస్సిఈ) సోమిరెడ్డి ని కలిసి విజ్ఞప్తి చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్***



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 12:**
హైదరాబాదులో ఐదు నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు మెగా రిసో ఫాస్ట్ టాలెంట్ టెస్ట్ ముసుగులో రీజోనేన్స్ యాజమాన్యం డిసెంబర్ 14న ఐదవ తరగతి నుంచి పదవ తరగతి చదివే విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తున్నందున వాటిపై చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఈ రోజు రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (ఆర్ జె డి ఎస్ సి ఈ) సోమిరెడ్డి ని కలిసి విజ్ఞప్తి చేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తెలిపారు ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్ పేరుతో మెరిట్ విద్యార్థులకు ఉచిత విద్య రూపాయలు 100 కోట్ల స్కాలర్షిప్ 100 ట్యాబులు అందిస్తామని రిజిస్ట్రేషన్ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూపాయలు 300 అక్రమంగా వసూలు చేశారని మోసపూరితంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్న రిజోనెన్స్ అనే విద్యా సంస్థ ప్రయత్నిస్తుందని వెంటనే దీనిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని వెంటనే యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు లింగం గౌడ్ పేర్కొన్నారు.

## చక్రిపురం-16 పేరు కుషాయిగూడ 16 గా మార్చాలి

**: నాగార్జున నగర్ కాలనీ సంఘం డిమాండ్**




**కాప్రా, డిసెంబర్ 12 వెలుతురు :**
చక్రిపురం – 16 గా ముసాయిదా చేసిన నూతన జిహెచ్ఎంసి డివిజన్‌కు 'కుషాయిగూడ – 16' అని పేరు మార్చాలని నాగార్జున నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పునర్విభజన ప్రక్రియలో భాగంగా ప్రస్తుత చర్లపల్లి-3 డివిజన్‌ను రెండుగా విభజించి కొత్త డివిజన్‌కు చక్రిపురం-16 అని ప్రతిపాదించడంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. శతాబ్దం చరిత్ర కలిగిన కుషాయిగూడ పేరుకు ప్రాంతీయ గుర్తింపు, సాంప్రదాయాల ప్రతీకగా ఉన్న నేపథ్యాన్ని అసోసియేషన్ నేతలు వివరించారు. రెండు దశాబ్దాల క్రితం ఏర్పడిన చక్రిపురం కాలనీ పేరుతో డివిజన్‌ను నామకరణం చేయడం సముచితం కాదని అభిప్రాయపడ్డారు. శుక్రవారం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు యావపురం రవి, ప్రధాన కార్యదర్శి మొగిలి కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారి తుల్జా సింగ్ కు వినతిపత్రం అందజేశారు. డివిజన్‌కు కుషాయిగూడ-16 అనే పేరునే నిర్ణయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు ఎం మహేందర్ గౌడ్ సహాయ కోశాధికారి సాయి వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారాంపురం గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం సర్పంచ్ అభ్యర్థి కాళీ పద్మా వెంకన్న



**గుండాల, డిసెంబర్ 12(వెలుతురు) :**
సీతారాంపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థి కాలి పద్మ వెంకన్న, గ్రామ అభివృద్ధికి కొన్ని ముఖ్యమైన హామీలు ఇచ్చారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో పనిచేస్తూ, ఈ కింది ప్రాజెక్టులను చేపడతానని చెప్పారు:
- గ్రంథాలయం ఏర్పాటు – పఠన సంస్కృతిని పెంపొందించడానికి.
- క్రీడా ప్రాంగణం – యువతకు క్రీడల్లో పాల్గొనే అవకాశం.
- ఇందిరమ్మ ఇళ్లు – గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు నిరుపేదలకు ఇండ్లు లేని వారికి ఇల్లు కట్టిస్తాం
.– కొత్త వాటర్ ప్లాంట్– మంచినీటి సమస్య పరిష్కారం.
- సిసి రోడ్లు, మోరీలు, వీధి దీపాలు – గ్రామ రూపురేఖ మెరుగుపరచడం.
- సిసి కెమెరాలు – గ్రామ భద్రతను బలోపేతం చేయడం.
- కొత్త పైపులైన్లు – నీటి సరఫరాను మెరుగుపరచడం.

"ఉంగరం" గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆమె ప్రజలను కోరుతున్నారు.

## ఆరుట్ల బుగ్గతండాలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మానిపాటి అనిత వెంకటేష్ 14వ వార్డు అభ్యర్థి పంబాల కిషోర్ ప్రచారం

**- కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి వార్డు సభ్యులను అధిక మెజార్టీతో గెలిపించాలి**
**- గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే సాధ్యం**
**- మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**



ఆరుట్ల గ్రామపంచాయతీ బుగ్గ తండాలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మానిపాటి అనిత వెంకటేష్ 14వ వార్డు సభ్యుడు పంబల కిషోర్ ప్రచారం



ఆరుట్లలో 2వ వార్డులో కాంగ్రెస్ పార్టీ వార్డు అభ్యర్థి వెదిరె రమణారెడ్డి ప్రచారం

**మంచాల వెలుతురు డిసెంబర్ 12:**
మంచాల మండలం సర్పంచ్ ఎన్ని కల్లో భాగంగా ఆరుట్ల గ్రామం పరిధి లోని బుగ్గతండా14వవార్డులో ప్ర చారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ స ర్పంచ్ అభ్యర్థి మానిపాటి అనిత వెంకటేష్ సర్పంచ్ అభ్యర్థి గుర్తు ఉంగరం గుర్తు 14వ వార్డు అభ్యర్థి పంబాల కిషోర్ గుర్తు గౌను గుర్తు ప్ర చారం నిర్వహించారు ఆరుట్లలో 2 వ వార్డులో అభ్యర్థి వెదిరె రమణారె డ్డి గుర్తు స్టూల్ గుర్తుకు సర్పంచ్ అ భ్యర్థి ఉంగరం గుర్తుకు జోరుగా ప్ర చారం నిర్వహిస్తున్నారు ఈ ప్రచారం లో ముఖ్య అతిథులుగా మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరె హ న్మంత్ రెడ్డి సర్పంచ్ కొంగర విష్ణువర్ధ న్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాం గ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉన్నది అందుకే జరగబో యే సర్పంచ్ ఎన్నికల్లో కాం గ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మానిపా టి అనిత వెంకటేష్ 14 వార్డుల స భ్యులను గెలిపిస్తే ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిగారి సహకారంతో ని ధులు అధికంగా మంజూరవుతాయి గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి జరుగుతుంది గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే సాధ్యం అవుతుంది అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రావుల భాష మంచాల మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు కావాలి బుగ్గ రాములు ముదిరాజ్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరీ ఎల్లేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పంబా ల బుగ్గ రాములు దాసరమోని రమే ష్ ముదిరాజ్ గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ పొండాల యాదయ్యగౌడ్ లచ్చిరాం మారలక్ష్మణ్ నూకం రా యుడు ముదిరాజ్ మానిపాటి గణేష్ కొండి గారి జగదీష్ మంకు శ్రీను తదితరులు పాల్గొన్నారు

## అరుట్లలో బిజెపి పార్టీ బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మానిపాటి శోభ కుమార్, 9వ వార్డు అభ్యర్థి నూకం రాజు ముదిరాజ్ ప్రచారం

**- గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం బిఆర్ఎస్ పార్టీకి సాధ్యం**
**- మంచాల సహకార సంఘం మాజీ చైర్మన్ ముద్దు సికిందర్ రెడ్డి**



ఆరుట్లలో ప్రచారం చేస్తున్న బిజెపి బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మానిపాటి శోభా కుమార్



ఆరుట్ల గ్రామం.9వ వార్డు అభ్యర్థి నూకం రాజు ముదిరాజ్ సర్పంచ్ అభ్యర్థి మానిపాటి శోభ కుమార్ కు మద్దతుగా ప్రచారం చేస్తున్న మంచాల సహకార సంఘం మాజీ చైర్మన్ ముద్దు సికిందర్ రెడ్డి

**మంచాల వెలుతురు డిసెంబర్ 12:**
మంచాల మండలం సర్పంచ్ ఎన్ని కల సందర్భంగా ఆరుట్ల గ్రామంలో బిజెపి పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మానిపాటి శోభ కుమార్ 9వ వార్డుఅభ్యర్థి నూకం రాజు ముదిరా జ్ లకు మద్దతుగా సర్పంచ్ అభ్యర్థి గుర్తు కత్తెర గుర్తు 9వ వార్డు అభ్యర్థి గుర్తు గ్యాస్ స్టవ్ గుర్తుకు ఓటు వే యాలని ప్రచారం జోరుగా చేసిన మంచాల సహకార సంఘం మాజీ చైర్మన్ ముద్దు సికిందర్ రెడ్డి బిఆర్ ఎస్ బిజెపి నాయకులు ఈ సందర్భంగా సహకార సంఘం మాజీ చై ర్మన్ ముద్దు సికందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే వందరోజుల్లో ఆరు గ్యారెంటీల పథకాలు అమలు చేస్తామని మా యమాటలు చెప్పిసంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయలేదు అన్నారు గ్రామాల్లో అన్ని విధా లుగా మౌలిక వసతులు కల్పించి గ్రామాల ను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దిన ఘనత బిఆర్ఎస్ ప్రభు త్వానికి ద క్కుతుంది జరగబోయే సర్పంచ్ ఎన్నికల్లో బిజెపి పార్టీ బలపరిచిన బి ఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి వార్డు సభ్యులను అధిక మెజార్టీతో గెలిపిం చాలి అప్పుడే గ్రామాలు పూర్తిస్థాయి లో అభివృద్ధి చెందుతాయి అని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ బిఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆరుట్ల గ్రామ శాఖ అధ్యక్షుడు పూన్నం రాము. ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జానీ పాషా పొలగోని శ్రీకాంత్ ముదిరాజ్ బోద్రమోని అంజయ్య ముదిరాజ్ లొంగరీ యాదగిరి ఆమంచ రంజిత్ ఆర్ల శ్రీనివాస్ అచ్చన రవి తదితరులు పాల్గొన్నారు

## నర్సక్కపేట గ్రామాన్ని మోడల్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యం...

**- అన్ని వర్గాల ప్రజల సంక్షేమం , ఉపాధి అవకాశాల కోసం నిరంతరం కృషి చేస్తా.....**
**- నర్సక్కపేట మార్పు కోసం బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించండి..**
**- సర్పంచ్ అభ్యర్థిని బొల్ల రజిత రామచంద్రారెడ్డి.**




**ఇల్లంతకుంట వెలుతురు డిసెంబర్ 12:**
ఇల్లంతకుంట మండలం నర్సక్కపేట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా, మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆ గ్రామ సర్పంచి అభ్యర్థిని బొల్ల రజిత రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం శుక్రవారం ముగిసిన నేపథ్యంలో నర్సక్క పేట గ్రామంలో బోల్ల రజిత రామచంద్ర రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గ్రామాభివృద్ధి లక్ష్యంతో, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పోటీలో నిలిచిన తనను ఆశీర్వదించి, బ్యాట్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని బోల్ల రజిత రామచంద్రారెడ్డి కోరారు. పట్టభద్రురాలైన తనకు గ్రామ సమస్యలపై అవగాహన ఉందని, గ్రామ అభివృద్ధి , అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం శాయా శక్తుల కృషి చేస్తానని రజిత తెలిపారు. సర్పంచిగా తనకు అవకాశం కల్పిస్తే గ్రామంలో ప్రధానంగా మౌలిక వసతుల కల్పన ధ్యేయంగా , అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రణాళికతో ముందు కొనసాగుతానని తెలిపారు. ప్రధానంగా రక్షిత మంచినీరు, అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారులు, మురికి కాలువలు , వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్ , చెత్త కోసం డంపు యార్డ్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ , స్మశాన వాటిక , అంగన్వాడి సెంటర్, ప్రజా ఆరోగ్య కేంద్రం , ఓపెన్ జిమ్ , క్రీడా ప్రాంగణం వంటి మౌలిక వసతుల ఏర్పాటు ,అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని ఆమె హామీ ఇచ్చారు .అన్ని వర్గాల ప్రజలు, యువకులు, రైతులు, మహిళలు, వికలాంగులు, వృద్ధులు , నిరుపేద కుటుంబాలు , విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవడానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. గ్రామంలోని వివిధ కుల సంఘాల అభివృద్ధి కోసం , ఆయా కుల వృత్తుల ఉపాధి కోసం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ పథకాల సహకారంతో, రుణాలు ఇప్పించడానికి, ఆయా కులాల ప్రజలను ఆదుకోవడానికి తగిన సహాయ సహకారాలు అందిస్తానని ఆమె తెలిపారు. అలాగే గ్రామంలోని నిరుద్యోగ యువతకు, నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి ఉపాధి మార్గాలు కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీలకు అతీతంగా, ప్రజలందరి సహాయ సహకారాలతో గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని , కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు , ప్రజా ప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా, మండలంలోనే నర్సక్క పేట గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేస్తానని బోల్ల రజిత రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు.. జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో గ్రామ ప్రజలు సహకరించి ,ఈసారి తనకు సర్పంచిగా పనిచేసే అవకాశం ఇవ్వాలని, 14వ తేదీ ఆదివారం రోజున జరిగే పంచాయతీ ఎన్నికల్లో బ్యాట్ గుర్తు (క్రమ సంఖ్య 3) కు ఓటు వేసి గెలిపించాలని సర్పంచ్ అభ్యర్థి బోల్ల రజిత రామచంద్రారెడ్డి ఈ సందర్భంగా గ్రామ ఓటర్లను కోరారు.



## అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సుడిగాలి పర్యటన

**గుండాల, డిసెంబర్ 12 (వెలుతురు):**
స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శుక్రవారం జిల్లా నాయకులతో కలిసి పలు గ్రామాలలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ప్రచారం ముగింపు దశకు చేరుతున్న వేళ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఆయన చేసిన ఈ పర్యటనకు గ్రామాల్లో విశేష స్పందన లభించింది. గుండాల మండలంలోని సీతారాంపురం, గురుజుబావి, కొమ్మాయిపల్లి, మరిపడిగ, మాసాన్ పల్లి, వెల్మజాల, రామారం, బ్రాహ్మణపల్లి, సుద్దాలు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యే ఐలయ్య పాల్గొని జనాలతో మమేకమయ్యారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న విస్తృత సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించిన ఆయన, ప్రతి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై హామీలు ఇచ్చారు. "గత ప్రభుత్వంలా మాటల ప్రభుత్వం కాదు.. మా ప్రభుత్వం చేతల ప్రభుత్వం. ఇప్పటికే ఆరు హామీలను పక్కాగా అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే" అని ఐలయ్య స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధి మరింత



వేగం పట్టాలంటే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ బలపడాలని, అందుకోసం కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వీరసరపు యాదగిరి గౌడ్, గుండాల మండలం మాజీ ఎంపీపీ ధ్యాప కృష్ణారెడ్డి, మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె ముంతల విమల వెంకటేశ్వర్లు ,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెల్లంకి సోమనరసింహారెడ్డి, నూనె ముంతల వెంకటేశ్వర్లు ,ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు




## లీగల్ సర్వీసెస్ అధ్వర్యంలో

# యూనివర్సల్ హెల్త్ డే

- మునిపంపుల, రామన్నపేట ఆసుపత్రులలో నిర్వహణ
- హాజరైన ప్యానల్ అడ్వకేట్లు, డాక్టర్లు




**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 12:**
లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్వర్యంలో యూనివర్సల్ హెల్త్ డే కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ యాదాద్రి భువనగిరి జిల్లా అదేశాలనుసారం, మండల న్యాయ సేవ అధికార సంస్థ రామన్నపేట అధ్వర్యంలో మండల పరిధిలోనీ మునిపంపులలో గల ప్రాధమిక ఆరోగ్య కేంద్రం నందు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విన్ కుమార్, డాక్టర్ కల్యాణి ల సమక్షంలో లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, కోక సబిత లు కలిసి యూనివర్సల్ హెల్త్ కవరేజ్ డే -2025 సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం అక్కడ న్యాయ సేవా అధికార సంస్థ హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు డాక్టర్ దేవేందర్, డాక్టర్ మాధవ చారి ల సమక్షంలో ప్యానల్ లాయర్ మామిడి వెంకట్ రెడ్డి, గడ్డం నర్సింహ, వాలంటీర్ లు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, కోక సబిత లు హాజరై కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేసి, ఆరోగ్య శాఖ అధికారుల సమన్వయంతో ప్రజలకు చట్టపరమైన, ముఖ్యంగా మాతాశిశు ఆరోగ్యం, అత్యవసర సేవలు మరియు ఉచిత చికిత్స అందుబాటులో ఉన్న వ్యాధులకు సంబంధించిన హక్కులను తెలియజేసి, జాతీయ ఆరోగ్య పథకాల కింద ఉచిత చికిత్స గురుంచి తెలిపి న్యాయ సేవా అధికార సంస్థ పనులు, ఉపయోగం, వినియోగంలో తెలియజేశారు. ఈ కార్యక్రమం నందు రెండు ఆసుపత్రులలో గల డాక్టర్లు, వైద్య సిబ్బంది, సిస్టర్స్, స్టాఫ్ నర్స్, శానిటేషన్ సిబ్బంది, వివిధ విభాగాల నుండి సిబ్బంది, ఒపి కోసం వచ్చిన గర్భిణీ స్త్రీలు, జనరల్ వార్డులో ఉన్న పేషెట్లు, తదితరులు పాల్గొన్నారు.

## బీబీనగర్ మండలం రాఘవపురం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి ప్రచారం



**యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి వెలుతురు డిసెంబర్ 12 :**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సందర్భంగా వారు మాట్లాడుతూ రాఘవపురం లో బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి బండారు శంకరయ్య గారి నీ 14వ తేదీన జరిగే సర్పంచ ఎన్నికల లో ఉంగరం గుర్తు పైన ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు కాంగ్రెస్ పార్టీ కళ్ళ బొల్లి మాటలు విని ఆగమ ఆగమ కవోదు, కాంగ్రెస్ పార్టీ అధికారం లో వోచిన తర్వాత వాళ్ళు చేసిన సంక్షేమ పథకాలు ఒక్కటి కూడా లేదు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి తప్ప ప్రజలకు వారు చేసినది ఏమి లేదు అందుకే స్థానిక సంస్థ ఎన్నికలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిలను గెలిపించాల్సి బాధ్య మన అందరి పైన ఉంది అని అన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ యాదగిరి గుట్ట ట్రస్టు బోర్డు సభ్యురాలు గుంటిమీది దయాకర్ భాగ్యమ్మ, జక్కి నగేష్, గ్రామ శాఖ అధ్యక్షులు బుయ్య కిషోర్ గౌడ్,దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,బి అశోక్,సర్వ్ బస్వరాజు గౌడ్,శివగోని రంగయ్య,ఒంగరి రమేష్,బండారి ఆనంద్ గౌడ్,బండారి రాఘవేంద్ర గౌడ్,దొంతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి,అంబటి పరిశరాం, జిల్లా నాయకులు కుతాడి సురేష్,హరీష్, వెంకటేష్,మనోహర్, ఉన్నారు

## చిరుమర్తి ప్రచారంతో ఊపందుకున్న స్థానిక ఎన్నికల సమరం



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 12:**
స్థానిక పట్టణ కేంద్రంలో టిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి అభ్యర్థి మిర్యాల మల్లేష్ గెలుపు కోసం మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి వ్యక్తిని కలిసి తాము చేసిన అభివృద్ధి చేయాల్సిన పనులను వివరిస్తూ తమ అభ్యర్థికి ఎందుకు ఓటెయ్యాలో వివరించారు. పేద రైతు కుటుంబం నుంచి వచ్చిన మిర్యాల మల్లేష్ గతంలో వార్డు సభ్యులుగా చేసిన అనుభవంతో సర్పంచ్ బరిలో ఉన్నారని,తనకి గ్రామంలోని ప్రతి వార్డులో ఉన్నటువంటి సమస్యలపై పూర్తి అవగాహన అవగాహన కలిగి ఉన్నందున తాను భవిష్యత్తులో చేయాల్సిన పనులపై ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని,ప్రజలు తమ ఓటుతో ఆయనని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మిల్లర్లు లేవిని త్వరగా పూర్తిచేయాలి

- **డి టీ మాచన రఘునందన్**



**మునుగోడు డిసెంబర్ 12 వెలుతురు:**
మునుగోడు మండలం లో పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డీటీ మాచన రఘునందన్ శుక్రవారం మునుగోడులోని రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలను తనిఖీ చేశారు.మిల్లర్లు లేవీని త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.లేవీ బియ్యాన్ని వెంటనే పౌర సరఫరాల శాఖకు అందించాలని మిల్లర్లను ఆదేశించారు. నల్గొండ జిల్లా లేవీ సేకరణలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి జరగాలని రఘునందన్ సూచించారు..

# మీ అందరి వాడిని మీ మధ్యలో ఉంటాను... ఆదరించి అవకాశం కల్పించండి...

- ప్రజలకు పెద్ద పెద్ద కోరికలు ఏమి లేవు.
- మౌలిక సదుపాయాలను ప్రజలు కోరుకుంటున్నారు.
- దీనికి అధికార పార్టీ అక్కరలేదు.
- సమర్థవంతమైన నిబద్ధత కలిగిన సర్పంచ్ ఉంటే చాలు.
- స్వతంత్ర అభ్యర్థి కొత్త లింగస్వామి గౌడ్.

**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 12:**
కోమ్మాయిగూడెం గ్రామం లో స్వతంత్ర అభ్యర్థి గా ఎన్నికల్లో పోటీ చేసిన కొత్త లింగస్వామి గౌడ్ ప్రజల కు సమస్యలు వచ్చినప్పుడు అండగా నిలబడాలనీ, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుకుంటున్నారు. తప్ప ప్రజలు పెద్ద, పెద్ద కోరికలు ఏమి కోరడం లేదని స్వతంత్ర అభ్యర్థి కొత్త లింగస్వామి గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామంలో ఇంటింటికి వెళ్లి గ్రామ ప్రజలతో కలసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమ్మాయిగూడెం గ్రామ ప్రజలు విజ్ఞులని చైతన్యం కలిగిన వారిని రాజకీయ పరిజ్ఞానం ఉన్న వారిని ఆయన తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొనీ అసువులు బాసిన వారి వారసత్వం కలిగిన నేల అని ఆయన తెలిపారు. వెంటనే పరిశుద్ధం మెరుగుపరచాలని లైట్ పోతే వెంటనే లైట్ వెయ్యాలని సమయానికి మంచినీరు అందించాలని సిసి రోడ్లు వేయాలని మాత్రమే ప్రజలు కోరుతున్నారని ఆయన తెలిపారు. దీనికి అధికార పార్టీ సర్పంచ్ అక్కరలేదని ఆయన స్పష్టం చేశారు. కమిట్మెంట్తో పనిచేసే సమర్థవంతమైన నిబద్ధత కలిగిన వ్యక్తి సర్పంచ్ అయితే సరిపోతుందని ఆయన తెలిపారు. పెన్షన్ కావాలని, రేషన్ కార్డు కావాలని, ఆరోగ్య సమస్యలు వస్తే వైద్యం అందాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజల వెంటే ఉంటూ అందరికీ అందుబాటులో ఉంటూ ఎవరికి ఏ సమస్య వచ్చినా, ఆపద వచ్చిన, సాపద వచ్చిన, సేవలందిస్తామని, యువతను చైతన్య చేయడం విద్యార్థులను సన్మార్గంలో నడపడం మరింత విద్య ఉద్యోగ అవకాశాలను పెంపొందించడానికి కార్యక్రమాలను నిర్వహించడం చేస్తున్నామన్నారు. అంతే తప్ప మేము ఇల్లు ఇస్తామనో, పదవులు ఇస్తామనో, ఇతర ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నం మేము చేయడం లేదు. గ్రంథాలయం, మహిళా సంఘాల భవనం, బస్సు సౌకర్యం, అంబేద్కర్ విగ్రహం, ఎస్సీ కాలనీలో ఎస్సీ కమిటీ హాల్, గ్రామ సర్పంచిగా గ్రామాన్ని ఉన్నతంగా నడపాలి. గ్రామాన్ని ఒక్క ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో బరిలో దిగుతా ఉన్నాం, కచ్చితంగా విజయం సాధిస్తామని తెలిపారు. ఒక బీసీ బిడ్డగా నేను మీ ముందుకు వస్తున్న గ్రామ ప్రజలు ఆదరించి ఉంగరం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని స్వచ్ఛమైన మనసుతో కోరుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# "ఆరోగ్య సంరక్షణ హక్కులపై అవగాహన"

**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 12:**
అంతర్జాతీయ సార్వత్రిక ఆరోగ్య కవరేజీ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో శుక్రవారం రోజు న కరీంనగర్‌లోని ప్రభుత్వ మాతా శిశు సంక్షేమ ఆసుపత్రి లో విస్తృత ఆరోగ్య సంరక్షణ హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి వెంకటరమణ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. సామాన్య ప్రజలకు, ముఖ్యంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న, సందర్శిస్తున్న వారికి, ఆరోగ్య సంరక్షణ హక్కులు, ప్రభుత్వ ఉచిత ఆరోగ్య పథకాలపై పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ అన్నారు. ప్రతి పౌరుడికి నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులో ఉండటం ఒక ప్రాథమిక హక్కు అని స్పష్టం చేశారు. పేదరికం, లింగ వివక్ష లేదా మరే ఇతర కారణాల వల్ల ఆరోగ్య సేవలు అందకుండా పోకూడదని, అటువంటి వారికి న్యాయ సహాయం అందించడానికి లీగల్ న్యాయ సేవా సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన, ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ ఆరోగ్య పథకాల గురించి వాటిని పొందే విధానం గురించి వివరించారు. ఈ పథకాల ద్వారా ఉచితంగా లభించే వైద్య సేవలు, ఆర్థిక సహాయం , మందుల వివరాలను తెలియజేశారు.

గర్భిణీ స్త్రీలకు, పిల్లల సంరక్షణకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలను వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించే రోగులకు, వారి సహాయకులకు అవసరం ఉన్న న్యాయపరమైన సహాయం అందించేందుకు "హెల్తకేర్ లీగల్ ఎయిడ్ క్లినిక్" అందుబాటులో ఉందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ హక్కుల పూర్తి సమాచారాన్ని ఆసుపత్రికి వచ్చే లబ్ధిదారులు తెలుసుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ జీ. విరారెడ్డి తెలియజేశారు.

ఎం.సి.హెచ్ లో అందజేస్తున్న ఆరోగ్య స్కీములను ఆసుపత్రి ఆర్ ఎం ఓ నవీన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బందితో పాటు టీబిఆఫీసర్ రవీందర్ రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, ప్యానెల్ న్యాయవాదులు ఏ. కిరణ్ కుమార్, యస్.వి.ఆర్. కృష్ణ, పెరుక రంగయ్య పటేల్, పారాలీగల్ వాలంటీర్లు గజ్జెల రవీందర్, రేష్మ తదితరులు పాల్గొన్నారు.




# బాపు,అవ్వా నీ ఓటు నాకే

**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 12 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మండలంలో బాపు,అవ్వా నీ ఓటు నాకే అంటూ తుర్కపల్లి గ్రామపంచాయతీ బీఆర్ఎస్ సర్పంచ్ కుమ్మరి పరమేశ్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. శుక్రవారం గ్రామంలో వివిధ వార్డులలో తన మద్దతు దారులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 18 సంవత్సరాల నుండి తుర్కపల్లి గ్రామంలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి ప్రజల సమస్యల్ని తీర్చడమే ప్రధాన కర్తవ్యంగా కృషి చేస్తున్నానన్నారు. తుర్కపల్లి ప్రజల నుండి మంచి స్పందన ఉందని గ్రామస్తుల,అన్ని వర్గాల ప్రజల అండదండలు, సహకారంతో మరోసారి అద్భుతం విజయం సాధిస్తానని చెప్పారు.ఆయన వెంట గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.







## కిష్టాపురం సర్పంచ్ గా మల్గా శ్రీను, ఉప సర్పంచ్ గా బోయ ప్రసన్న-సతీష్ ఎన్నిక

**మునుగోడు డిసెంబర్ 12 వెలుతురు:**
మునుగోడు మండలం లోని కిష్టాపురం సర్పంచ్ మల్గా శ్రీనివాస్ గారు ఉప సర్పంచ్ బోయ ప్రసన్న- సతీష్ గా ఎన్నిక కావటం జరిగింది. ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు బోయ సురేష్,నీరుడు శేఖర్,మహేశ్వరం భారత్,మాలుగు పాండు,రాజేష్ చారి మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జాజుల అంజయ్య,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు,గ్రామ శాఖ అధ్యక్షులు మునుకుంట్ల పరమేష్,మాజీ సర్పంచ్ లు నందిపాటి రాధ రమేష్, భీమనపల్లి శంకరయ్య, లింగస్వామి వేణు, వెంకట్, వెంకన్న, యదయ్య, యాదిరెడ్డి, నర్సింహ, సాయిబాబా, కృష్ణయ్య ,ఎల్లయ్య, వేణు తదితరులు పాల్గొన్నారు



కిష్టాపురం ఉప సర్పంచ్ గా బోయ ప్రసన్న-సతీష్ ఎన్నిక

## తాండ్ర నూతన సర్పంచ్ కి శుభాకాంక్షలు...



**వెలుతురు, కల్వకుర్తి డిసెంబర్ 12 :**
కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారు ఆశాదీప్ రెడ్డి విజయం సాధించారు. ఈ సంద ర్భంగా జేపల్లి గ్రామపంచాయతీ వార్డు మెంబర్ అభ్యర్థులతో కలసి సర్పంచ్ అభ్యర్థి కొర్రవత్ కవిత పవన్ నాయక్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ఆయన శాలువాతో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు.




## వార్డు మెంబర్ అభ్యర్థి వినూత్న ప్రచారం

**- జేపల్లి గ్రామంలో పత్తి తీసిన 3వ వార్డు మెంబర్ అభ్యర్థి మల్లెపా కుల పరుశురాం**



**వెలుతురు, చారకొండ డిసెంబర్ 12 :**
స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఈ నెల 17వ తేదీన జరుగనున్న మూడవ విడత ఎన్నికలలో జేపల్లి 3వ వార్డు అభ్యర్థి మల్లెపాకుల ప రుశురాం ప్రచారం జోరుగా కొనసా గుతుంది. ప్రచారంలో భాగంగా వి నూత్నంగా పంట చేనులో పత్తి తీ స్తూ.. వినూత్నంగా ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు. తమకు కేటాయించిన గౌన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించా లని అభ్యర్థించారు. తనను ఆద రించి గెలిపిస్తే 3వ వార్డు, గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని అభ్యర్థి తెలుపు తున్నారు.

## ఆశీర్వదించండి.. గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

**- జేపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి కొర్రవత్ కవిత పవన్ నాయక్**





**వెలుతురు, చారకొండ డిసెంబర్ 12 :**
జేపల్లి గ్రామ ప్రజలు తనను ఆశీర్వదించి ఓటు వేస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి కొర్రవత్ కవిత పవన్ నాయక్ అన్నారు. శుక్రవారం గ్రామంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనను ఆదరించి గెలిపిస్తే గ్రామ అభివృద్ధి చేస్తానని అన్నారు. గ్రామంలో సమస్యలైనా విద్యుత్ దీపాలు, సిసి రోడ్లు, తదితర సమస్యలను ప్రజలకు అందుబా టులో ఉండి సమస్యలు పరిష్కరి స్తారని ఆమె పేర్కొన్నారు. గ్రామ సర్పంచిగా కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తనతోపాటు తన ప్యానల్ లో ఉన్న వార్డు సభ్యుల అభ్యర్థు లను కూడా గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువ త, వార్డు మెంబర్ అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మారేపల్లి మల్లారెడ్డిని గెలిపించండి

**- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**





**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 12:**
కొమ్మాయిగూడెం గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రామన్నపేట మండలం కొమ్మాయిగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మారేపల్లి మల్లారెడ్డి గెలిపించాలని మరియు వార్డు సభ్యులకు మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు.

## ఆదరించండి అభివృద్ధి చేస్తా

**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 12 :**
సంగారెడ్డి జిల్లా :- ఆదరించండి అభివృద్ధి చేస్తానని తుర్కపల్లి కాంగ్రెస్ అభ్యర్థి మల్కాపూర్ ప్రతాప్ రెడ్డి అన్నారు. శుక్రవారం తుర్కపల్లిలో తన మద్దతుదారులతో కలిసి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడానికి వారధిలా పనిచేస్తానని చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు గ్రామస్తులు ఉన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రిలో ICTC ల్యాబ్‌పై ఆకస్మిక తనిఖీ

**- రికార్డుల పరిశీలన చేసిన జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నాగరాజు...**



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 12:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉన్న ఐసీటీసీ (ICTC) ల్యాబ్ పనితీరు, రికార్డుల నిర్వహణ, HIV టెస్ట్ కిట్స్ వినియోగంపై జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ (HIV/ఎయిడ్స్) నాగరాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ల్యాబ్‌లో నమోదైన రికార్డులు, రోజువారీ టెస్టింగ్ వివరాలు, పరీక్షల కోసం ఉన్న HIV కిట్స్ నిల్వలు సక్రమంగా ఉన్నాయా అనే అంశాలను నాగరాజు సూక్ష్మంగా పరిశీలించారు. ల్యాబ్ సిబ్బందిని ప్రశ్నిస్తూ పనితీరుపై పూర్తిగా అవగాహన పొందారు. తనిఖీ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లను స్వయంగా సంప్రదించి వారికి HIV రక్తపరీక్షలు సకాలంలో అందుతున్నాయా, సేవలపై ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే HIV పరీక్షలు చేయించుకోవాలని, ఇక్కడ లభించే టెస్ట్‌లు నమ్మకమైనవని, పూర్తిగా ఉచితం అని పేషెంట్లకు అవగాహన కల్పించారు. అనంతరం వారు ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్‌ను కలిసి ఆసుపత్రిలోని HIV విభాగం కార్యకలాపాలు, రోజువారీ పరీక్షల సంఖ్య, అవసరమైన వనరులపై వివరాలు కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వహణ, ల్యాబ్ సదుపాయాలను మెరుగుపరచేందుకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో వారికి సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ శేషు, ల్యాబ్ టెక్నీషియన్ బండి సుధాకర్, కౌన్సిలర్ దండయ్యా ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ బిజేపి పార్టీలు బలపరిచిన అభ్యర్తి దేశ్ ముఖ్ సంతోష్ కుమార్, చౌకన్ పల్లి గ్రామ సర్పంచి గా అవకాశం ఇవ్వండి.






**కంగ్టి మండలం వెలుతురు డిసెంబర్ 12:**
కంగ్టి మండల కేంద్రంలోని చౌకన్ పల్లి గ్రామ సర్పంచ్ గా బిఆర్ఎస్, బిజెపి పార్టీలు బలపరిచిని అభ్యర్థి దేశ్ ముఖ్ సంతోష్ కుమార్ కు అవకాశం ఇవ్వండి. గ్రామ రూపురేఖలు మార్చి చూపిస్తాను, మరియు గ్రామ సర్పంచుగా అవకాశం ఇస్తే మండలంలోనే నంబర్ 1వన్ విలేజ్ గా తీర్చిదిద్దుతాను. శుక్రవారం రోజున గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించాను, మరియు గ్రామ ప్రజలను కలుసుకున్న సంధర్భంగా నాకు గ్రామస్తుల నుండి మంచి ఆదరణ లబించింది, గ్రామ అభివృధే నా లక్ష్యం. గ్రామ సేవకై మీ ముందుకు వచ్చాను. అవకాశమిస్తే గ్రామాన్ని అభివృద్ధి మార్గంలో నడిపిస్తాను, పెద విధ్యార్తులకు ఉచిత విధ్యా, వైద్య సేవలందిస్తాను. గ్రామ దేవాలాయాల అభివృద్ధి కోసం ముందుండి నడిపిస్తాను, మరియు మంచి నీటి సమస్యను పరిష్కరిస్తాను. ప్రతి వీదికి అవసరమైన వీది లైట్ల ఏర్పాటు మరియు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి, గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతాను. ప్రభుత్వ నిధులను వృదా చేయకుండా పూర్తి పారదర్శకతతో వినియోగించడంలో హామీ ఇస్తున్నాను. మీ అమూల్యమైన ఓటు ఉంగరం గుర్తుకు వేసి భారీ మెజారిటీతో గెలిపించ ప్రార్ధన. చౌకన్పల్లి గ్రామ అభివృద్ధి నా భాద్యత, ఈ ప్రచార కార్యక్రమంలో బిఆర్ఎస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు భారీగా పాల్గొని ఊరంతా ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కించారు.

## గ్లోబల్ సమ్మిట్ ఓపెన్ డేకు భారీ స్పందన

**- వేలసంఖ్యలో తరలివచ్చిన సందర్శకులు**

**- సక్తికరంగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ అంశం పై సదస్సు**

**హైదరాబాద్,డిసెంబర్12( వెలుతురు):**
ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే థీమ్‌తో కొనసాగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఓపెన్ డే కు మూడవ రోజు శుక్రవారం నాడు వేలాది మందితో కిటకిటలాడింది. 'రియల్ లైఫ్‌లో రిజిలియెన్స్' అనే అంశంపై ప్రారంభమైన సెషన్‌కు నగరంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరై చర్చలో పాల్గొన్నారు. ఈ చర్చలో, వేగంగా మారుతున్న టెక్నాలజీ ప్రపంచంలో రిజిలియెన్స్ యొక్క ప్రాముఖ్యత,వ్యక్తిగత, వృత్తి పరంగా ఎదురయ్యే ఒత్తిడులు, సవాళ్లను ఎదుర్కోవడం, కొత్త మార్పులకు త్వరగా అలవాటు పడే నాయకత్వ నైపుణ్యాలు, ఎఐ, ఎంఎల్ వంటి ఆధునిక సాంకేతికతల నేపథ్యంలో భవిష్యత్ సిద్ధత, యువతలో గ్రోత్-మైండ్‌సెట్, సమస్య పరిష్కార దృష్టికోణాన్ని అభివృద్ధి చేయడం తదితర అంశాలపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. ఈ సదస్సులో జి. సత్యనారాయణ, మాజీ ఛైర్మన్, మాజీ ఐఏఎస్, జితేంద్ర పుచ్చ, చీఫ్ డెలివరీ ఆఫీసర్, మాస్టెక్ డిజిటల్, శ్రీనివాస్ అత్రేయ, అవికా, కిషోర్ ఉప్పలపాటి,తదితరులు పాల్గొన్నారు. ఈ సెషన్‌లో ముఖ్యంగా ఆకర్షణీయమైన అంశం విద్యార్థుల అద్భుతమైన పాల్గొనడం. వేలాది మంది మధ్య జరిగిన ఈ చర్చలో విద్యార్థులు ఎంతో చురుకుగా ప్రశ్నలు అడిగారు, ప్యానెల్‌తో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు ఈ సదస్సు ప్రాంగణంలో



ఏర్పాటు చేసిన ఏరోస్పేస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండీ క్రాఫ్ట్, టూరిజం, ఎడ్యుకేషన్,,కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి,చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ చెదనలో ఉపయోగించే పలు ఆధునాతన పరికరాలు,డ్రోన్స్ , రోబో తదితర 27 కు పైగా స్టాళ్లను సందర్శకులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా, ఆధునిక పరికరాలు, వైమానిక అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కాగా, రేపు చివరి రోజైన శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటలవరకు ఈ గ్లోబల్ సదస్సు ను సందర్శించవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నాడు అగ్రికల్చర్, రురల్ ట్రాన్స్ఫర్మేషన్ , ఫార్మర్స్ రైసింగ్ అనే అంశంపై సదస్సు జరుగుతుందని ఆ ప్రకటనలో వెల్లడించారు. ఈ రోజు కార్యక్రమానికి దాదాపు ఆరువేలు పైగా హాజరు కాగా వీరిలో ఐదు వేళా మంది విద్యార్థులు,1000 ప్రజలు పాల్గొన్నారు. కారణంగా, ఈ ప్యానెల్ చర్చ మొత్తం సమ్మిట్‌లో అత్యుత్తమమైన, అత్యంత ఇంటరాక్టివ్ మరియు విద్యార్థులకు ఎంతో ప్రేరణ నిచ్చిన సెషన్‌గా నిలిచింది.



## ప్రభుత్వం మాది- అభివృద్ధి మాదే

**కొల్చారం, వెలుతురు న్యూస్ డిసెంబర్ 12:**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున సంగయ్యపేట్ సర్పంచ్ గా కాంగ్రెస్ అభ్యర్థి బంగారుగళ్ల లక్ష్మీని గెలిపిస్తే నర్సాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్లు మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం వారు సర్పంచ్ అభ్యర్థి లక్ష్మి, ఇతర నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున గ్రామాన్ని అభివృద్ధి చేసే అవకాశం తమకే ఉందన్నారు. ఓటర్లు ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు.

## గెలిస్తే తండాకు రోడ్డు వేయిస్తా

**కొల్చారం, వెలుతురు న్యూస్ డిసెంబర్ 12:**



సర్పంచ్ గా తాను గెలిస్తే గ్రామ పరిధిలోని తండాకు బీటీ రోడ్డు వేయిస్తానని సంగాయిపేట బి ఆర్ ఎస్ సర్పంచ్ అభ్యర్థి పుర్ర రత్నమ్మ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి లతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి చేస్తానని, ఇండ్లు రానివారికి ఇండ్లు ఇప్పిస్తానని, గ్రామంలో తాగునీటి సమస్య తీరుస్తానని, కోతుల బెడదను పరిష్కరిస్తానన్నారు. ఓటర్లు కనికరిస్తే ఐదేళ్లపాటు సేవ చేసుకుంటానని తెలిపారు.

## గెలిపించండి- కలిసి తండాను అభివృద్ధి చేద్దాం




**కొల్చారం, వెలుతురు న్యూస్ డిసెంబర్ 12:**
సర్పంచ్ గా తనను గెలిపిస్తే ప్రజల సహకారంతో తండాను అభివృద్ధి చేసుకుందామని సీతారాం తండా స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి చావూలి అన్నారు. శుక్రవారం సర్పంచ్గా అతను బలపరిచే మద్దతుదారులతో కలిసి సర్పంచ్ అభ్యర్థి చావూరి తనయుడు సంతోష్ సీతారాం తండాలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ సమస్య ఉన్న దగ్గరుండి పరిష్కరిస్తానని తమను గెలిపించాలని కోరారు.

***ఎల్లప్పుడూ ప్రజలతోనే...***

సర్పంచ్ గా తనను గెలిపించాలని ఎల్లప్పుడూ ప్రజల వెంటే ఉంటూ సేవ చేస్తానని సీతారాం తండా బి ఆర్ ఎస్ సర్పంచ్ అభ్యర్థి కమలి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో తండాకు అభివృద్ధి పనులు తీసుకువస్తామన్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా ఎప్పుడు ఆపద వచ్చినా ముందుండి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

## పులిపలుపుల 6వ వార్డు మెంబర్ గా పగిళ్ల అనూష రాము ఘన విజయం



**మునుగోడు డిసెంబర్ 12 వెలుతురు:**
మునుగోడు మండలం పులిపలుపుల గ్రామంలో 6వ వార్డు బీసీ మహిళా రిజర్వేషన్కు, తెరాస పార్టీ అభ్యర్థిగా పగిళ్ల అనూష రాము పోటీ చేశారు.గురువారం జరిగిన ఎన్నికల్లో ఆమెకు 6వ వార్డు ప్రజల మద్దతు లభించడంతో, అనూష రాము 110 ఓట్ల అత్యధిక మెజారిటీతో ఘనవిజయం సాధించారు.ఆమె గెలుపొందిన సందర్భంగా 6వ వార్డు ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు.గెల్పించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు.



# ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఎఫ్ఐఆర్ )
## ప్రథమ సమాచార నివేదిక నమోదు చేయడమెలా..






**రంగ కవిత గౌడ్..**
వెలుతురు యాదాద్రి భువనగిరి జిల్లా స్టాఫర్

పోలీస్ స్టేషన్.. పోలీసులు అంటేనే.. ఒక రకమైన భయం.. చదువుకున్న వారు సైతం పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తులు ఇవ్వడానికి తటపటాయిస్తారు
నలుగురు పెద్ద మనుషుల సాయం లేనిదే పోలీస్ స్టేషన్ మెట్లెక్కడానికి వెనుక ముందుఅవుతారు ఏదైనా అవాంఛనీయ సంఘటన మూలంగా తాము గాని, తమ చుట్టూరా ఉన్నవారు గాని ఎవరైనా నష్టానికి, హానికి గురైనపుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడం కనీస బాధ్యత అయితే అత్యవసరమైన ఈ విషయంపై చదువురాని వారికే కాదు.. విద్యావంతులకు సైతం సరైన అవగాహన ఉండదు పోలీసులు, పోలీస్ స్టేషన్ అంటేనే మనసులో అంతర్లీనంగా ఉన్న భయం వల్ల కూడా చాలామంది పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సందేహిస్తుంటారు ఎఫ్ఐఆర్ గురించి విపులంగా తెలిసి ఉంటే అవసరమైన సందర్భాల్లో అనవసరమైన భయాలు, అనుమానాలు లేకుండా మనకున్న రక్షణ హక్కులను వినియోగించుకోవచ్చు

### *ఎఫ్ఐఆర్ అంటే ?*

ప్రాథమిక సమాచార నివేదిక (ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు– ఎఫ్ఐఆర్) కాగ్నిజబుల్ అఫెన్స్ (ఎలాంటి ముందస్తు వారెంట్ లేకుండా అదుపులోకి తీసుకునే నేరం) కు సంబంధించిన సమాచారం అందిన వెంటనే పోలీసులు రాసుకునే సమాచార పత్రం. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 154 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. సంఘటన జరిగిన తర్వాత పోలీసులకు అందే మొదటి సమాచారం ఇదే.

కాగ్నిజబుల్ అఫెన్స్ అంటే కేసు తీవ్రతను బట్టి పోలీసులు వారెంట్ లేకుండా ఎవరినైనా అరెస్టు చేయవచ్చు
కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండానే ఇలాంటి కేసుల్లో పోలీసులు సొంతంగా పరిశోదన ప్రారంభించవచ్చు. ఉదాహరణకు హత్యాయత్నం, హత్య, ఇంటిని కూల్చివేయడం, దోపిడీలు, డెకాయిటీ, మోసం, ట్రెస్‌పాస్, క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్ మొదలైనవి ఎఫ్ఐఆర్ ఎక్కడ ఫైల్ చేయాలి..? సంఘటన జరిగిన ప్రదేశం ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉందో అక్కడే ఫిర్యాదు చేయాలి ఒకవేళ మీకు ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో తెలియక పోతే, అక్కడికి వెళ్లడానికి మీకు ఏదైనా సమస్యలు ఉంటే.. సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు దేశంలో ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేయవచ్చు. తర్వాత నమోదు చేసిన కేసు ఏ ప్రాంతంలో జరిగిందో కనుక్కొని ఆ ప్రాంత పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేసే బాధ్యత పోలీసులదే

### *ఇటీవల మీసేవలో సైతం పోలీస్ స్టేషన్‌లకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు*

ఎఫ్ఐఆర్ చేసే విధానం.. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ నేర శిక్షాస్మృతి 1973లోని సెక్షన్ 154 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. మీరు మౌఖికంగా ఇచ్చిన సమాచారాన్ని పోలీసులు తప్పని సరిగా రాసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఏమి రాసుకున్నారో మీకు తప్పక చదివి వినిపించాల్సి ఉంటుంది. చదివి వినిపించమని అడిగే హక్కు మీకుంటుంది అయితే చాలా సందర్భాల్లో పోలీసులు మాత్రం ఫిర్యాదు ఇవ్వండి..కేసు చేస్తాం వెళ్ళండి అంటారు కానీ పోలీసులు రాయరు..అలాగే బాధితుడు రాసిన ఫిర్యాదును యథాతదంగా తీసుకోక తమకు అనుకూలంగా మలుచుకొని ఫిర్యాదు తీసుకోవడం జరుగుతుంది సమాచారాన్ని ఇచ్చే వ్యక్తి ఎఫ్ఐఆర్‌లో తప్పనిసరిగా సంతకం చేయాల్సి ఉంటుంది. సంతకం చేసే ముందు ఫిర్యాదులో తప్పు ఒప్పులను చూసుకోవాల్సిన బాధ్యత మాత్రం మీదే. చదవడం, రాయడం రానివారు తమ ఎడమ చేతి బొటన వేలి ముద్రను సంతకం చేయాల్సిన స్థానంలో వేయాల్సి ఉంటుంది ఎఫ్ఐఆర్ ఫైల్ చేసిన తర్వాత దాని నకలును పోలీసులను అడిగి తీసుకోండి. దీని కోసం ఎలాంటి రుసుం చెల్లించికుండా కాపీ తీసుకునే హక్కు ఫిర్యాదు దారునికి ఉంటుంది ఎవరు ఫైల్ చేయాలంటే.. సంఘటన మూలంగా నష్టపోయిన బాధితులు ఫిర్యాదు చేయాలి. వారు అందుబాటులో లేని పక్షంలో వారి తాలూకా కుటుంబీకులు కూడా ఫిర్యాదు చేయవచ్చు నేరం ఎలా జరిగింది.. ఎవరు చేశారు.. నేరం జరగడానికి గల కారణాలు తెలిసిన వ్యక్తులు, ఇలాంటి




సందర్భాల్లో సమాచారం ఎలా తెలిసిందో పేర్కొంటూ ఫిర్యాదుదారుడు ఎఫ్ఐఆర్‌లో సంతకం చేయాల్సి ఉంటుంది.

### *నేరం జరిగినపుడు చూసిన ప్రత్యక్ష సాక్షులు కూడా ఫిర్యాదు చేయవచ్చు*

ఫిర్యాదు తీసుకోవడానికి నిరాకరిస్తే మీ ఫిర్యాదు తీసుకోవడానికి నిరాకరించిన అధికారి పేర ఫిర్యాదు జత చేసి జిల్లా ఎస్పీకి పంపాలి. ఇలా పంపేందుకు కొరియర్‌లో కాకుండా రిజిస్టర్ పోస్టులో పంపితే ఫిర్యాదు అందిన తర్వాత మీకు అక్‌నాలెడ్జ్‌మెంట్ కార్డు రావడం వల్ల ఫిర్యాదు చేరిందన్న నమ్మకం కలుగుతుంది. మీరు స్వయంగా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ను గానీ ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదును వారి దృష్టికి తీసుకెళ్లవచ్చు ఉన్నతాధికారులు మీ ఫిర్యాదును నమ్మినైట్లైతే వారే స్వయంగా కేసును పరిశోధించడం గానీ, లేదా కేసులో పరిశోధన జరిగేలా కింది స్థాయి అధికారులను ఆదేశించవచ్చు జరిగిన నేరం ఏ కోర్టు పరిధిలోకి వస్తుందో అక్కడ వ్యక్తిగతంగా మీరు ప్రైవేటు కంప్లైంటు ద్వారా ఫిర్యాదు నమోదు కు ఆదేశం పొందవచ్చు పోలీసులు మీ ఫిర్యాదు విషయంలో ఏ కారణాల వల్లనైనా నిర్లక్ష్యం చేస్తే మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర శాఖకు, జాతీయ శాఖకు కూడా ఫిర్యాదు చేయవచ్చు నేర శిక్షాస్మృతి సెక్షన్ 161 ప్రకారం మీ స్టేట్‌మెంట్‌ను పోలీసులు తప్పని సరిగా నమోదు చేయాల్సి ఉంటుంది ఫిర్యాదును నమోదు చేసుకున్న తర్వాత కేసులో పరిశోధన జరగకపోతే జరగకపోవడానికి గల కారణాలను పోలీసులు తప్పని సరిగా రికార్డు చేయాల్సి ఉంటుంది నేర శిక్షాస్మృతిలోని 1973లోని సెక్షన్ 157 ప్రకారం ఫిర్యాదుదారులకు పోలీసులు కేసులో పరిశోధన జరపకపోవడానికి గల



కారణాలను కచ్చితంగా తెలియజేయాల్సి ఉంటుంది ఎఫ్ఐఆర్‌లో ఉండాల్సిన వివరాలు.. మీ పేరు.. చిరునామా, బాధితుల సమాచారం, ఫిర్యాదు చేయడానికి మీకు ఉన్న హోదా లేదా అధికారం, సంఘటనకు సంబంధించిన సమయం, రోజు, స్థలం లాంటి వివరాలు. నేరం ఎలా జరిగింది.. ఎందుకు చేశారు లాంటి పక్కా సమాచారం. నేరంలో పాల్గొన్న వ్యక్తుల పేర్లు, ఒకవేళ తెలిస్తే, లేకపోతే వారిని గుర్తించడానికి వీలైన పోలికలు దొంగతనం లాంటి కేసుల్లో వీలైతే పోయిన వస్తువుల విలువ, వాటి వివరాలు నేరస్తులు సంఘటనకు సంబంధించి వదిలి వెళ్లిన ఆధారాలు ఉంటే అవి సంఘటనలో మీరు గాయపడితే మీరు దవాఖానలో చికిత్స తీసుకున్నారో అక్కడి మెడికల్ సర్టిఫికెట్ జత చేయాలి చేయ కూడనవి తప్పుడు సమాచారం ఇవ్వడం వల్ల భారతీయ శిక్షాస్మృతి 1860 ప్రకారం సెక్షన్ 203 కింద పోలీసులను తప్పుదోవ పట్టించినందుకు గాను శిక్షపడే అవకాశం ఉంది నేరానికి సంబంధించిన సమాచారాన్ని దాచడం, నిజాలను పక్కదారి పట్టించడం, ఆధారాలను నాశనం చేయడం లాంటివి చేయకూడదు ఇలా చేయడం వల్ల మీరు దోషులుగా గుర్తించబడుతారు. నేరానికి సంబంధించిన అసంపూర్ణమైన, అస్పష్టమైన సమాచారం ఇవ్వకూడదు రాత పూర్వకంగానే ఇవ్వాలి.. ఫిర్యాదు రాతపూర్వకంగా గాని, మౌఖికంగా గానీ ఇవ్వవచ్చు. ఫోన్ ద్వారా అందించిన సమాచారాన్ని కూడా ఎఫ్ఐఆర్‌గా పరిగణించబడుతుంది
క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 154 ప్రకారం ఎఫ్ఐఆర్ రాతపూర్వకంగానే ఉండాలన్న నిబంధన లేదు. మౌఖికంగా చెప్పిన సమాచారాన్ని పోలీసులు రాసుకోవాలి. తర్వాత సమాచారం అందించిన వ్యక్తికి చదివి వినిపించి వారి సంతకాన్ని తీసుకోవాల్సి ఉంటుంది

### *రాతపూర్వకంగానే ఫిర్యాదు ఇవ్వాలన్న డిమాండ్ చేసే అధికారం పోలీసులకు లేదు*

నేరం జరిగిన తర్వాత ఎంత కాలంలో ఫిర్యాదు చేయాలి ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి కాలపరిమితి అంటూ ఏమీ లేదు. కాని ఫిర్యాదు ఆలస్యమైన కొద్దీ కేసులో సాక్షాధారాలు బలహీనపడే అవకాశం ఉంది. కనుక వీలైనంత వరకు నేరం జరిగిన కొన్ని గంటల్లోపే ఫిర్యాదు నమోదు చేయాలి

### *ఎఫ్ఐఆర్ నమోదు తర్వాత*

ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత పోలీసులు కేసుకు సంబంధించిన పరిశోధన మొదలు పెడతారు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన రోజు నుంచి 90 రోజు లోగా చార్జిషీట్ నింపాలి. ఆరు నెలల్లో విచారణ ప్రారంభించాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత కేసులో విచారణ మందకోడిగా సాగుతుందనిపిస్తే మీరు జిల్లా కోర్టులో కేసు వేయవచ్చు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత ఆరు నెలలకు సైతం చార్జిషీట్ వేయకపోతే జిల్లా ఎస్పీకి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి మీరు రాతపూర్వకంగా విన్నవించవచ్చు.
ఎఫ్ఐఆర్‌ను మార్చవచ్చా..!
చార్జిషీట్‌ను నింపకముందు
ఏ సమయంలోనైనా ఎఫ్ఐఆర్‌ను మార్చడానికి వీలవుతుంది. కేసుల తీవ్రతను బట్టి తగ్గించడానికి వీల్లేదు
కానీ కేసును బలంగా తయారు చేయడానికి కొత్త సెక్షన్‌లను కలుపడానికి వీలవుతుంది.



జనవరిలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు
# విస్తృత ఏర్పాట్లు

దేవాలయ గద్దెల పునరుద్ధరణ అభివృద్ధి పనులను, దేవాలయ ప్రాంగణంలోని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల రాతి నిర్మాణాలను, ఆలయ ప్రాంగణ ఫ్లోరింగ్ పనులను, రాతి స్తంభాల స్థాపన నిర్మాణ పనులను,జంపన్న వాగు వద్ద పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. తొలుత సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద పూజుల చేశారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు మరో వందేళ్ల వరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూసే విధంగా నిర్మాణాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మేడారం దేవాలయం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ జాతరకు గిరిజనులు, గిరిజనేతరులు దాదాపు కోటి మందికి పైగా హాజరవుతారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని మేడారం ప్రాంగణాన్ని మహా అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. జాతర కోసం 50 కిలోమీటర్ల పరిధిలో భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నామని ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ , ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ , ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి,పూజారులు, ఆర్ అండ్ బి, ఇంజనీరింగ్ అధికారులు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ హామీలే తప్ప అమలు లేదు

**- పాతబస్తీ జనంబాటలో కవిత విమర్శలు**



**హైదరాబాద్,డిసెంబర్12( వెలుతురు):**
హైదరాబాద్ నగరంలోని మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయణ గుట్ట నియోజకవర్గాల్లో గురువారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమెల్సీ కల్వకుంట్ల కవిత జాగృతి జనంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. సైదాబాద్‌లో స్టీల్‌బ్రిడ్జి పనులను పరిశీలించి ఐదేళ్లుగా నిర్మాణం జరుగుతున్నా ఇంకా పూర్తి కాకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇవ్వడమే తప్ప నెరవేర్చిందేమీ లేదని విమర్శించారు. పాతబస్తీలో పర్యటిస్తే గోతులమయంగా మారిన రోడ్లు, 30ఏళ్ల క్రితం వేసిన మ్యాన్‌హోళ్లు తప్ప నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ పైపులైన్లు కనిపించడం లేదన్నారు. పురాణ షహర్ కాదు.. హమారా షహర్ అని, అందరితో సమానంగా అభివృద్ధి జరగాలని కోరారు. గౌలిపురా ముంపు ప్రాంతాల సమస్యను పరిష్కరించాలన్నారు. పాతబస్తీ అభివృద్ధికి ప్రభుత్వం తక్కువ బ్జడెట్ ఇచ్చి చిన్నచూపు చూస్తున్నదని ఆరోపించారు. ముసారాంబాగ్ చౌరస్తాలో ఎ?సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో దానిపై ఆధారపడిన చాలా మంది విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదముందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. హామీ ప్రకారం విద్యార్థులకు స్కూటీలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి వ్యాపారులు, హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 42 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ మార్కెట్‌లో కనీస సౌకర్యాలు, పారిశుధ్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. యాకుత్‌పుర నియోజకవర్గం సింగరేణి కాలనీ, ఖాజాబాగ్, చింతల బస్తీల్లో కవిత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుడిసెవాసులతో సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు వచ్చినా బస్తీల్లో కనీస మౌలిక సదూపాయాలు లేక ప్రజలు దుర్భర జీవనం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు శైలజా గౌడ్, రాధాకృష్ణ, ఆశిశ్ దూబె, సాయి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పెరిగిన చలి తీవ్రత

**- ఉత్తరాది నుంచి శీతలగాల తాకిడి**
**- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**హైదరాబాద్,డిసెంబర్12( వెలుతురు):**
తెలంగాణ వ్యాప్తంగా చలిపులి పంజా విసురుతోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతలగాలుల వల్ల రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయినట్లు వాతావరణ శాఖ అధికారి తెలిపారు. ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాల్లో చలి గాలుల ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. రెండ్రోజుల పాటు శీతల, అతి శీతల పవనాలు వీచే అవకాశం ఉన్నందున ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు. ఎల్లుండి నుంచి పొగ మంచు పెరిగే అవకాశం ఉందన్నారు. శీతల గాలులు, పొగ మంచు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు వాతావరణ కేంద్రం వివరించింది. పొగ మంచు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. శీతల గాలులతోపాటు పొగ మంచు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వాతావరణ కేంద్రం సూచించింది.ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో శీతల గాలులు వీచే అవకాశం ఉంది. దాంతో ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శనివారం.. ఆదిలాబాద్, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో శీతల గాలులు వీచే సూచనలున్నాయి. ఈ జిల్లాలకు సైతం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. 14వ తేదీ.. ఆదివారం.. రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. హైదరాబాద్‌లో చూస్తే రాత్రి వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఉపరితల గాలులు ఉత్తర ఈశాన్య దిశలో వీచే అవకాశం ఉందని పేర్కొంది.

# ట్యూషన్ టీచర్ దాష్టీకం

**- విద్యార్థికి అట్లకాడతో వాతలు**

**హైదరాబాద్,డిసెంబర్12( వెలుతురు):**
ఓ చిన్నారిపై ట్యూషన్ టీచర్ దాష్టీకానికి పాల్పడింది. సరిగా చదవడం లేదన్న కారణంగా అట్లకాడతో వాతలు పెట్టడంతో చిన్నారికి గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ పీఎస్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్‌పేటలోని ఓయూ కాలనీకి చెందిన ఏడేళ్ల బాలుడు ఒకటో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు గురువారం సాయంత్రం స్థానికంగా ఉన్న మానస అనే టీచర్ వద్దకు ట్యూషన్‌కు పంపించారు. అక్కడ సరిగా చదవడం లేదనే కారణంతో టీచర్ మానస ఆ బాలుడి చేతులు, కాళ్లు, ముఖంపై అట్లకాడతో వాతలు పెట్టింది. చిన్నారి శరీరంపై 8 చోట్ల కాలిన గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడిని వైద్య పరీక్షల కోసం గోల్కొండ ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. గాయాల వల్ల బాలుడు నడవలేకపోతున్నాడు. తమ కుమారుడిపై దాష్టీకానికి పాల్పడిన మానసపై కఠిన చర్యలు తీసుకోవాలని అతడి తల్లిదండ్రులు కోరారు.

# గెస్ట్ ఫ్యాకల్టీపై ప్రొఫెసర్ అత్యాచారం

**- ఫిర్యాదుతో పోలీసులు అరెస్ట్**

**హైదరాబాద్,డిసెంబర్12( వెలుతురు):**
హైదరాబాద్ నగరంలోని జేఎన్టీయూలో దారుణం చోటు చేసుకుంది. గెస్ట్ ఫ్యాకల్టీపై ప్రొఫెసర్ లైంగిక దాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒకే సామాజిక వర్గం అంటూ నమ్మించి మరీ బాధితురాలిని ప్రొఫెసర్ వంచించాడు. ఉద్యోగం నుంచి తీసేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతూ.. భయపెడుతూ పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలుస్తోంది. చివరకు బాధితురాలి కాపురాన్ని కూడా కూల్చేశాడు కీచక ప్రొఫెసర్. వర్క్ ఉందంటూ బాధితురాలిని అర్ధరాత్రి వరకు తనతోనే ఉంచుకున్నాడు ప్రొఫెసర్. దీంతో భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో బాధితురాలు ఒంటరిగా ఉంటోంది. అంతేకాకుండా ఆమె ఒంటరితనాన్ని అవకాశంగా మలుచుకుని శారీరకంగా, మానసికంగా ప్రొఫెసర్ మరింతగా వేధింపులకు గురిచేశాడు. తన ఛాంబర్‌లో కూడా బాధితురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. రోజు రోజుకు ప్రొఫెసర్ వేధింపులు అధికమవడంతో బాధితురాలు తీవ్ర మానసిక వేదనకు గురైంది. ప్రొఫెసర్ వేధింపులు భరించలేక పోలీసులను ఆశ్రయించింది. దీంతో నిందితుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రముఖ విశ్వ విద్యాలయంలో జరిగిన ఈ ఘటనపై విద్యార్థులు, ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఫ్యూచర్ సిటీకి విపరీతమైన క్రేజ్



**హైదరాబాద్, డిసెంబర్12 ( వెలుతురు):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ.. దేశంలో మరే ఇతర కొత్త నగర నిర్మాణానికి దక్కని అరుదైన ప్రాముఖ్యతను దక్కించుకుంది. 13,500 ఎకరాల్లో సువిశాలంగా రూపుదిద్దుకోనున్న ఈ నగరం, కేవలం రెండు రోజుల తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025 విజయంతోనే ప్రపంచ పారిశ్రామిక పటంలో కీలక గమ్యస్థానంగా నిలిచింది. ఈ సమ్మిట్‌లో 44 దేశాల ప్రతినిధులు హాజరు కావడం, రూ.5.7 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరగడం ఫ్యూచర్ సిటీ పట్ల ఇన్వెస్టర్ల విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది.దేశంలో ఇప్పటికే అనేక స్మార్ట్ సిటీలు, కొత్త నగరాల నిర్మాణ ప్రతిపాదనలు దశాబ్దాలుగా కేవలం కాగితాలకే పరిమితమైన సందర్భాలు ఉన్నాయి. కానీ భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించడం అనేది సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ దార్శనికత, కార్యాచరణ వేగానికి నిదర్శనం అని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమ్మిట్ ముగిసిన వెంటనే ఫ్యూచర్ సిటీ కార్యరూపం దాల్చడానికి మార్గం సుగమమైంది. మౌలిక సదుపాయాలు, డీప్ టెక్, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, ఇన్ఫ్రా, ఎంటర్టైన్మెంట్, డిఫెన్స్, ఏఐ వంటి రంగాలకు లక్షల కోట్ల పెట్టుబడులు తరలివస్తున్నాయి. ఈ ప్రాంతాన్ని నివాస కేంద్రంగా, వ్యాపార – పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.భారత్ ఫ్యూచర్ సిటీ నగరాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హెల్త్ సిటీ, ఎంటర్‌టైన్‌మెంట్, క్రీడలు, డేటా సెంటర్స్, అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థల జిల్లాలుగా మొత్తం ఆరు విభాగాలుగా నిర్మించనున్నారు. ముఖ్యమైన నిర్మాణ ప్రక్రియలో భాగంగా డేటా సెంటర్ల కోసం 400 ఎకరాలు కేటాయించారు, వచ్చే ఫిబ్రవరి చివరిలో నిర్మాణాలు ప్రారంభం కానున్నాయి. ఇక మరో నెల రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కార్యక్రమాలు మొదలవుతాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షల మేరకు ఈ 13,500 ఎకరాల నగరాన్ని జీరో కార్బన్ సిటీగా రూపొందించే లక్ష్యంతో.. నగరం అంతటా అర్బన్ ఫారెస్ట్‌లు, రెయిన్ హార్వెస్టింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఫార్మా, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో పరిశోధన, మ్యాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలు ఇక్కడ ఉంటాయి. ఈ నగరం సమగ్ర జీవన కేంద్రంగా ఉండనుంది. ఇక్కడ 13 లక్షల మందికి ఉద్యోగాలు, 9 లక్షల జనాభా కోసం నివాస సముదాయాలు ఏర్పాటవుతాయి. అంతేకాకుండా రిలయన్స్ ఫౌండేషన్ వంతారతో వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ఏర్పాటుతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్ట్‌లో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్లు, స్టార్ హోటళ్లు, రేసింగ్ ట్రాక్‌లు వంటి వినోద, క్రీడా సౌకర్యాలు కూడా అందుబాటులోకి రానున్నాయి.భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం అద్భుతమైన మౌలిక వసతులు, అత్యాధునిక రవాణా వ్యవస్థలతో ఒక ఆర్కిటెక్చరల్ అద్భుతంగా నిలవనుంది. సమ్మిట్ విజయం తర్వాత దేశంలో ఏ కొత్త నగరానికి దక్కని ప్రాముఖ్యత ఈ ప్రాజెక్ట్‌కు దక్కింది. ఇది తెలంగాణ విజన్–2047 లక్ష్యాలకు అనుగుణంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ఫ్యూచర్ సిటీ కీలక పాత్ర పోషించనుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# ఫస్ట్ టూ ట్వల్త్...ఒక్కటేబోర్డు

**హైదరాబాద్, డిసెంబర్12 ( వెలుతురు):**

తెలంగాణ పాఠశాల విద్యలో అతిపెద్ద మార్పులు రానున్నాయి. ఇప్పటిదాకా పదో తరగతి వరకు ఉన్న ఎస్ఎస్‌సీ బోర్డు, ఇంటర్ వరకు ఉన్న ఇంటర్మీడియట్ బోర్డు రెండు కలిసి పోనున్నాయి. ఈ మేరకు 1 నుంచి 12వ తరగతి వరకు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు ఏర్పాటు చేయనుంది ప్రభుత్వం. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047లో ఈ విషయాన్ని వెల్లడించింది.ప్రస్తుతం ఉన్న సెకండరీ స్కూల్ సర్టిఫికేట్, ఇంటర్మీడియట్ బోర్డులను ఒకే అధికారంతో భర్తీ చేయడం ద్వారా తెలంగాణ తన పాఠశాల విద్యా వ్యవస్థను పునర్నిర్మించనుంది. కొత్త బోర్డు అన్ని వర్గాల పాఠశాలలకు విద్యా ప్రమాణాలు, నాణ్యతా నిబంధనలు, గుర్తింపును నిర్వహిస్తుందని ప్రభుత్వం తెలిపింది. డ్యూయల్–బోర్డు వ్యవస్థ నుండి వైదొలగాలని కేంద్రం రాష్ట్రాలకు చెబుతోంది.ప్రాథమిక, యూపీఎస్, ఉన్నత పాఠశాలలు వంటి ఒకే ప్రాంతంలో పనిచేసే పాఠశాలలు ఒకే ప్రధానోపాధ్యాయుడి కింద ఒకే సంస్థలో విలీనం అవుతాయి. ఈ ఏకీకృత పాఠశాలలు అన్నమాట ప్రీ–ప్రైమరీ నుండి 10వ తరగతి వరకు తరగతులను అందిస్తాయి. హైస్కూల్‌గా మారుతుంది. విలీనం ముందు విద్యార్థులకు తగిన ప్రత్యామ్నాయాలు అందిస్తారు. దీని ద్వారా అనేక ఉపయోగాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతుంది. ఒకే ప్రాంతం, ఒతే ప్రదేశంలో ఉన్న వివిధ పాఠశాలలు ఒకే గొడుగు కిందకు వస్తాయి.ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో దశలవారీగా ప్రీ–ప్రైమరీ తరగతులను ప్రవేశపెడుతుంది. సరిపడా ఉపాధ్యాయులను కూడా అందిస్తుంది. కోడింగ్, కంప్యూటేషనల్ థింకింగ్, వయస్సుకు తగిన ఏఐ అక్షరాస్యతతో పాటు పాఠశాల స్థాయి నుండి వృత్తి విద్యను ఏకీకృతం చేయాలని రాష్ట్రం యోచిస్తోంది. పరీక్షా వ్యవస్థ, అభ్యాస అంచనా పద్ధతులను కూడా పునఃరూపకల్పన చేస్తారు.విద్యా ప్రమాణాలను నియంత్రించడానికి తెలంగాణ స్కూల్ స్టాండర్డ్స్ అథారిటీ ఏర్పాటు చేస్తారు. విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తిని చూస్తారు. దీని ఆధారంగా అవసరమైన చోట ఉపాధ్యాయులను పోస్ట్ చేస్తారు. జిల్లా, మండల స్థాయి సమీక్షలు ప్రతి సంవత్సరం ఉంటాయి. టెక్నాలజీ ద్వారా ట్రాన్స్‌ఫర్ రిపోర్ట్ తయారు అవుతుంది. నియామకాలు కోర్ సబ్జెక్టులు, ఆర్ట్స్, శారీరక విద్య, కౌన్సెలింగ్ వంటి అనుబంధ రంగాలను కవర్ చేస్తాయి. పోస్ట్ గ్రాడ్యుయేట్ లేదా పీహెచ్‌డీ అర్హత ఉంటే.. వారిని ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ కళాశాలలలో కూడా నియమించవచ్చు.ప్రభుత్వ %ణ×జు% కళాశాలలను కొత్త ప్రీ–ప్రైమరీ ఉపాధ్యాయులు, ఇన్–సర్వీస్ సిబ్బంది కోసం కోర్సులను అందించే విద్యా కేంద్రాలుగా మారుస్తారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నెట్‌వర్క్‌లను ప్రభుత్వం మరింత క్రియాశీలకంగా చేయనుంది. దీనిద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై దృష్టి పెడుతుంది. అంతేకాదు ఎన్ఆర్ఐలను కూడా ఇందులో భాగం చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

# ఒకే చోట రెండు వైన్ షాపులు.. స్థానికుల మండిపాటు..

**సికింద్రాబాద్ డిసెంబర్12 ( వెలుతురు):**

ఒకే చోట రెండు మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి తమ రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహిళలు ధర్నా చేపట్టారు. మద్యం దుకాణాల ముందు నిలబడి ఎక్సైజ్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బేగంపేట్ లో శ్యామ్ లాల్ బిల్డింగ్ సమీపంలో ఏర్పాటు చేసిన దుకాణాలకు వ్యతిరేకంగా శ్యామ్ లాల్ బిల్డింగ్ వెల్ఫేర్ అసోసియేషన్, విజయ్ గణపతి టెంపుల్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ 7కాలనీలకు వెళ్లేందుకు ఉన్న ప్రధాన రహదారి ఇది అని ఈ రహదారి ప్రారంభంలోనే ఇరు వైపులా రెండు మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి స్వాగతం పలుకుతున్నట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి కనీసం పార్కింగ్ స్థలం కూడా లేదని ఐనా అనుమతులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. మద్యం దుకాణానికి అనుమతి ఇచ్చిన అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. బస్ స్టాప్ కు వెళ్లాలన్నా, బస్ స్టాప్ నుండి ఇళ్లకు వెళ్లాలన్న మహిళలు, పిల్లలు, పెద్దలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం కోసం శాంతి యుతంగా ఈ కార్యక్రమం చేయడం జరిగిందని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకొని మద్యం దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుండా మరింత ఉధృతంగా ఉద్యమాన్ని చెప్పాట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# సిటీలో 1500 కి.మీ. మేర 'పీపుల్ ఫస్ట్ కారిడార్లు'

**హైదరాబాద్, డిసెంబర్12 ( వెలుతురు):**

హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం 'విజన్–2047'తో దూసుకుపోతోంది. మెరుగైన రవాణా, పారిశ్రామిక అభివృద్ధి, వారసత్వ సంపద పరిరక్షణ, పౌర సౌకర్యాలు, పచ్చదనం పెంపు వంటి అంశాలపై దృష్టి సారించారు. మూసీ నదిని సుందరీకరించి 24 గంటల తాగునీటి సరఫరా లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. హైదరాబాద్‌ను ఆవిష్కరణలకు, పెట్టుబడులకు కేంద్రంగా తీర్చిదిద్దడమే దీని ముఖ్య ఉద్దేశ్యం.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజన్–2047 పేరుతో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలపడానికి బృహత్తర ప్రణాళికను రూపొందించింది. దేశంలోనే కాదు, ప్రపంచంలోని పది అగ్రగామి ఆవిష్కరణలకు, పెట్టుబడులకు, అత్యుత్తమ జీవన ప్రమాణాలకు కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్నది విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యం. కోర్ అర్బన్ రీజియన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రణాళికలను ప్రభుత్వం నిర్దేశించింది. ఈ విజన్ ప్రధానంగా మొబిలిటీ, పారిశ్రామిక అభివృద్ధి, వారసత్వ సంపద, పౌర సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ అనే ఐదు కీలక స్తంభాలపై ఆధారపడి ఉంది.నగర భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో సమీకృత రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ సర్వీసులను అనుసంధానించడం ద్వారా ప్రజలకు మెరుగైన ప్రయాణ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం కామన్ మొబిలిటీ కార్డును అందుబాటులోకి తీసుకురానున్నారు. అంతేకాక, ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ప్రత్యేక మార్గాల్లో బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (బీఆర్‌టీఎస్) ను ఏర్పాటు చేయనున్నారు. ప్రజారవాణాను ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించడం ద్వారా శివారు ప్రాంతాల ప్రజలకు సౌలభ్యం కల్పించనున్నారు. ముఖ్యంగా, రవాణా ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజారవాణా మార్గాల నుంచి కేవలం 15 నిమిషాల్లో చేరుకునే దూరంలో నిర్మించే కార్యాలయాలు, వాణిజ్య భవనాలు, నివాసాలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించనుంది. నగరంలో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి 1,000 కి.మీ. వాకింగ్, సైక్లింగ్ కారిడార్లు, పాదచారుల కోసం అంతరాయాలు లేని పాదబాటలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, స్కైవాక్‌లను నిర్మించనున్నారు. నగరవ్యాప్తంగా 1500 కి.మీ. మేర 'పీపుల్ ఫస్ట్ కారిడార్ల'ను ఏర్పాటు చేసి, ట్రాఫిక్ రద్దీ లేని, సురక్షితమైన వీధులను డిజైన్ చేయనున్నారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న పారిశ్రామిక భూములను బహుళ వినియోగానికి అనువుగా అభివృద్ధి చేయడానికి బ్లూన్‌ఫీల్డ్ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించనున్నారు. పర్యాటక రంగ అభివృద్ధి లక్ష్యంగా వారసత్వ సంపద సంరక్షణకు చర్యలు తీసుకుంటారు. పాతబస్తీకి యునెస్కో వరల్డ్ హెరిటేజ్ హోదా సాధించడాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. 100 పార్కులను, ప్లాజాలను సాంస్కృతిక కేంద్రాలుగా తీర్చిదిద్ది, భారీ ఈవెంట్లకు వేదికలుగా మారుస్తారు. నైట్ ఎకానమీని పెంచడానికి సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్, జలాశయాల వద్ద, ఐటీ కారిడార్లలో 24 గంటలు పనిచేసేలా హ్యాకర్స్ సెంటర్స్ 2.0 మరియు ఆధునిక మార్కెట్లను ఏర్పాటు చేయనున్నారు.పర్యావరణ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని బ్లూ–గ్రీన్ హైదరాబాద్–2047 పేరుతో ప్రత్యేక ప్రణాళికను అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా మూసీ నదిని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతూ మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేపడతారు. పశ్చిమం నుంచి తూర్పు వరకు 35–40 కి.మీ. పొడవునా నడక మార్గాలు, వాటర్ ట్యాక్సీ డాక్స్, జెట్టీలు, వంతెనలు, వ్యూయింగ్ డెక్‌లతో సుందరీకరణ చేపట్టనున్నారు. 100 చెరువులను సుందరీకరించడంతో పాటు హుస్సేన్‌సాగర్ 2.0 ద్వారా దానిని మరింత అభివృద్ధి చేస్తారు. జలాశయాల వద్ద సైక్లింగ్, వాకింగ్ లూప్స్, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, రెయిన్ గార్డెన్స్ ఏర్పాటు చేస్తారు. 1500 కి.మీ. అర్బన్ ఫారెస్ట్ బ్లాక్స్, స్ట్రీట్ కనోపీ, నడక మార్గాలు ఏర్పాటు చేయడం ద్వారా నగరంలో పచ్చదనాన్ని పెంచుతారు. ఈ విజన్‌లో అత్యంత ముఖ్యమైన అంశం ఏంటంటే, ప్రజలకు 24 గంటలూ తాగునీరు సరఫరా చేసే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది.

# లోకల్ లైట్...

**హైదరాబాద్, డిసెంబర్12 ( వెలుతురు):**

పార్టీ పవర్‌లో లేదు. పైగా సిచ్యువేషన్స్ బాలేవు. పోనీ పట్టుబట్టి అభ్యర్థులను గెలిచిపించినా..ఎన్నికయ్యాక వాళ్లు పార్టీలో ఉంటారో జంప్ అవుతారో తెలియదు. ఎందుకొచ్చిన టెన్షన్. లైట్ తీసుకుంటే పోలా అంటోందట బీఆర్ఎస్. అందుకే సర్పంచ్ ఎన్నికలపై గులాబీ పార్టీ సీరియస్‌గా ఫోకస్ పెట్టడం లేదన్న టాక్ వినిపిస్తోంది. ఓవైపు సీఎం రేవంత్ రెడ్డి పంచాయతీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుని జిల్లాల టూర్ చేస్తుంటే..బీఆర్ఎస్ మాత్రం కనీసం పట్టించుకోవడం కాదు కదా..ఓ సమీక్ష కూడా చేయకపోవడం చర్చకు దారితీస్తోంది.తెలంగాణలో పంచాయతీ ఎన్నికల రాజకీయం అంతకంతకు హీటెక్కుతోంది. నువ్వానేనా అన్నట్లుగా పోటీ పడుతున్నారు ప్రధాన పార్టీల అభ్యర్థులు. చాలా చోట్ల కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నడుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అయితే పంచాయతీ ఎన్నికల వేళ..జిల్లా టూర్‌లో బీఆర్ఎస్‌పై విమర్శల దాడి చేస్తున్నారు. ప్రజాపాలన రెండేళ్ల సంబరాల పేరుతో జిల్లాల్లో పర్యటిస్తున్న రేవంత్..సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వరాల జల్లులు కురిపిస్తున్నారు. వెళ్లిన చోటల్లా పెద్దఎత్తున నిధులను మంజూరు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారు ముఖ్యమంత్రి. సాధ్యమైనంత వరకు మెజారిటీ పంచాయతీలను గెలుచుకోవాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ఇండైరెక్ట్‌గా పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని చెబుతున్నారు. దీన్ని బట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలను ఎంత సీరియస్‌గా తీసుకున్నారో అర్థం చేసుకోవచ్చు.ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ మాత్రం




పంచాయతీ ఎన్నికలను లైట్ తీసుకున్నట్లు కనిపిస్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓటమి తర్వాత ఇంకాస్త నిరాశ చెందిన గులాబీ పార్టీ ఇంకా దాని నుంచి బయటకు రాలేకపోతోందన్న చర్చ జరుగుతోంది. ఇక స్థానిక సంస్థల ఎన్నికలు అంటే ఎలాగూ అధికార పార్టీదే పైచేయి ఉంటుంది. పైగా పట్టుబట్టి అభ్యర్థులను పెట్టి గెలిపించినా వారు పార్టీలో ఉంటారో లేదోనన్న డైలమా ఉందట. అన్నింటికి మించి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులకు ఫండింగ్ చేయడం కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు, నియోజకవర్గ ఇంచార్జ్‌లకు ఇప్పుడున్న పరిస్థితుల్లో భారంగా మారనుంది.

ఈ అంశాన్నింటిని దృష్టిలో పెట్టుకుని సర్పంచ్ ఎన్నికలను లైట్ తీసుకుందట బీఆర్ఎస్. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ గుర్తు ఉంటుంది కాబటి..అప్పుడు ఎంతో కొంత ఫోకస్ చేయాలని భావిస్తోందట. మెయిన్‌గా అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా పని చేసుకుంటూ పోవాలనేది బీఆర్ఎస్ కారు పార్టీ ఆలోచనగా చెబుతున్నారు. 20 నుంచి 30 నియోజకవర్గాలు మినహా మిగతా నియోజకవర్గలో బీఆర్ఎస్ నేతలు పంచాయతీ ఎన్నికలను అంత సీరియస్‌గా తీసుకోవడం లేదని తెలంగాణ భవన్ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది. పార్టీ క్యాడర్ స్ట్రాంగ్‌గా ఉన్నచోట.. ఎమ్మెల్యేలు అండదండలు ఉన్న దగ్గర..కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అంటున్నారట బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు. రాష్ట్ర పార్టీ మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలను పెద్దగా పట్టించుకోవడం లేదని..అంతర్గతంగా మాజీ మంత్రులు ఓసారి జిల్లాల వారీగా సమీక్ష చేశారని అంటున్నారు.పంచాయతీ ఎన్నికలను కారు పార్టీ లైట్ తీసుకోవడానికి ఎన్నో రీజన్స్ ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. ఇప్పుడు సర్పంచ్‌లను, వార్డు సభ్యులను గెలిపించుకున్నా ఆ తర్వాత వాళ్లను అధికార కాంగ్రెస్.. పార్టీలో చేర్చుకుంటుందని బీఆర్ఎస్ భావిస్తోందట. ఇప్పటికే చాలాచోట్ల బీఆర్ఎస్ నుంచి పోటీ చేయాలనుకున్న సర్పంచ్ అభ్యర్థులు..కాంగ్రెస్ నేతల ప్రలోభాలకు వెళ్లిపోయారని గులాబీ పార్టీ నేతలు వాపోతున్నారు. దీంతో కారు పార్టీ నుంచి పోటీ చేసేందుకు కొన్నిచోట్ల అభ్యర్థులు కూడా లేరన్న చర్చ జరుగుతోంది. ఒకవేళ తాము బలపరిచిన అభ్యర్థులు గెలిచినా..అభివృద్ధి పేరుతో హస్తం గూటికి చేరే అవకాశం ఉందని అంటున్నారు. అందుకే ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ఎన్నికలను పెద్దగా పట్టించుకోవడం లేదన్న టాక్ వినిపిస్తోంది. అయితే పరిస్థితులు ఎలా ఉన్నా స్థానిక ఎన్నికలపై పార్టీ చేతులు ఎత్తేస్తే రానున్న రోజుల్లో క్యాడర్ చేజారిపోయే ప్రమాదం ఉందని బీఆర్ఎస్‌లో అంతర్గత చర్చ జరుగుతోంది

# కలహాల కాపురం కాంగ్రెస్ ను ఎం చేస్తుందో

**హైదరాబాద్, డిసెంబర్12 ( వెలుతురు):**

కాంగ్రెస్‌లో కలహాలు కామన్. ఓ నేత అంటే మరో లీడర్‌కు పడదు. ఇంకో నాయకుడి ఎదుగుదలను మరొక నేత డైజెస్ట్ చేసుకోలేరు. ఇక పవర్‌లోకి వచ్చాక ఈ గొడవ ఇంకా ఎక్కువైంది. ఇప్పుడు పంచాయతీ ఎన్నికల వేళ.. ఇంటి పోరు హస్తం పార్టీకి హెడెక్‌గా మారిందట. మరీ ముఖ్యంగా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న నల్గొండ జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతల ఆధిపత్య పోరు..సర్పంచ్ ఎన్నికల్లో పోటీనే మార్చేసిందట. ఏ ఊరికి వెళ్లినా కనీసం ఇద్దరు నేతలు కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీ ఉండటంతో.. ఎక్కడ తమ పుట్టి మునుగుతుందేమోనని టెన్షన్ పడుతున్నారట హస్తం పార్టీ పెద్దలు.అధికార హస్తం పార్టీకి నల్గొండ జిల్లా కంచుకోట. 12 అసెంబ్లీ సీట్లు ఉంటే ఒక్క సూర్యాపేటలో మినహా మిగతా 11 సీట్లను తన ఖాతాలో వేసుకుంది కాంగ్రెస్ పార్టీ. జిల్లాలో కీలక పదవులన్నీ కాంగ్రెస్ నేతల చేతుల్లోనే ఉన్నాయి. చాలా ముఖ్యమైన పంచాయతీ ఎన్నికల్లోనే హస్తం పార్టీకి అసలు సమస్య వచ్చి పడిందట. ఇన్నాళ్లుగా లీడర్ల మధ్య నడిచిన కోల్డ్ వార్ కాస్త.. వర్గపోరుగా మారి..రచ్చకెక్కి ఇంటిపోరును రోడ్డున పడేస్తుందట. ఇప్పటికే పాత, కొత్తగా విడిపోయిన అధికార పార్టీ నేతలు పార్టీలో కుంపటి పెట్టారట. జరుగుతున్న పరిణామాలు తెలుస్తున్నా..నోరెత్తలేని పరిస్థితుల్లో ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారని ఆ పార్టీ సీనియర్ లీడర్లే చెబుతున్నారు. ముఖ్యంగా జనరల్ స్థానాల్లో ఇటువంటి ఇంటి పోరు ఎక్కువగా ఉందని అంటున్నారు హస్తం నేతలు.ఆధిపత్య పోరుతో పల్లె పోరు అధికార హస్తం పార్టీకి చెమటలు పట్టిస్తోందట. ఉమ్మడి జిల్లాలో దాఖలైన నామినేషన్లను పరిశీలిస్తే దాదాపు అన్నిచోట్ల పోటీ కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్టుగానే ఉంటోందట. హస్తం పార్టీ లీడర్లే వర్గాలుగా విడిపోయి పోటీ పడుతున్నారట. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఒరిజినల్ కాంగ్రెస్..వలస కాంగ్రెస్ లీడర్ల మధ్య గట్టి ఫైట్ నడుస్తోందట. సీనియర్ కాంగ్రెస్ నేతల అనుచరులు కూడా రంగంలోకి దిగడంతో బుజ్జగింపులు కత్తి మీద సాములాగా మారాయంటున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు బుజ్జగించినా పెద్దగా ఫలితం ఇవ్వకపోవడంతో తలలు పట్టుకున్నారట.తమ నేతల మధ్య పోటీ ఎక్కడ విపక్షాలకు మేలు చేస్తుందోనన్న టెన్షన్ అధికార పార్టీ నేతల్లో కనిపిస్తోందట. పైకి మాత్రం ఎవరు గెలిచినా తమ పార్టీ వారే కదా అంటున్నప్పటికీ..ఇంటిపోరు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందట. నకిరేకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేముల వీరేశం తాను బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

అక్కడ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్గానికి చెందిన వారు కూడా నామినేషన్లు వేశారట.మొదటి దశ పోలింగ్ జరిగే మెజార్టీ పంచాయతీల్లో దాదాపుగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వర్గీయులే బరిలో ఉన్నారట. రాజకీయంగా ప్రభావం చూపే సర్పంచ్ ఎన్నికల్లో మంత్రి అనుచరులు బరిలో నిలవడంతో నకిరేకల్ హస్తం రాజకీయం వేడెక్కుతోంది. మార్కెట్ కమిటీల నియామకం నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం మధ్య గ్యాప్ పెరిగిందనే ప్రచారం బలంగా ఉంది. అటు మంత్రి, ఇటు ఎమ్మెల్యే కావడంతో సీనియర్ నేతలు కూడా తమకు ఎందుకొచ్చిన లొల్లి అని మౌనంగా ఉంటున్నారట.మంత్రి అండ చూసుకొని కొందరు గ్రామ, మండల స్థాయి నేతలు వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మెల్యే వేముల వీరేశం అసహనంగా ఉన్నారట. మంత్రి కూడా నో డిస్కషన్స్..మన మనుషులు బరిలో ఉండాల్సిందేనని పట్టుబట్టడంతో పలు చోట్ల పోటీ తప్పలేదని అంటున్నారు. అటు మంత్రి, ఇటు ఎమ్మెల్యే వ్యూహాలకు పదును పెడుతుండటంతో నకిరేకల్ కాంగ్రెస్ రాజకీయం వేడుక్కుతోంది. ఇక తుంగతుర్తి నియోజకవర్గంలో కూడా ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గీయులు, దివంగత నేత దామోదర్ రెడ్డి వర్గీయులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. నియోజకవర్గంలో బరిలో ఉన్నవారిలో ఎక్కువ మంది తమ పార్టీ వాళ్లేనని హస్తం పార్టీ నేతలే చెప్తున్నారు.కొత్త కాంగ్రెస్, పాత కాంగ్రెస్‌గా విడిపోయిన క్యాడర్..ఎవరికి వారు నామినేషన్లు వేశారు. నియోజకవర్గంలోని 90శాతం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సపోర్టర్సే బరిలో ఉన్నారుట. పలుచోట్ల ముగ్గురు కాంగ్రెస్ మద్ధతుదారులు పోటీలో ఉండటంతో క్యాడర్ తలలు పట్టుకుంటున్నారట. ఓవైపు ఎమ్మెల్యే వర్గం, మరోవైపు దామోదర్ రెడ్డి వర్గంగా విడిపోయి ఎవరికి వారు పోటీ చేస్తుండడంతో ఎవరికి ఎవరు నచ్చచెప్పాలో కూడా తెలియని పరిస్థితి నెలకొందట.సూర్యాపేట నియోజకవర్గంలో దామోదర్ రెడ్డి, పటేల్ రమేష్ రెడ్డి వర్గంగా విడిపోయి బరిలో నిలిచారు. ఇక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చెందిన హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల్లోనూ పలుచోట్ల సొంత పార్టీ నేతలే పోటీ పడుతుండటం ఆశ్చర్యంగా మారింది. మొదటి నుంచి పార్టీని నమ్ముకొని పనిచేస్తే..రాకరాక ఈ సారి అవకాశం వచ్చిందని..సమీకరణాల పేరుతో కొత్తవారికి టికెట్ ఇస్తున్నారంటూ పాత క్యాడర్ తీవ్ర ఆందోళనకు గురవుతోందట.మిర్యాలగూడలో కూడా పలు గ్రామాల్లో అధికార పార్టీ నేతల మధ్యే హోరాహోరీ పోరు కొనసాగుతోంది. పార్టీ గుర్తుపై జరిగే ఎన్నికలు కాకపోవడం..ఎవరు గెలిచినా తమ పార్టీనే కదా అన్న ధీమాతో ఎమ్మెల్యేలు పలుచోట్ల పల్లె పాలిటిక్స్ జోలికి పోవడం లేదు. ఎవరు గెలిచినా పార్టీకి నష్టం లేదని ఎమ్మెల్యేలే అంటున్నారట. అయితే ముఖ్యనేతలను నమ్ముకొని పోటీ చేసి ఆర్థికంగా నష్టపోతే తమ పరిస్థితి ఏంటని అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారట.మరోవైపు అధికార పార్టీ అన్న తర్వాత ఆశావహులు ఎక్కువగా ఉంటారని కవర్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారట కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. ఇదే అదనుగా వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో తమ మద్ధతుదారులను గెలిపించుకోవాలని బీఆర్ఎస్ ఉవ్విళ్లూరుతోంది. పలుచోట్ల వామపక్ష పార్టీలతో అవగాహన కుదుర్చుకుంటూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు గులాబీ లీడర్లు.

## దువ్వాడ మాధురి శ్రీనివాస్‌కి  బిగ్ షాక్

**- అనుమతి లేకుండా బర్త్ డే పార్టీ**

**- మద్యం బాటిళ్లు, హుక్కాలు స్వాధీనం**




**హైదరాబాద్, డిసెంబర్12( వెలుతురు):**
దువ్వాడ మాధురి శ్రీనివాస్‌కి  బిగ్ షాక్ తగిలింది. గురువారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ ద పెండెంట్ ఫామ్‌హౌస్‌లో ఆయన పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. ఈ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరైనట్లు సమాచారం. ఈ క్రమంలో బర్త్ డే పార్టీని రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు నిలిపివేశారు. జన్మదిన వేడుక జరుపుకోవడానికి పోలీసుల నుంచి దువ్వాడ మాధురి శ్రీనివాస్ ఎలాంటి పర్మిషన్ తీసుకోకపోవడంతోనే భగ్నం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పార్టీలో అక్రమ మద్యాన్ని కూడా పోలీసులు పట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ బర్త్ డే పార్టీలో 10 స్కాచ్ బాటిళ్లు, ఐదు హుక్క బాటిళ్లను ఎస్ఓటి పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దువ్వాడ మాధురి శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

## 75లోకి అడుగిడిన తలైవా రజనీకాంత్


**- ప్రధాని మోడీ ప్రత్యేక అభినందనలు**




**చెన్నై, డిసెంబర్12( వెలుతురు):**
సూపర్ స్టార్ రజనీకాంత్ శుక్రవారం 75వ పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు తలైవాకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా బర్త్‌డే విషెస్ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం రజనీకాంత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. '75వ పుట్టినరోజు సందర్భంగా తిరు రజనీకాంత్‌జీకి శుభాకాంక్షలు. ఆయన నటన ఎన్నోతరాలుగా ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. తన స్టైల్‌తో ఎన్నో ప్రశంసలు పొందారు. విభిన్న పాత్రలు చేస్తూ సినిమా ఇండస్ట్రీలో శాశ్వత స్థానాన్ని సొంతం చేసుకున్నారు. 75వ పుట్టినరోజు చేసుకుంటోన్న సంవత్సరంలోనే ఆయన ఇండస్ట్రీక్రి వచ్చి 50 ఏళ్లు పూర్తికావడం విశేషం. ఆయన ఇలానే మంచి ఆరోగ్యంగా ఉంటూ ప్రేక్షకులను అలరించాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను' అని ప్రధాని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

## భార్యాభర్తల మధ్య గొడవలు

**- మామను కత్తితో పొడిచి చంపిన అల్లుడు**



**పటాన్‌చెరు,డిసెంబర్12(వెలుతురు):**
సంగారెడ్డి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. మామను అల్లుడు కత్తితో పొడిచి చంపడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధి బీరంగూడ కమాన్ సమీపంలో నివాసముండే చంద్రయ్య (58)ను అల్లుడు రామకృష్ణ కత్తితో పొడిచి హతమార్చాడు. రామకృష్ణకు భార్యకు మధ్య మనస్పర్ధలు రావడంతో గత మూడు నెలలుగా భార్య తల్లి గారి ఇంటి వద్ద ఉంటున్నది. గురువారం సాయంత్రం చంద్రయ్య ఇంటికి రామకృష్ణ వచ్చి భార్యతో గొడవ పడుతుండగా చంద్రయ్య వారిని వారించాడు. ఆగ్రహానికి గురైన రామకృష్ణ అంతు చూస్తానని ఇంటికి వెళ్లి కత్తి తీసుకొని వచ్చి చంద్రయ్యను పొడిచి హత్య చేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## గోవిందరావు పేట సర్పంచ్‌గా శ్రీలత ఎన్నిక

**- ఫలించని మంత్రి సీతక్క ప్రచారం**




**ములుగు,డిసెంబర్12( వెలుతురు):**
ములుగు జిల్లా మేజర్ గ్రామపంచాయితీ గోవిందరావు పేట సర్పంచ్‌గా బిఆర్ఎస్ బలపర్చిన శ్రీలత ఎన్నికయ్యారు. గురువారం ఓట్ల లెక్కింపులో ఆమె విజేతగా నిలిచారు. సీతక్క ఐదు సార్లు ప్రచారం నిర్వహించినా కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థికి అపజయమే ఎదురైంది. బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన కాకులమర్రి శ్రీలత భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఏటూరు నాగారం సర్పంచ్‌గా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు సతీమణి శ్రీలత పోటీచేశారు. ఆమె 3230 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. మొత్తం 8,333 ఓట్లు పోలవ్వగా బీఆర్ఎస్‌కు 5,520, కాంగ్రెస్ అభ్యర్థికి 2,330, బీజేపీ అభ్యర్థికి 64 ఓట్లు వచ్చాయి. తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటింది.  ములుగు జిల్లాలో అతిపెద్ద గ్రామ పంచాయతీ అయిన ఏటూరు నాగారం సర్పంచ్ స్థానాన్ని మంత్రి సీతక్క సవాల్‌గా స్వీకరించినప్పటికీ ఓటమి తప్పలేదు.

# కాంగ్రెస్ నేతల ఇలాఖాల్లో బిఆర్ఎస్ గెలుపు

**- పలుచోట్ల స్వల్ప తేడాతో ఓడిన అభ్యర్థులు**

**హైదరాబాద్, డిసెంబర్12( వెలుతురు):**
వేలం పాటల ఏకగ్రీవాల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా కనిపించినా.. ప్రజాక్షేత్రంలో మాత్రం గులాబీ పార్టీ పలుస్థానాల్లో సత్తా చూపింది.  హోరాహోరీగా సాగిన తొలి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అధికార కాంగ్రెస్ పార్టీకి ముచ్చెమటలు పట్టించారు. గులాబీ సైన్యం పోటీచేసిన ప్రతి పంచాయతీలో పోటీ నువ్వా–నేనా అన్నట్టు సాగింది. సంఖ్యాపరంగా కాంగ్రెస్ పార్టీకి పంచాయితీల సంఖ్య కొద్దిగా మెరుగ్గా ఉన్నట్టు కనిపించినా.. ఆ పార్టీకి గ్రామాల్లో 56శాతం వ్యతిరేక ఓట్లు పడ్డట్టు ఎన్నికల ఫలితాలను బట్టి తెలుస్తున్నది.  సూర్యాపేట జిల్లా లింగంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించారు. మేజర్ గ్రామ పంచాయతీకి బీఆర్ఎస్ బలపరిచిన 95 ఏండ్ల రామచంద్రారెడ్డి తిరుగులేని ఆధిక్యం కనబరిచారు. భద్రాచలం కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సొంత గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నేత మడకం జోగయ్య 84 ఓట్ల తేడాతో గెలిచారు. మంత్రి సీతక్క సొంత జిల్లా ములుగు మేజర్ గ్రామ పంచాయతీ ఏటూరునాగారంలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కాకులమర్రి శ్రీలత 3,230 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.  60 శాతంకాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల



స్వగ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. జడ్చర్ల, భద్రాచలం, షాద్‌నగర్, మహబూబాబాద్, ఇంకా అనేక నియోజవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ సొంత గ్రామాల్లో సర్పంచ్‌లను గెలిపించుకోలేకపోయారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4,236 గ్రామ పంచాయతీల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో 396 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. 3,834 గ్రామ పంచాయతీలకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ ఏకగ్రీవం చేసుకున్న మేజర్ పంచాయతీలను వేలం పాటల ద్వారానే కొనుగోలు చేసినట్టు తెలుస్తున్నది.  గులాబీ పార్టీ 1,345 చోట్ల విజయం సాధించినట్టు వార్తలు అందాయి. బీఆర్ఎస్ అభ్యర్థులు కేవలం 10ఓట్ల లోపు తేడాతో 50కి పైగా గ్రామాల్లో ఓటమి చవిచూసినట్టు తెలిసింది. 20 ఓట్ల తేడాతో ఓడిన గ్రామాలు 150కిపైగానే ఉన్నట్టు తెలుస్తున్నది. వచ్చే సాధారణ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తామని కలలు కంటున్న బీజేపీ కేవలం 186 గ్రామ పంచాయతీలకే పరిమితమైంది. ఏ రాజకీయ పార్టీ మద్దతు లేకుండానే పోటీ చేసిన అభ్యర్థులు 524 పంచాయతీల్లో విజయం సాధించారు.

# డివిజన్ల పునర్విభజన షురూ

**హైదరాబాద్, డిసెంబర్12( వెలుతురు):**
ఎల్బీనగర్ నియోజకవర్గంలో డివిజన్ల పునర్విభజనతో నూతన డివిజన్ల ఏర్పాటుతో పాటు రాజకీయ వర్గాల్లో నూతనోత్సాహం కనిపిస్తుంది. జీహెచ్ఎంసీలో శివారు ప్రాంతాలను విలీనం చేసిన అనంతరం నూతన డివిజన్లను వాటి పేర్లలో ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకటించారు. కాగా, ఎల్బీనగర్ జోనల్ లోని హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్ సర్కిళ్ల పరిధిలోని  డివిజన్లను పునర్విభజన చేశారు.నూతనంగా 9 నూతన డివిజన్లు ఏర్పాటు కాబోతున్నాయి. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మూడు సర్కిళ్లలో ఇప్పటివ రకు మొత్తం 13 డివిజన్లు ఉండగా, వాటి స్థానంలో మొత్తం 22 డివిజన్లు రానున్నాయి. నూతన డివిజన్ల ఏర్పాట్లపై అభ్యం తరాలు, సలహాలు, సూచనలు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు కోరుతున్నారు.  ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో ఇప్పటివరకు 11 డివిజన్లు ఉన్నాయి. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 11 డివిజన్లు ఉన్నాయి. వీటికి అదనంగా నూతనం గా 7 డివిజన్లు ఏర్పాటు చేయడంతో మొ త్తంగా 18 డివిజన్లు ఏర్పాటు కానున్నాయి. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో ఉన్న మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన సరూర్ నగర్, ఆర్కేపురం డివిజన్లను సైతం పునర్విభజన చేశారు. రెండు డివిజన్ల స్థానం లో మరో రెండు డివిజన్లు ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం జీహెచ్ఎంసీ జోనల్ పరిధిలో ఇప్పటి వరకు మూడు సర్కిళ్ల ఉన్నాయి. వీటిలో హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్ సర్కిళ్లు ఉన్నాయి. హయత్ నగర్ సర్కిల్ పరిధిలో నాలుగు డివిజన్లు నాగోల్, మన్సూరాబాద్, హయత్ నగర్, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్లు ఉన్నాయి. ఎల్బీనగర్ సర్కిల్ లో ఇప్పటివరకు వనస్థలిపురం, హస్తినాపురం, చంపాపేట, లింగోజిగూడ డివిజన్లు ఉన్నాయి.సరూర్ నగర్ సర్కిల్ లో ఇప్పటివరకు కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం, సరూర్ నగర్, ఆర్కే పురం



డివిజన్లు ఉన్నాయి. మూడు సర్కిళ్ల పరిధిలోని డివిజన్లను పునర్విభజన చేసి, కొత్తగా ఎనిమిది డివిజన్లు ఏర్పాటు చేశారు. సరూర్ నగర్ సర్కిల్ పరిధిలోని కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజ న్లను యథావిధిగా ఉంచారు. అయితే, మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్ నగర్ డివిజన్ ను విభజించి డాక్టర్స్ కాలనీ పేరుతో కొత్త డివిజన్, రామకృష్ణాపురం డివిజన్ ను విభజించి ఎన్టీఆర్ నగర్ పేరుతో నూతన డివిజన్ ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఎల్బీనగర్ సర్కిల్ లో ఉన్న చంపాపేట డివిజన్ విభజించి నూతనంగా కర్మన్ ఘాట్, హస్తినా పురం డివిజన్ నుంచి  బైరామల్ గూడ, వనస్థలిపురం డివిజన్ నుంచి చింతలకుంట,  నాగోల్ డివిజన్ నుంచి సాయినగర్, మన్సూరాబాద్ డివిజన్ నుంచి లెక్చరర్స్ కాలనీ, హయత్ నగర్ డివిజన్ నుంచి హైకోర్టు కాలనీ, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ నుంచి  సాహెబ్ నగర్ డివిజన్లను ఏర్పాటు చేశారు. తాజాగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో 7 డివిజన్లు, మహేశ్వరం నియోజకవర్గంలో 2 నూతన డివిజన్లు ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని సరూర్ నగర్ సర్కిల్ పరిధిలోని కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజన్లను యథావిధిగా ఉంచారు. నియోజకవర్గంలోని డివిజన్ల పునర్విభజనతో రాజకీయ పార్టీలో నూతనోత్తేజం కనిపిస్తుంది. సుమారు 40 వేల జనాభాకు ఒక డివిజన్ ఏర్పాటు చేస్తుండడంతో కొత్తవారికి రాజకీయ రంగ ప్రవేశం లభిస్తుంది. పాలన వికేంద్రీకరణ కావడంతో ప్రజలకు మౌలిక, కనీస సౌకర్యాలు, వసతులు అందుబాటులోకి వస్తాయి. దీంతో పాటు కొత్తగా రాజకీయ అవకాశాలు అందరికీ అందుబాటులోకి వస్తాయి.

## తెలంగాణలో ఇలా

**హైదరాబాద్, డిసెంబర్ 12, ( వెలుతురు)**
తెలంగాణలోనూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. డిసెంబర్ 7 నుంచి డిసెంబర్ 16వ తేదీ దాకా చలి గాలులు వీస్తాయని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరించారు. రాబోయే 7 రోజుల్లో చలిగాలులకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. డిసెంబర్ 10 నుంచి 13వ తేదీ మధ్య చలిగాలులు ఎక్కువగా ఉంటాయన్నారు. తాజాగా ఉదయంపూట అనేక ప్రాంతాల్లో ఉషో?గ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి.సంగారెడ్డిలో 6.6 డిగ్రీల సెల్సియస్ ఉషో?గ్రత నమోదైంది. అసిఫాబాద్ 6.6, ఆదిలాబాద్ 6.8, వికారాబాద్ 7.8, కామారెడ్డి 8.2, నిజామాబాద్ 8.4, మెదక్ 8.4, రంగారెడ్డి 8.4, సిద్దిపేట 8.9, నిర్మల్ 9.0, సిరిసిల్ల 9.2 ఉషో?గ్రతలు ఈ ఉదయం నమోదు అయ్యాయి.భాగ్యనగరంలోనూ చలి వణికిస్తోంది. శేరిలింగంపల్లి 8.4, రాజేంద్రనగర్ 10.1, అల్వాల్ 10.6, బీహెచ్ఈఎల్ 10.6, ఆర్సీ పురం 12.2, నేరెడ్‌మెట్ 12.4, చందానగర్ 12.4, కంచన్‌భాగ్ 13.1 డిగ్రీల సెల్సియస్ ఉషో?గ్రతలు నమోదు అయ్యాయి.జనాలు విపరీతమైన చలి కారణంగా ఎక్కువగా ఇళ్లలోనే ఉండిపోతున్నారు. మంటలకు దగ్గరగా ఉంటున్నారు. ఏఎస్ఆర్ జిల్లాలోని అనేక



ప్రాంతాలను దట్టమైన పొగమంచు కప్పేసింది. ఉదయంపూట ఎటు వెళ్లలేని పరిస్థితి. పొగమంచుతో దారులు సరిగా కనిపించడం లేదు. ఆదివారం జి మాడుగులలో 5.3 డిగ్రీల సెల్సియస్, ముంచింగిపుట్టులో 7.7 డిగ్రీలు, అరకు వ్యాలీలో 8.9, లంబసింగిలో 9.5 డిగ్రీల ఉషో?గ్రతలు నమోదయ్యాయి. చింతపల్లె వద్ద 9.5 డిగ్రీలుగా నమోదైంది. శనివారం రాత్రి, ఆదివారం ఉదయం గడ్డకట్టే పరిస్థితులు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. విశాఖ నగరంలో అత్యల్ప ఉషో?గ్రత 17.4 డిగ్రీలకు పడిపోవడంతో ప్రజలు చలిగా భావించారు. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నంలో ఆదివారం 15.7 డిగ్రీల ఉషో?గ్రత నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా తీరప్రాంతం, రాయలసీమ ప్రాంతాలలో ఆదివారం కనిష్ట ఉషో?గ్రతలు 1 నుంచి 2 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోయాయి. రాబోయే రోజుల్లో కనిష‘ ఉషో?గ్రతలు మరింత తగ్గనున్నట్టుగా వాతావరణ శాఖ అంచనా వేసింది.దిత్వా తుపాను, వర్షపాతం కారణంగా నవంబర్‌లో పర్యాటకుల రాక తగ్గిందని ఏఎస్ఆర్ జిల్లాలోని స్థానికులు తెలిపారు. మళ్లీ పర్యాటక రాక పెరుగుతుందని భావిస్తున్నారు.అంతకుముందు నవంబర్ 19వ తేదీన చింతపల్లెలో ఈ సీజన్‌లో అత్యల్ప ఉషో?గ్రత 6.8 డిగ్రీలుగా నమోదైంది. జనవరి 8, 2023లో చింతపల్లెలో 1.5 డిగ్రీల సెల్సియస్‌ని తాకింది. ఉదయం వేళల్లో ప్రయాణికులు ఎటైనా వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగమంచు కప్పేస్తుంది. రహదారులు కనిపించడం లేదు. రాబోయే రోజుల్లో మరింత ఉషో?గ్రతలు పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది.

## అన్నీ సేవలన్నీ గ్రేటర్ నుంచే

**హైదరాబాద్, డిసెంబర్ 12, ( వెలుతురు)**
ఇటీవల జీహెచ్ఎంసీలో విలీనం అయిన 27 మున్సిపాలిటీలు అందించే అన్ని సేవలను శనివారం నుండి కార్పొరేషన్ చూసుకుంటుంది. ఇందులో భవన నిర్మాణ అనుమతులు, జనన మరియు మరణ ధ్రువీకరణ పత్రాలు, వాణిజ్య లైసెన్స్‌తోపాటుగా మరిన్ని ఉన్నాయి. ధ్రువపత్రాలు, అనుమతులు, రసీదులలో జీహెచ్ఎంసీ లోగో ఉంటుంది. 27 మున్సిపాలిటీలు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలను కలుపుతూ ఔటర్ రింగ్ రోడ్ లోపల లేదా ఆనుకుని ఉన్నాయి. మున్సిపాలిటీలు కేటాయించిన జీహెచ్ఎంసీ సర్కిల్, జోన్ ద్వారా భవన నిర్మాణ అనుమతులు ప్రాసెస్ అవుతున్నాయి. దరఖాస్తులను బిల్డ్ నౌ ద్వారా ప్రాసెస్ చేస్తున్నారు.గతంలో మున్సిపాలిటీలలో మూడు అంతస్తులు లేదా అంతకంటే తక్కువ నిర్మాణాలకు భవన అనుమతిని సంబంధిత మునిసిపాలిటీ లేదా మున్సిపల్ కార్పొరేషన్ మంజూరు చేసేది. మూడు అంతస్తులకు పైగా నిర్మాణాలకు హెచ్ఎండీఏ అనుమతి ఇచ్చేది.శనివారం నుండి అన్ని భవన నిర్మాణ అనుమతులను జీహెచ్ఎంసీ మంజూరు చేయడం ప్రారంభించింది. ఎత్తైన నిర్మాణాలకు జీహెచ్ఎంసీ సర్కిల్ లేదా జోనల్ కార్యాలయాలు కాకుండా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం అనుమతి ఇస్తుందిఈ 27 మున్సిపాలిటీలలోని ఇతర సేవలను కూడా జీహెచ్ఎంసీ చూసుకుంటుంది. ఉదాహరణకు పోచారం మునిసిపాలిటీలో దరఖాస్తు చేసుకున్న జనన ధ్రువీకరణ పత్రం జీహెచ్ఎంసీ




పేరుతో వస్తుంది. 20 మునిసిపాలిటీల మున్సిపల్ కమిషనర్లను సంబంధిత డిప్యూటీ కమిషనర్లుగా నియమించారు. కొత్త డిప్యూటీ కమిషనర్లు కూడా వారి సంబంధిత జోనల్ కమిషనర్లకు నివేదిస్తారు.జీహెచ్ఎంసీలో విలీనం అయిన 27 మున్సిపాలిటీల్లో కమిషనర్ల ద్వారా 1000 చదరపు గజాల స్థలం వరకు రెసిడెన్షియల్ భవనానికి నాలుగు ఫ్లోర్లు, కమర్షియల్ బిల్డింగ్‌కు ఐదు ఫ్లోర్లు అనుమతులు జారీ అవుతున్నాయి. ఆపైన కావాలంటే హెచ్ఎండీఏ ద్వారా జారీ చేస్తున్నారు. జీహెచ్ఎంసీలో విలీనం కావడంతో వాటిని సర్కిళ్లుగా మార్చారు. జీహెచ్ఎంసీ పరిధిలో అయితే సర్కిల్ స్థాయిలో నాలుగు ఫ్లోర్లు, జోనల్ స్థాయిలో ఐదు ఫ్లోర్లకు మాత్రమే అనుమతి ఇవ్వడానికి అధికారాలు ఉన్నాయి. ఆ పైన నిర్మాణ అనుమతులను ప్రధాన కార్యాలయం స్థాయిలో ఇస్తున్నారు. బిల్డ్‌నౌలో అవసరమైన మార్పులు చేశారు. దీంతో నిర్మాణ అనుమతుల దరఖాస్తుల ప్రక్రియ ప్రాసెస్ అందులో ఉంటుంది. అయితే వచ్చే కొన్ని సమస్యలు కూడా త్వరలో పరిష్కారం అవుతాయని అధికారులు చెబుతున్నారు.

# సరిహద్దుల్లో సర్జికల్ స్ట్రయిక్స్

## అఖండ-2లో బాలయ్య శివతాండవం

బాలకృష్ణకథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన 'అఖండ' ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో అందరికీ తెలిసిందే. అఘోరగా బాలకృష్ణ నటన, తమన్ సంగీతం, బోయపాటి టేకింగ్ సినిమాను విజయ పథంలో నడిపాయి. ఆ చిత్రానికి కొనసాగింపుగా ఇప్పుడు 'అఖండ2: తాండవం' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. టిబెట్ సరిహద్దుల్లో మొదలయ్యే కథ ఇది. శత్రుదేశమైన చైనాకు చెందిన ఆర్మీ అధికారులు మన భారతీయుల నమ్మకాల్ని దెబ్బకొట్టాలని కుంభమేళాని లక్ష్యంగా చేసుకుని బయోవార్‌కి దిగుతారు. వాళ్లు తలపెట్టిన కుట్రతో కుంభమేళాలో పవిత్రస్నానం చేసిన చాలామంది కొన్ని నిమిషాల వ్యవధిలోనే అపస్మారక స్థితికి చేరుకుంటుంటారు. అందుకు విరుగుడుగా డీఆర్‌డీవోలో శాస్త్రవేత్తలు యాంటీ డాట్ వాక్సిన్‌ని కనిపెడతారు. అది తెలుసుకున్న శత్రువులు ల్యాబ్‌ని నాశనం చేసి, శాస్త్రవేత్తలందరినీ చంపేస్తారు. ఆ బృందంలో ఉన్న యువ శాస్త్రవేత్త జనని (హర్షాలీ మల్హోత్రా) ఒక్కరే వ్యాక్సిన్‌తో బయటపడుతుంది. అది పసిగట్టిన శత్రవులు ఆమెని వెంటాడతారు. ఆమెని రక్షించేందుకు రుద్ర సికిందర్ అఘోరా (బాలకృష్ణ) రంగంలోకి దిగుతాడు. జనని ఆపదలో ఉన్న విషయం అఘోరాకి ఎలా తెలిసింది? శత్రువుల్ని అఘోరా ఎలా ఎదిరించి, భారతదేశం, సనాతన హైందవ ధర్మం గొప్పతనాన్ని ఎలా చాటి చెప్పారు? జననికీ, అనంతపురం ఎమ్మెల్యే బాల మురళీకృష్ణ (బాలకృష్ణ)కీ సంబంధం ఏమిటి? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ఈసారి కథని సరిహద్దులు దాటించారు దర్శకుడు బోయపాటి శ్రీను. అఘోరా పాత్రకు మరింత డోస్ పెంచి బాలకృష్ణతో సర్జికల్ స్ట్రైక్ చేయించారు. సనాతన ధర్మం, భారతీయుల నమ్మకాలు, వేదజ్ఞానాల గొప్పతనాన్ని అఘోరా పాత్రలోని బాలకృష్ణతో చెప్పిస్తూ సినిమాని నడిపించారు. మాస్ హీరోల్ని చూపించడంలో బోయపాటి శైలే వేరు. ఆయనకు బాలకృష్ణ తోడయ్యారంటే ఇక వెనక్కి తిరిగి చూసుకోరు. శివుడు పూనిన అఖండ పాత్ర కావడంతో బోయపాటి శ్రీను తనలోని మాస్ ఎలివేషన్లు మరింత పదునెక్కాయి. అయినా అక్కడ అఖండ పాత్ర కావడంతో నమ్మాల్సిందే అన్నట్టుగా ఉంటాయి ఆ సన్నివేశాలు. ఒకపక్క యాక్షన్... మరోవైపు పదునైన సంభాషణలతో సినిమాని నడిపించిన తీరు మెప్పిస్తుంది. అభిమానులకైతే థియేటర్లలో పూనకాలే. అంచనాలకి ఏమాత్రం తీసిపోకుండా సాగే సినిమా ఇది. అఖండ రీక్యాప్‌తో ఈ సినిమా మొదలవుతుంది. అక్కడి నుంచి టిబెట్ సరిహద్దుల దగ్గర సంఘర్షణ.. దేవుడిపై భారతీయులకు ఉండే నమ్మకంపైన దెబ్బ కొట్టాలని శత్రుదేశమైన చైనా పన్నాగం పన్నడం కోసం ఎలాంటి వ్యూహాల్ని రచించారు అన్నది సినిమాలో కీలకం. దీంతో ఎక్కువశాతం 'అఖండ' టెంప్లేట్‌లోనే సాగుతుంది. తొలి భాగంలో ఫ్యాక్షనిస్టులపై యుద్ధం చేస్తాడు మరో బాలకృష్ణ. ఇందులోనేమో మత్తు మందుల్ని సరఫరా చేసే అంతర్రాష్ట్ర ముఠాపై సమర శంఖం పూరిస్తాడు. బాలమురళీకృష్ణ పరిచయ సన్నివేశాలు, ఎలివేషన్లు మాస్ ప్రేక్షకులకు పండగే. ఆ తర్వాత సన్నివేశాలే కాస్త సాగదీతగా అనిపిస్తాయి. విరామానికి ముందు ఎపిసోడ్‌తో సినిమా మళ్లీ గాడిలో పడుతుంది. అఘోరా ప్రవేశంతో థియేటర్ దద్దరిల్లిపోతుంది. ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధం మరింత హైలైట్. బాలయ్య అసలు సిసలు తాండవం విరామం తర్వాతే మొదలు పెడతాడు. అఘోరా పాత్రలోని రెండు కోణాలూ తెరపై కనిపించి ప్రేక్షకుల్ని అలరిస్తాయి. తాంత్రికుడైన నేత్ర ఎపిసోడ్ మొదలుకొని హనుమాన్, శివుడు ఎపిసోడ్స్ సహా తల్లి సెంటిమెంట్, దేశభక్తి, హైందవధర్మం నేపథ్యం వరకూ దాదాపుగా ప్రతీ సన్నివేశం రోమాంచితమే. ముఖ్యంగా తల్లి దగ్గర సన్నివేశాల్లో మలుపు భక్తిని, భావోద్వేగాల్ని పంచుతుంది. సర్జికల్ స్ట్రైక్ అంటూ సరిహద్దుల్లో శత్రుసైన్యంతో తలపడే సన్నివేశాలు, వేదభూమి అయిన భారతదేశం గొప్పతనం గురించి చెప్పే సన్నివేశాలు సినిమాకి ప్రధానబలం.




## ఓటిటి కి వచ్చేసిన లేటెస్ట్ థ్రిల్లర్ : 12A రైల్వే కాలనీ




**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) డిసెంబర్ 12 :** గత నెలలో థియేటర్లో అల్లరి నరేష్ సినిమా విడుదలైన 12 A రైల్వే కాలనీ. గతంలో హైదరాబాద్లో జరిగిన ఓ నిజ జీవిత కథను ఆధారంగా చేసుకుని కెక్కిన ఈ సినిమా అంచనాలను అందుకుని ప్రేక్షకులను మెప్పించింది. ఇప్పుడు ఈ సినిమా ఇలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే డిజిటల్ స్ట్రీమింగ్ కు వచ్చేసింది. పొలిమేర చిత్రల దర్శకుడు అనిల్ విశ్వనాథ్ కథ అందించగా నాని కాసరగడ్డ దర్శకుడిగా ఎంట్రీ ఇచ్చాడు. కామాక్షి భాస్కర్ల, హర్ష చెముడు, గెటప్ శీను సద్దాం, జీవన్ ఇతర పాత్రలో నటించారు. ఇప్పుడు సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటి లో తెలుగు తోపాటు తమిళ్, మలయాళ భాషలోనూ స్ట్రీమింగ్కు వచ్చేసింది.

## అఖండ-2కు హైకోర్టులో ఊరట



'అఖండ 2' నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ కు తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఊరట దక్కింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ స్టే విధించింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై ఈ నెల 14 వరకూ డివిజన్ బెంచ్ స్టే ఇస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అఖండ2: తాండవం'. తెలంగాణలో ఈ మూవీ టికెట్ ధరల పెంపు, ముందస్తు ప్రీమియర్‌లపై గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీన్ని విచారించిన కోర్టు ప్రీమియర్ రద్దుతో పాటు, టికెట్ ధరలను పెంచకూడదంటూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ డివిజన్‌కు అప్పీల్ చేసుకుంది.




## అఖండ విడుదలతో థియేటర్ల వద్ద సందడి

బాలకృష్ణ సినిమా వచ్చిందంటే థియేటర్‌లలో పండగ వాతావరణం నెలకొంటుంది. ఆయన హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన 'అఖండ2: తాండవం' శుక్రవారం ప్రేక్షకుల ముందుకువచ్చి అలరిస్తోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'అఖండ'కు సీక్వెల్‌గా రూపొందిన ఈ సినిమాలో బాలకృష్ణ తన నటనతో ఆకట్టుకుంటున్నారు. థియేటర్‌ల వద్ద అభిమానులు సందడి చేస్తున్నారు. ప్రస్తుతం ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో సోషల్ మీడియాలో 'అఖండ 2' హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. మరోవైపు ఈ సినిమా చివర్లో 'అఖండ 3' కూడా ఉన్నట్లు చిత్రబృందం హింట్ ఇచ్చింది. 'జై అఖండ' పేరుతో మూడో భాగం రానున్నట్లు టైటిల్స్ వేయడంతో ఫ్యాన్స్ ఖుష్ అవుతున్నారు.

## తండ్రి అయిన టాలీవుడ్ హీరో తిరువీర్ : ఎమోషనల్ పోస్ట్

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) డిసెంబర్ 12 :** టాలీవుడ్ లో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు సాధించిన యువ హీరో తిరువీర్. చిన్న పాత్రతో మొదలై హీరోగా ఎదిగి ఆయన ప్రయాణం నేటి తరం నటులకు ఎంతో ప్రేరణత్మకం.2016లో బొమ్మలరామారం చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన ఆయన టక్ జగదీష్ ,మసుద వంటి వివిధ చిత్రాల్లో ప్రదర్శించిన సహజ నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. ఇటీవల విడుదలైన "ది గ్రేట్ ఫ్రీ వెడ్డింగ్ షో" సినిమా విజయం అతని మార్కెట్ను మరింత పెంచింది. తిరువీర్ వ్యక్తిగత జీవితంలో ఇప్పుడు కొత్త ఆనందం చేరింది. ఆయన భార్య కల్పన రావు పండంటి మొగ బిడ్డకు జన్మనివ్వడంతో తిరువీరు తండ్రి గా ప్రమోషన్ పొందాడు. ట్విట్టర్లో ఒక హృదయానికి హద్దుకునే ఫోటోను పోస్ట్ చేస్తూ "నాయినొచ్చిండు.... " అనే క్యాప్షన్ రాయడంతో ఆ పోస్ట్ క్షణాల్లో వైరల్ అయింది. ఈ పోస్ట్ బయటకు వచ్చిన వెంటనే అభిమానులు ఇండస్ట్రీ మిత్రులు అందరూ మీరు కు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్ల ద్వారా తెలిపారు.




## 3 రోజెస్..వెబ్ సీరిస్ రెండో సీజన్ రెడీ

తెలుగు ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్ 'ఆహా' లో సూపర్ హిట్ అయిన '3 రోజెస్' వెబ్ సిరీస్ ఇప్పుడు రెండవ సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సీజన్ 2 ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. మొదటి సీజన్‌లో ఇషా రెబ్బా, పాయల్ రాజ్‌పుత్, పూర్ణ ప్రధాన పాత్రల్లో నటించగా.. ఈ సీజన్ 2లో ఇషా రెబ్బాతో పాటు రాశీ సింగ్ మరియు కుషిత కల్లపు కొత్త 'రోజెస్'గా కనిపించనున్నారు. కమెడియన్ వైవా హర్షతో పాటు సత్య కూడా నవ్వులు పూయించడానికి రెడీగా ఉన్నారు. ఎస్.కె.ఎన్ నిర్మాణంలో, కిరణ్ కారవల్ల దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ డిసెంబర్ 13 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతం వైరల్‌గా మారిన ఈ ట్రైలర్‌ను మీరు కూడా చూసేయండి. ఈ వెబ్ సిరీస్‌కు కిరణ్ కె కరవళ్ళ దర్శకత్వం వహిస్తుండగా.. ఎస్కేఎన్ నిర్మిస్తున్నాడు.




## వారణాసి తరవాత మహేశ్‌తో వంగా డైరెక్షన్?

సూపర్ స్టార్ కృష్ణ నట వారసుడిగా టాలీవుడ్‌లో అడుగుపెట్టిన మహేష్ బాబు, తొలి సినిమాతోనే తండ్రికి తగ్గ తనయుడిగా గుర్తింపు పొందాడు. ప్రస్తుతం తెలుగు ఇండస్ట్రీలో ఉన్న అగ్రశ్రేణి స్టార్స్‌లో ఒకరిగా తన స్థానం పటిష్టం చేసుకున్నాడు మహేష్. ఇప్పుడు రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ వరల్డ్ సినిమా 'వారణాసి'తో ప్రపంచవ్యాప్తంగా తన సత్తా చూపించేందుకు సన్నద్ధమవుతున్నారు.. 'వారణాసి'తో వచ్చే ఇమేజ్‌ను నిలబెట్టుకోవడానికి తన తదుపరి కెరీర్ ఎ÷-లాన్‌ను మహేష్ అత్యంత జాగ్రత్తగా రూపొందిస్తున్నాడు. బాలీవుడ్ నుంచి పలువురు టాప్ డైరెక్టర్లు మహేష్ కోసం కథలు సిద్ధం చేసినప్పటికీ, ప్రస్తుతం ఆయన ఎవరి కథనూ వినట్లేదని తెలిసింది. ఇదిలా ఉండగా, ఒకప్పుడు సందీప్ రెడ్డి వంగా ? మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తుందని అనుకున్నా కూడా ఆ సినిమా అనుకోని కారణాల వల్ల ఆగిపోయింది. అయితే ఇప్పుడు ఆ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అయ్యే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ప్రభాస్‌తో స్పిరిట్ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న సందీప్ రెడ్డి వంగా, మహేష్ కోసం గతంలో చెప్పిన కథను మళ్లీ తీసుకొచ్చినట్లు సమాచారం. మహేష్ ,ఆయన భార్య నమ్రత కలిసి ఆ కథను పూర్తిగా చర్చించి, మహేష్ ఇమేజ్‌కి ఇది బాగా సరిపోతుందని భావించినట్టు తెలుస్తోంది. దీంతో సందీప్‌ను పిలిపించి సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ నడుస్తోంది. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన రావడానికి ఇంకా కొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది.



# బస్సుప్రమాదంపై ప్రధానమంత్రి మోదీ దిగ్భ్రాంతి

**- మృథుల కుటుంబాలకు 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన**

**- ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసని పవన్, మంత్రులు**



**అల్లూరిజిల్లా,డిసెంబర్12( వెలుతురు):**
అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసిపాకలు ఘాట్ రోడ్‌లో జరిగిన ప్రమాదంలో 10 మంది మృతిచెందగా.. 20మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారి వివరాలను అధికారులు వెల్లడించారు.అల్లూరి జిల్లా బస్సు ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ బస్సు ప్రమాదంలో ప్రాణనష్టం సంభవించడం చాలా బాధాకరమని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో బాధితులు, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 ఎక్స్ గ్రేషియా పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి ఇస్తున్నామని తెలిపారు. ఈ దుర్ఘటనలో 10 మంది దుర్మరణం పాలయ్యారని తెలిసి చింతిస్తున్నానని వివరించారు. ఈ ప్రమాదం జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని ప్రధాని మోదీ కోరారు. బస్సు ప్రమాదంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ఈ బస్సు లోయలోపడి ప్రయాణికులు దుర్మరణం చెందడం బాధాకరమని పేర్కొన్నారు. బస్సు లోయలో పడిన దుర్ఘటనలో 10 మంది దుర్మరణం పాలయ్యారని తెలిసి చింతిస్తున్నానని తెలిపారు పవన్ కల్యాణ్. ప్రమాదంపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో బస్సు.. లోయలో పడి పలువురు యాత్రికులు మృతిచెందడం చాలా బాధాకరమని తెలిపారు. భద్రాచలం నుంచి అన్నవరం వెళ్తుండగా ఈ ప్రమాదం జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మరణించిన వారి ఆత్మ శాంతించాలని భగవంతుడును ప్రార్థిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మారేడుమిల్లి బస్సు ప్రమాద ఘటనా స్థలానికి హుటాహుటిన బయలుదేరి వెళ్లారు హోం మంత్రి. ప్రైవేటు బస్సు లోయలో పడి యాత్రికులు దుర్మరణం చెందడంపై విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు హోం మంత్రి అనిత. బస్సు ప్రమాదంపై మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రైవేటు బస్సు లోయలో పడి యాత్రికులు మృతిచెందిన వార్త తన మనసును తీవ్రంగా కలిచి వేసిందని తెలిపారు. గాయపడిన వారికి అవసరమైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

# బస్సు ప్రమాదంపై కలెక్టర్ ఆరా

**- తక్షణ సహాయక చర్యలకు ఆదేశం**

**- మృతుల సంఖ్య పెరిగే అవకాశం**




**అల్లూరిజిల్లా,డిసెంబర్12( వెలుతురు):**
అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసిపాకలు ఘాట్ రోడ్‌లో జరిగిన బస్సు ప్రమాదంపై ఎప్పటికప్పుడు అధికారులతో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్ సమీక్షిస్తున్నారు. ఈ సందర్భంగా మీడియాతో కలెక్టర్ దినేశ్ కుమార్ మాట్లాడారు. అన్నవరం నుంచి అరకు మీదుగా భద్రాచలం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగిందని వెల్లడించారు. బస్సులో ఉన్న వారిలో ఇప్పటివరకు 10 మంది చనిపోయారని తెలిపారు. మొత్తం 22 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారని వివరించారు. మరికొంతమంది పరిస్థితి విషమంగా ఉందని చెప్పుకొచ్చారు. బస్సు ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆరుగురు వరకు చిన్న గాయాలతో సురక్షితంగానే ఉన్నారని వివరించారు. అక్కడ ఉన్నటువంటి సబ్ కలెక్టర్‌తో పాటు యంత్రాంగం.. అప్రమత్తమై వెంటనే సహాయక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి కారణమైన బస్సు చిత్తూరుకు చెందిన ఏవీఎం ట్రాన్స్‌పోర్టుకి చెందినదిగా తెలుస్తోంది. బస్సు ఓనర్ ఏకే రామ్మూర్తి మురుకంబట్టు ప్రాంతానికి చెందిన వాసి. టూర్ ఏజెంట్ వజ్రం అనే వ్యక్తి ద్వారా ఏడు రోజుల పాటు టూరుకు బస్సును బుక్ చేసకున్నారు. ఈనెల ఆరోతేదీన చిత్తూరు నుంచి ఈ బస్సు బయలుదేరింది.

# ప్రమాదస్థలిని పరిశీలించిన మంత్రి

**- క్షతగాత్రులకు ఆస్పత్రిలో పరామర్శ**

**- మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు, క్షతగాత్రులకు రూ.2లక్షల పరిహారం**




**అల్లూరిజిల్లా,డిసెంబర్12(వెలుతురు):**
అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదంలో 9 మంది మృతి చెందగా, పలువురికి గాయాలైన ఘటనలో క్షతగాత్రులను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. చింతూరు-మారేడుమల్లి ఘాట్‌రోడ్డు ప్రమాద స్థలిని రాంప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. చింతూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు, క్షతగాత్రులకు రూ.2లక్షల పరిహారం ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి అందుతున్న వైద్య సేవలపై మంత్రి ఆరా తీశారు. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, జిల్లా సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్, ఇతర అధికారులు ఉన్నారు.

# బస్సు ప్రమాదంపై మాధవ్ దిగ్భ్రాంతి

**అమరావతి,డిసెంబర్12( వెలుతురు):**
అల్లూరి జిల్లాలో బస్సు ప్రమాదంపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రైవేటు బస్సు లోయలో పడి యాత్రికులు దుర్మరణం చెందడం పట్ల మాధవ్ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. బాధితులకు సాయం అందించాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు.

# చింతలపూడి ఎత్తిపోతలు పూర్తి చేయండి

**- సిఎం చంద్రబాబుకు దేవినేని వినతి**



**అమరావతి,డిసెంబర్12( వెలుతురు):**
చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కోరారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రిని శుక్రవారం దేవినేని ఉమా కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన చింతలపూడి ఆవశ్యకత గురించి సీఎంకు వివరించారు. గోదావరి జలాలు ఈ ప్రాంతానికి వస్తే రైతులు ఇక్కట్లు తీరి సిరుల పంటలు పండుతాయని చెప్పుకొచ్చారు. ఉమ్మడి కృష్ణ, ఉభయ గోదావరి జిల్లాల్లోని 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. 35 మండలాల్లోని 25 లక్షల మందికి పైగా ప్రజలకు తాగునీరు అందిస్తోందని వెల్లడించారు. బృహత్తర పథకానికి గత తెలుగుదేశం హయాంలో శంకుస్థాపన చేసి శరవేగంగా పనులు జరిగాయని వివరించారు. ఇప్పటికే ఈ పథకానికి రూ. 4,170 కోట్లు వ్యయం చేశారని తెలిపారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని చెప్పుకొచ్చారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ అసమర్థ, అవినీతి పాలనలో ఆగిపోయిన ఈ ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులను అధిగమించి పూర్తి చేస్తామని దేవినేని ఉమా పేర్కొన్నారు.

# డబుల్ ఇంజన్‌తో రాష్ట్రంలో అభివృద్ధి

**- కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయం ప్రారంభంలో లోకేశ్**



**విశాఖపట్టణం,డిసెంబర్12( వెలుతురు):**
ఏపీ ప్రభుత్వం ఐటీకి ప్రాధాన్యం ఇస్తోందని ఐటీ మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం నాడు రుషికొండ ఐటీ పార్క్‌లోని హిల్-2పై మహతి ఫిన్టిక్ భవనంలో కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్లు డబుల్ ఇంజన్ సర్కార్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని తెలిపారు. ఏపీని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఇప్పటికీ సీఎం రాత్రి పది వరకు శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐటీకి ఇస్తున్న ప్రాధాన్యతతో ఇతర రాష్ట్రాలు అసూయ చెందుతున్నాయని వ్యాఖ్యలు చేశారు. కంపెనీల యాజమాన్యంతో ఎలాంటి లావాదేవీలు చేయమని.. కేవలం భూమి పూజ అలాగే రిబ్బన్ కటింగ్‌లకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాబోతున్న ఐటీ కంపెనీలకు ఉద్యోగులు నిబద్ధతో పని చేయాలని సూచించారు. విశాఖ ప్రజలు రౌడీలను తరిమేశారని.. ఇప్పుడు విశాఖపట్నం ఒక ఎకనామిక్ రీజన్‌గా మారిందన్నారు. 2047 నాటికి ఏపీ బ్జడెట్ 2.4 ట్రిలియన్లకు చేరుతుందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. కాగా.. విశాఖ మధురవాడ ఐటీ హిల్స్‌లో పలు కార్యాలయాలకు మంత్రి భూమి పూజ చేశారు. టెక్ తమ్మిన, నాన్ రెల్ టెక్నాలజీస్, ఏసీఎన్ ఇన్ఫోటెక్ లిమెడెట్‌కు శంకుస్థాపనలు చేశారు. హిల్-4లో సత్వాస్ వాంటేజ్ వైజాగ్ క్యాంపస్, ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్‌లకు మంత్రి లోకేష్ భూమి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.







Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com